అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 4-1-2024
సంపుటి : 10 సంచిక : 04 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50



సిరాజ్ సిక్సర్
- హైదరాబాదీ ఆరు వికెట్ల ప్రదర్శన
- దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 55/10

వివరాలు ఆటలులో..

ఆర్టీసీకి నిధులిస్తాం
- ప్రతి నెల 'మహాలక్ష్మి' సొమ్ము చెల్లిస్తాం
- చార్జీలు పెంచొద్దు
- అంతర్గత సామర్థ్యం పెంచుకోండి: టీఎస్ఆర్టీసీపై సమీక్షలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

3లో..

సిట్ అవసరం లేదు
- అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంపై సుప్రీం తీర్పు



3లో..

దురదృష్టకరం
- అసంతృప్తిని కలిగించింది
- తీర్పుపై సీపీఐ(ఎం)

12 నుంచి బడులకు సంక్రాంతి సెలవులు
- 13 నుంచి జూనియర్ కాలేజీలకు

వివరాలు 3లో

సీఎంఓ నుంచి స్మితా సబర్వాల్ బదిలీ
- రాష్ట్రంలో మరోసారి భారీగా ఐఏఎస్‌లకు స్థానచలనం
- సీఎం సంయుక్త కార్యదర్శిగా సంగీతా సత్యనారాయణ
- నీటి పారుదల శాఖ కార్యదర్శిగా రాహుల్ బొజ్జా : ఉత్తర్వులు జారీ

వివరాలు 3లో

రాష్ట్రంలో 44 మంది పోలీసు అధికారుల బదిలీ
- 23 మంది ఐపీఎస్ ఆఫీసర్లు
- 21 మంది నాన్‌క్యాడర్ ఎస్పీలు

వివరాలు 5లో

పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో నిర్ణయాలు

అన్ని స్థానాలు మనవే.. అసెంబ్లీ ఎన్నికల స్ఫూర్తితో పని చేయాలి

- ఇందిరమ్మ గ్రామ కమిటీల ఏర్పాటు
- 8,9 తేదీల్లో ఉమ్మడి జిల్లాల కమిటీలతో సమావేశాలు
- 11,12,13 తేదీల్లో పార్లమెంటరీ నియోజకవర్గాల్లో మంత్రుల సమీక్షలు
- రాష్ట్రం నుంచి సోనియా గాంధీ పోటీకి తీర్మానం
- త్వరలో కార్పొరేషన్లకు చైర్మెన్లు



టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం పిలుపునిచ్చింది. అసెంబ్లీ ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకుని 17 ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరింది. ఆరు గ్యారంటీలు పకడ్బంధీగా అమలు చేసేందుకు ఇందిరమ్మ గ్రామ కమిటీలు వేయాలని నిర్ణయించింది. కష్టపడి పని చేసిన వారిని గుర్తించి, వారికి సముచిత గౌరవాన్ని ఇచ్చేందుకు ఏఐసీసీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించింది. ఎన్నికల్లో ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులను అభివృద్ధిలో భాగస్వాములను చేస్తామని భరోసానిచ్చింది. వీలైనంత త్వరగా వివిధ కార్పొరేషన్లకు చైర్మెన్లు నియమించాలని నిర్ణయించి, అందుకు సంబంధించిన జాబితాను సిద్ధం చేసే బాధ్యత కొత్త ఇన్‌చార్జి దీపాదాస్ మున్షికి అప్పగించింది. ఆ జాబితాను అధిష్టానానికి పంపించి అక్కడ ఆమోదం తీసుకోనుంది. కార్యకర్తలను, నాయకులను ఎన్నికలకు సిద్ధం చేసేందుకు ఈనెల 8, 9 తేదీల్లో ఉమ్మడి జిల్లా కమిటీలతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ కావాలని నిర్ణయించింది. ఇప్పటికే పార్లమెంటు నియోజకవర్గాలకు నియమించిన ఇన్‌చార్జీ మంత్రులు కూడా ఈనెల 11, 12,13 తేదీల్లో సమీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీకి అభినందనలు తెలుపుతూ, తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఎంతో సమన్వయంతో పని చేసిన మాణిక్ రావు ఠాక్రేను అభినందిస్తూ, రాబోయే లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి సోనియా గాంధీ పోటీ చేయాలని కోరుతూ తీర్మానాలు చేశామని తెలిపారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. వీలైనంత త్వరగా పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి, వారికి సముచిత స్థానం కల్పించే బాధ్యత పార్టీ తీసుకుంటుందన్నారు. బోర్లా పడి బొక్కలు విరిగినా బీఆర్ఎస్‌కు బుద్ధి రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడవకముందే కాంగ్రెస్ హామీలపై పుస్తకాలు విడుదల చేస్తున్నారని విమర్శించారు. చెరుకు తోటల్లో పడిన అడవి పందుల్లా తెలంగాణను బీఆర్ఎస్ దోచుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ విమర్శలను ధీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈనెల 20 తర్వాత క్షేత్రస్థాయి పర్యటనల్లో పాల్గొంటానన్నారు. 'బీజేపీ అధ్యక్షులు, జీ కిషన్‌రెడ్డికి ఆదాయం తగ్గినట్టుందనీ, అందుకే కాళేశ్వరంపై సీబీఐ ఎంక్వయిరీ కోరుతున్నారని ఎద్దేవా చేశారు. నాడు స్వయంగా నేను సీబీఐ ఎంక్వయిరీ కోరినప్పుడు ఏం

...3లో

ప్రజా పోరాటాలకు మరో విజయం

పాలక పక్షాల మెడలు వంచుతున్న ప్రజా సమూహాలు

- పార్టీలకు పాఠం నేర్పుతున్న ఉద్యమాలు



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ట్రక్కు డ్రైవర్లు చేపట్టిన ఆందోళనకు శుభం కార్డు పడింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జరిపిన చర్చల నేపథ్యంలో సమ్మె ముగిసింది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టంలో హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి నిర్దేశించిన కఠిన శిక్ష ఇంకా అమలులోకి రాలేదని, ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరిపిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో డ్రైవర్లు శాంతించారు. ఇక్కడ 'సంప్రదింపులు' అనే పదమే కీలకంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఓ మెట్టు దిగివచ్చి చర్చలకు తలుపులు తెరవడం వల్లనే రెండు రోజులుగా జరుపుతున్న ఆందోళనను ట్రక్కు డ్రైవర్లు విరమించారు. చాలా కాలం తర్వాత మోడీ ప్రభుత్వం నోట 'సంప్రదింపులు' అనే మాట విన్పించింది. పార్లమెంటులో మందబలాన్ని ఆసరాగా చేసుకొని ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. కీలక బిల్లులపై చట్టసభలో అర్థవంతమైన చర్చలకు ఆస్కారమే లేకుండా పోతోంది. పార్లమెంటులో చోటుచేసుకున్న భద్రతా వైఫల్యంపై ప్రధాని, హోం మంత్రి వివరణ ఇవ్వాలని అడిగినందుకు ప్రతిపక్ష ఎంపీలను మూకుమ్మడిగా సస్పెండ్ చేసి బయటికి గెంటేశారు. కానీ, ఉవ్వెత్తున ఎగసిపడుతున్న ప్రజా ఉద్యమాలను నిలువరించలేకపోతున్నారు. మన దేశంలో వీధి పోరాటాలు కొత్తేమీ కాదు. సామాజిక అంశాలపై ఎప్పటికప్పుడు స్పందించే పౌర సమాజాలు లేదా సమూహాలు వీధుల్లోకి వచ్చి శక్తివంతమైన పోరాటాలు చేస్తూనే ఉన్నాయి. పాలకులకు బలమైన సంకేతాలు పంపుతూనే ఉన్నాయి. తమను ఎంతమాత్రం పట్టించుకోని ప్రభుత్వాలపై ఆగ్రహంతో ఉన్న ప్రజలు తరచూ ప్రతిఘటన చర్యలకు దిగడం చూస్తూనే ఉన్నాం.

సీఏఏకు వ్యతిరేకంగా...

2019 డిసెంబర్ 12న కేంద్ర ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) తీసుకొచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున

...13లో

కార్మికుల వీరోచిత పోరాటానికి అభినందనలు
- భవిష్యత్‌లోనూ ఇలాంటి ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలి : ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి
- మోడీ పాలనలో రోడ్డు రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుందని వ్యాఖ్య

వివరాలు 13లో

లోటుపాట్లను సరిదిద్దుకోవాల్సింది..

పార్టీ నిర్మాణంపై దృష్టి పెడితే బావుండేది...

- బీఆర్ఎస్ గెలవకపోతే తెలంగాణ పదం మాయమవుతుంది : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు
- 'కాంగ్రెస్ 420' హామీలపై బుక్‌లెట్ విడుదల
- వంద రోజుల్లో హామీలు అమలు చేయకపోతే ప్రజలు బొంద పెడతారంటూ కాంగ్రెస్‌కు హెచ్చరిక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత పదేండ్ల పాలనతోపాటు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ వైపు నుంచి కొన్ని పొరపాట్లు, తప్పిదాలు దొర్లిన మాట వాస్తవమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంగీకరించారు. వాటిని సరిదిద్దుకుని ఉంటే మెరుగైన ఫలితాలు వచ్చేవని ఆయన అభిప్రాయపడ్డారు. తాము పార్టీ నిర్మాణంపై దృష్టి సారిస్తే బావుండేదని అన్నారు. ఈ ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకుంటామనీ, తద్వారా పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ పార్లమెంటు స్థానాల వారీగా

...13లో

మోడీ సెల్ఫీ ఖర్చు చెప్పాడని బదిలీ

సెంట్రల్ రైల్వే సీపీఆర్ఓకు 'బహుమతి'



న్యూఢిల్లీ : రైల్వే స్టేషన్లలో ప్రధాని నరేంద్ర మోడీ '3డీ సెల్ఫీ పాయింట్ల'ను ఏర్పాటు చేసినందుకు ఎంత ఖర్చు అయిందో చెప్పడమే ఆయన చేసిన నేరం. బహుమతిగా ఆ అధికారిపై బదిలీ వేటు వేశారు. రైల్వే స్టేషన్లలో ప్రధాని కటౌట్లతో ఏర్పాటుచేసిన సెల్ఫీ పాయింట్ల కోసం ఎంత ఖర్చు చేశారో చెప్పాలంటూ సామాజిక కార్యకర్త అజయ్ బోస్ సమాచార హక్కు చట్టం కింద దేశంలోని ఐదు రైల్వే జోన్లకు దరఖాస్తులు పంపారు. సెంట్రల్ రైల్వేకి చెందిన సీపీఆర్ఓ శివరాజ్ మన్స్‌పుర్యార్ ఈ దరఖాస్తుకు సమాధానం పంపారు. అదే ఆయన చేసిన నేరం...పదవీకాలం మరో రెండు సంవత్సరాలు ఉండగానే శివరాజ్‌కు బదిలీ ఉత్తర్వులు అందజేశారు.

2011 బ్యాచ్‌కి చెందిన ఐఆర్‌టీఎస్ అధికారి శివరాజ్ సెంట్రల్ రైల్వే పీఆర్ఓగా గత సంవత్సరం మేలోనే బాధ్యతలు స్వీకరించారు. ఎలాంటి కారణం చూపకుండానే ఆయనను డిసెంబర్ 29న సెంట్రల్ రైల్వే ముంబయి కేంద్ర కార్యాలయం బదిలీ చేసింది. తదుపరి పోస్టింగుపై కూడా ఆయనకు ఇప్పటివరకూ సమాచారం ఇవ్వలేదు. శివరాజ్ స్థానంలో స్వప్నిల్ డి నీలాను నియమించారు. అయితే ఇక్కడ గమనించాల్సిన ఆసక్తికరమైన విషయం ఒకటుంది. శివరాజ్ బదిలీకి ఒక రోజు ముందు...అంటే డిసెంబర్ 28న జనరల్ మేనేజర్లు, డివిజనల్ రైల్వే మేనేజర్లకు రైల్వే బోర్డు ఓ సమాచారం

...13లో



ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంపై ఎగసిపడిన జనాగ్రహం

పెద్దఎత్తున తరలివచ్చిన రైతులు, ప్రజలు

- దిలావర్‌పూర్‌లో ఉద్రిక్తత
- పనులు నిలిపేదాక కదలబోమంటూ బైటాయింపు
- ఫర్నిచర్ ధ్వంసం.. కారుకు నిప్పు
- గోడలు, గుడారాల కూల్చివేత
- పోలీసుల లాఠీచార్జి
- నేడు బంద్‌కు పిలుపు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల సరిహద్దు పంటపొలాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతమైంది. కొన్ని నెలలుగా ప్రజలు వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. అయినా నాయకులు, అధికారుల్లో ఎలాంటి చలనం రాకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఫ్యాక్టరీ సరిహద్దు గ్రామాల రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో బుధవారం ఆ భూముల్లోకి చొరబడ్డారు. ఫ్యాక్టరీ పనులు పూర్తిగా నిలిపేసేవరకు కదిలే ప్రసక్తే లేదని రైతులు ఫ్యాక్టరీ సమీపంలో భీష్మించుకు కూర్చున్నారు. పనులు నిలిపివేయాలని సిబ్బందిని హెచ్చరించారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని కార్మికులకు గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. దాంతో కార్మికులు మూటముల్లె సర్దుకుని ఇంటిదారి పట్టారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఫ్యాక్టరీ గోడలను ఆందోళనకారులు కూల్చేశారు. ఫర్నీచర్ ధ్వంసం చేసి, గుడారాలను పడగొట్టారు. నిర్మాణ సామాగ్రి సెంట్రింగ్, ఇనుప చువ్వలను వంచేశారు. వాహనాల టైర్లలో గాలి తీసేశారు. ఫ్యాక్టరీకి సంబంధించిన కారుకు

...13లో

ఇరాన్‌లో జంట పేలుళ్లు

103మంది మృతి, వందలమందికి గాయాలు



టెహరాన్ : ఇరాన్ సైనిక ఉన్నతాధికారి సంస్మరణ కార్యక్రమంలో జరిగిన జంట పేలుళ్ల ఘటనలో 103మంది మరణించగా, మరో 141మంది గాయపడ్డారని స్థానిక మీడియా తెలిపింది. ఇరాన్ ఆర్మీ జనరల్ ఖాసిం సోలెమని వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి సమీపంలో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో పెద్ద పేలుడు సంభవించింది. ఆ వెంటనే నిముషాల వ్యవధిలో రెండో పేలుడు శబ్దం కూడా వినిపించిందని మీడియా వార్తలు తెలిపాయి. పేలుళ్ళకు గల కారణాలేంటనే వివరాలు వెంటనే తెలియరాలేదు. అయితే పేలుళ్ళతో అక్కడంతా తొక్కిసలాట జరగడంతో అనేకమంది

...13లో

అమర్ రాజా భారీ పెట్టుబడులు

రూ.9,500 కోట్లతో ఈవీ, న్యూ ఎనర్జీ హబ్ ఏర్పాటు

- భవిష్యత్‌లో మరింత విస్తరణకు ప్రణాళిక
- సీఎం రేవంత్‌రెడ్డితో కంపెనీ చైర్మెన్ గల్లా జయదేవ్ చర్చలు

3లో..



మళ్లీ తెరపైకి తెలంగాణ అస్తిత్వం..

లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ వ్యూహమిదే...


- అదే శ్రీరామ రక్ష అని భావిస్తున్న అధిష్టానం
- గతంలో తమది జాతీయ పార్టీ అని ప్రకటించిన కేసీఆర్
- అందుకు భిన్నంగా తిరిగి ప్రాంతీయ వాదన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అభివృద్ధి మంత్రాన్ని జపించిన బీఆర్ఎస్... ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల కోసం తెలంగాణ అస్తిత్వాన్ని మళ్లీ తెరపైకి తెస్తోంది. 'తెలంగాణ అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే తెలంగాణ' అనే నినాదాన్ని మరోసారి ఎత్తుకోవటం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో కొంతలో కొంత మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఆ పార్టీ శతవిధాలా ప్రయత్నిస్తోంది. అందుకోసం నేతలు తీవ్రంగా మేధోమథనం చేస్తున్నారు. తెలంగాణ అస్తిత్వ నినాదమే తమకు శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ అధిష్టానం సైతం భావిస్తోంది. అందుకనుగుణంగానే కార్యాచరణ రూపొందించనుంది. బుధవారం నుంచి ప్రారంభమైన పార్లమెంటరీ నియోజకవర్గాల వారీ సన్నాహక సమావేశాల్లో ఈ మేరకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. ఆ సమావేశానంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సైతం ఆయన 'అస్తిత్వ' నినాదాన్నే పలుమార్లు చెప్పుకొచ్చారు.

'తెలంగాణ గళం-తెలంగాణ బలం-తెలంగాణ దళం బీఆర్ఎస్' అంటూ కేటీఆర్ ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. వాస్తవానికి తెలంగాణ అస్తిత్వ నినాదం ఆధారంగానే

...13లో





రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరిస్తాం

- క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి పొన్నం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరిస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను బుధవారం హైదరాబాద్‌లో ఆయన ఆవిష్కరించారు. రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలతో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య వినతిపత్రం సమర్పించారు. జీవోనెంబర్ 102 ప్రకారం ప్రభుత్వ దవాఖాన, పోలీసు శాఖలు, విద్యాసంస్థల్లో బట్టలు శుభ్రం చేసే వృత్తి కాంట్రాక్టు రజక సొసైటీలకు ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోకు మార్గదర్శకాలను వెంటనే విడుదల చేయాలని సూచించారు. రజక, నాయీ బ్రాహ్మణులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకంలో పెండింగ్ బిల్లులున్నాయనీ, వాటిని చెల్లించాలంటూ అధికారులు బెదిరిస్తున్నారని తెలిపారు. ఆ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం, ఫెడరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని సూచించారు. ప్రతి వృత్తిదారుడికీ ఆర్థిక సహాయం అందించాలని కోరారు. మోడ్రన్ దోబీఘాట్‌లన్నింటికీ సోలార్ విద్యుత్‌ను అందించాలని తెలిపారు.

లాండ్రీ వర్కర్లకు మోపెడ్ వాహనాలను అందించాలని పేర్కొన్నారు. వాటిపై మంత్రి స్పందిస్తూ త్వరలోనే రజక సంఘాలు, అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి వెంకటస్వామి, ఎం గోపాల్, ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులు కె జిత్తయ్య, పోచయ్య, రంగారెడ్డి జిల్లా నాయకులు సిహెచ్ నగేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు శోభ, చంద్రకళ, రేవల్లి నరేష్, సట్టు రవి, అబ్బే శ్రీనివాస్, కృష్ణ, మహేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా సిటీని వేరే చోటికి తరలించాలి

- జాతీయ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మెన్ కోదండరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాలుష్య కారక పరిశ్రమ ఫార్మా సిటీని ముచ్చర్ల ప్రాంతం నుంచి వేరో చోటికి తరలించాలని జాతీయ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మెన్ కోదండరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం అయన మాట్లాడుతూ ఫార్మా సిటీ కోసం ముచ్చర్ల, కందుకూరు ప్రాంతాల్లో దళిత, గిరిజన, చిన్న సన్నకారు రైతుల భూములను గత ప్రభుత్వం బలవంతంగా లాక్కుందని అన్నారు. ఫార్మాసిటీని వేరే చోటికి తరలించి భూములు కోల్పోయిన వారికి తిరిగివ్వాలని అయన సూచించారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, పర్యావరణ వేత్త నర్సింహారెడ్డి, శాస్త్రవేత్త బాబూరావు తదితరులు ఉన్నారు.

బీసీల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా బీసీలకు విద్య, ఉపాధి అవకాశాల్లో కల్పనలో కృషి చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ పనితీరు, గురుకుల విద్యాలయాలు, బీసీ కార్పొరేషన్ రుణాలు , ఆత్మగౌరభవనాలు, ఫెడరేషన్లకు సంబంధించిన విషయాలపై మంత్రి సమీక్షించారు. బీసీల సంక్షేమం, వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడం కోసం నిబద్దతతో పని చేయాలని అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల ఫీజు గడువు 8 వరకు పొడిగింపు

- ఆలస్య రుసుం రూ.500తో చెల్లించే అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదోతరగతి పరీక్షలు-2024 మార్చిలో హాజరయ్యే విద్యార్థుల ఫీజు చెల్లింపు గడువును ఈనెల ఎనిమిదో తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలస్య రుసుం రూ.500తో ఈనెల ఎనిమిది వరకు ఫీజు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని తెలిపారు. ఆయా తేదీల్లో సాధారణ సెలవులుంటే మరుసటి రోజు ఫీజు చెల్లించొచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని ఫీజు చెల్లించని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులు ఇతర సమాచారం కోసం www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలో మార్చి 18 నుంచి పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్న విషయం తెలిసిందే.

ఆదర్శవంతం సావిత్రిబాయి ఫూలే జీవితం

- ఎస్వీకే వెబినార్‌లో వక్తలు



ఎమ్ సంయుక్త



డాక్టర్ హారతి వాగీశన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆధునిక భారత తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి ఫూలే జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని వక్తలు అభిప్రాయపడ్డారు. జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే జీవిత చరిత్రలు చాలా అలస్యంగా చరిత్ర పుటల్లోకి చేరాయనీ, 1990 దశకంలో ఆ ఆదర్శ దంపతులు దక్షిణాదికి పరిచయం అయ్యారని వివరించారు. సావిత్రిబాయి ఫూలే 193వ జయంతి సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే) ఆధ్వర్యంలో 'సావిత్రిబాయి ఫూలే-సమగ్ర అవగాహన' అంశంపై వెబినార్ జరిగింది. ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయ కర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో నల్సార్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హారతి వాగీశన్, స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్ఐ) ఉపాధ్యక్షురాలు ఎమ్ సంయుక్త మాట్లాడారు. శూద్రులు, అతి శూద్రులకు విద్య చెప్పేందుకు ఫూలే దంపతులు ముందుకొచ్చారనీ, వారి త్యాగాన్ని, జీవితాల్ని సమాజానికి తెలియకుండా మరుగున పడేశారని ఆక్షేపించారు. వామపక్ష, అభ్యుదయవాదులు వారి జీవితాల్ని ప్రచారం చేసే బాధ్యతలు తీసుకున్నారనీ, వాటిలో యూటీఎఫ్ వంటి ఉపాధ్యాయసంఘాలు తీవ్రమైన కృషి చేశాయని వివరించారు. అగ్రవర్ణ ఆధిపత్యం, శూద్రుల్లోని ఉప కులాల ఆధిపత్య నియంత్రణ విద్య ద్వారానే సాధ్యమవుతుందని ఫూలే దంపతులు సంపూర్ణంగా విశ్వసించి, అమల్లోకి తెచ్చారనీ, ఈ క్రమంలో అనేక అవమానాలు, దాడులు, ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారని చెప్పారు. లక్ష్యం మంచిదైనప్పుడు అవరోధాలను ఎదుర్కోవాలని జ్యోతిబా ఫూలే చెప్పేవారని గుర్తుచేసుకున్నారు. సమాజంలోని అంధవిశ్వాసాలపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తూ, కులాంతర, మతాంతర, పునర్వివాహాలను ప్రోత్సహించారని వివరించారు. వారు 1842లో మొదటి పాఠశాల ప్రారంభించినప్పుడు అగ్రవర్ణాల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారనీ, కానీ లక్ష్యాన్ని నమ్ముకున్న జ్యోతిబా ఫూలే దంపతులు ఎక్కడా వెనక్కి తగ్గలేదని అన్నారు. రాజకీయ, ఆర్థిక దోపిడీలో వచ్చే వేగవంతమైన మార్పులు, ప్రజల్లో సామాజిక సాంస్కృతికంగా రావని విశ్లేషించారు. సమాజంలో అట్టడుగు వర్గాలకు కాస్తంత మద్దతు ఇచ్చి, చేయూతనిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారనీ, ప్రస్తుతం దేశంలో మనువాదం మరోసారి విస్తరిస్తున్న సమయంలో సావిత్రిబాయి ఫూలే జీవితం నుంచి అనేకం నేర్చుకోవల్సి ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారనీ, కులాల వారీగా గురుకులాలు ఏర్పాటు చేసి, ఇతరుల్ని విద్యకు దూరం చేసే చర్యలు మళ్లీ కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలో స్వాతంత్ర్య పోరాటంతో పాటు కుల, స్త్రీ పురుష అసమానతలు, అంటరానితనం, అవిద్య, స్త్రీ విద్య, అగ్రవర్ణ వైధవ్యం వంటి అంతర్గత పోరాటాలు ఉన్నాయని విశ్లేషించారు. సావిత్రిబాయి ఫూలే పోరాటం సామాన్యమైంది కాదనీ, శూద్ర, అతిశూద్ర పిల్లలకు చదువు చెప్పడాన్నే ఉద్యమంగా చేపట్టారన్నారు. బ్రాహ్మణేతర తాత్వికుల గురించి చరిత్రలో చెప్పబడలేదనీ, ఉత్పత్తి కులాల నుంచి బ్రాహ్మణేతరులువేసే ప్రశ్నల గురించి సమాజానికి తెలియాల్సిన విషయాలు అనేకం ఉన్నాయని చెప్పారు.



ఎస్ వినయకుమార్

'నీ స్థాయి ఎంత?' అంటూ ఆగ్రహం..కలెక్టర్‌పై బదిలీ వేటు

భోపాల్: 'హిట్ అండ్ రన్' కేసులకు సంబంధించి 'భారత న్యాయ సంహిత'లోని నిబంధనలపై ట్రక్కు డ్రైవర్లు ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మధ్యప్రదేశ్‌లోని శాజాపూర్ జిల్లాలో డ్రైవర్ల సంఘం ప్రతినిధులతో స్థానిక కలెక్టర్ వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. 'నీ స్థాయి ఎంత?' అంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడంతో.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. బుధవారం నాడు ఆయనపై బదిలీ వేటు వేసింది. తమ పాలనలో ఇటువంటి భాష సహించేదే లేదని సీఎం మోహన్ యాదవ్ హెచ్చరించారు. ఆందోళనల నేపథ్యంలో మంగళవారం ఓ డ్రైవర్ల సంఘం ప్రతినిధులతో శాజాపూర్ కలెక్టర్ కిశోర్ కన్యాల్ సమావేశమయ్యారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దంటూ వారిని హెచ్చరించారు.

అంతలోనే.. తమతో సరిగ్గా మాట్లాడాలంటూ ఓ ప్రతినిధి కోరాడు. దీంతో ఆగ్రహానికి గురైన కలెక్టర్.. 'నువ్వేం చేయగలవు? నీ స్థాయి ఎంత?' అంటూ విరుచుకుపడ్డారు. ఏ 'స్థాయి' లేనందునే తాము ఈ పోరాటం చేస్తున్నామని ప్రతినిధి బదులిచ్చాడు. ఇద్దరి మధ్య వాగ్వాదానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అనంతరం ఈ ఘటనపై కలెక్టర్ విచారం వ్యక్తం చేశారు.

సావిత్రిబాయి ఫూలే స్ఫూర్తితో విద్యా, ఉపాధి కోసం ఉద్యమిద్దాం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి ఫూలే స్ఫూర్తితో విద్యా, ఉపాధి అవకాశాల కోసం ఉద్యమిద్దామని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి పిలుపునిచ్చారు. ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమిలో సావిత్రిబాయి ఫూలే జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి ఆర్ఎల్ మూర్తి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ సావిత్రిబాయి ఫూలే జయంతి అంటే దండ వేసి దండం పెట్టడం మాత్రమే కాదని ఆమె జీవిత త్యాగాలను ప్రతి విద్యార్థి చదవాలని కోరారు. మనుధర్మ శాస్త్రం ఆధిపత్య భావజాలానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన వీర వనిత ఆమె అని అన్నారు. మహిళలు, విద్యార్థినిలు సావిత్రిబాయి ఫూలే స్ఫూర్తితో హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం



ముసుగులో విద్యారంగంలోకి మనుధర్మ శాస్త్రాన్ని ప్రవేశ పెడుతున్నరని విమర్శించారు. దేశంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నదని చెప్పారు. సావిత్రిబాయి ఫూలే పేరుతో విద్యార్థినిలకు రాష్ట్ర ప్రభుత్వం ఫెలోషిప్ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత మాట్లాడుతూ మోడీ ప్రభుత్వానికి మహిళల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లు అమల్లో వారి కపట వైఖరి కనబడిందని చెప్పారు. అశ్లీల సాహిత్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ అధ్యక్షులు లెనిన్ గువేరా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

17 వరకు అభయహస్తం దరఖాస్తుల డాటా ఎంట్రీ పూర్తి : సీఎస్ శాంతికుమారి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల డాటా ఎంట్రీలను ఈ నెల 17 వరకు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజాపాలన నిర్వహణ, దరఖాస్తుల డాటా ఎంట్రీలపై జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో నిర్వహిస్తున్న గ్రామ సభలను ఏ విధమైన ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహిస్తుండటం పట్ల జిల్లా కలెక్టర్లను సీఎస్ అభినందించారు. ఈ నెల ఆరో తేదీన ప్రజాపాలన ముగిసిన వెంటనే అందిన దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను మండల కేంద్రాల్లో చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. మండల రెవెన్యూ అధికారులు, మండల డెవలప్ మెంట్ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ డాటా ఎంట్రీ చేపట్టాలని, ప్రజాపాలన కార్యక్రమం సూపర్వైజరీ అధికారిగా ఉన్న జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షించాలని తెలిపారు.

ఈ డాటా ఎంట్రీ చేపట్టేందుకు గాను జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర స్థాయిలో ట్రెయినీ అఫ్ ట్రైనర్‌లకు నాలుగో తేదీన శిక్షణ ఇస్తామనీ, వీరు జిల్లా స్థాయిలో డాటా ఎంట్రీ ఏవిధంగా చేయాలన్న దానిపై ఐదో తేదీన శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఈ నెల ఐదో తేదీ నుంచి 17వ తేదీ వరకు అభయహస్తం దరఖాస్తుల డాటా ఎంట్రీ పూర్తి చేయాలని, ఈ డాటా ఎంట్రీ సందర్భంగా, దరఖాస్తుదారుల వివరాల నమోదులో ఆధార్ నెంబర్, వైట్ రేషన్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకుగాను, జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న డీటీపీ ఆపరేటర్ల సేవలను ఉపయోగించుకోవాలని సీఎస్ సూచించారు. దాదాపు 57 లక్షల దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినందున, దరఖాస్తు ఇవ్వని వారు, మరోసారి తిరిగి దరఖాస్తులు అందచేయవచ్చని తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, పంచాయితీ రాజ్ కమిషనర్ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

అద్దెగర్భం చట్టాలను తప్పక పాటించాలి : డాక్టర్ ఎస్.పద్మజ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏఆర్‌టీ సరోగసీ (అద్దెగర్భం) రెగ్యులేటరీ చట్టాలను తప్పక పాటించాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.పద్మజ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏఆర్‌టీ సరోగసీ రెగ్యులేటరీ చట్టం, సమగ్ర గర్భస్థ సంరక్షణ, పీసీపీఎన్‌డీటీ చట్టాలపై నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ చట్టాలను పాటించేందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.కె.సుమిత్రా నాయర్, ఎయిర్ పోర్ట్ ఆర్గనైజేషన్ సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ, అను ఫెర్టిలిటీ గైనకాలజిస్ట్ డాక్టర్ కె.అనురాధ, ఒయాసిస్ హాస్పిటల్ ఎంబ్రియాలజిస్ట్ కృష్ణచైతన్యతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 150 మంది గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సన్మానించిన ఓయూ నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లను ఓయూ నేతలు సన్మానించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో టీపీసీసీ అధికార ప్రతినిధి ఓయూ జేఏసీ చైర్మెన్ లోకేష్ యాదవ్ ఆధ్వర్యంలో నేతలు వారిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కతో నాయకులు కేక్ కట్ చేయించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేసిన ఫోటోలను ఓయూ జేఏసీ చైర్మెన్ లోకేష్ కుమార్ యాదవ్ ఈ సందర్భంగా భట్టి విక్రమార్కకు బహూకరించారు. ఈ సందర్భంగా లోకేష్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అన్యాయాలను ఎండగడుతూ భట్టి 1,365 కిలోమీటర్లు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. ఈ పాదయాత్ర కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడంలో కీలకపాత్ర పోషించిందన్నారు.

సిట్ అవసరం లేదు

అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంపై సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ : అదానీ గ్రూపుకు వ్యతిరేకంగా హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ చేసిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు సిట్‌ను ఏర్పాటు చేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అపరిష్కృతంగా ఉన్న రెండు కేసుల దర్యాప్తును మూడు నెలల్లో పూర్తి చేయాలని సెబీని ఆదేశించింది. దర్యాప్తును సెబీ నుంచి సిట్‌కు బదిలీ చేయాలన్న వాదనలో అర్థంలేదని బుధవారం ఇచ్చిన తీర్పులో తెలిపింది. అదానీ గ్రూపుపై వచ్చిన 24 ఆరోపణల్లో 22 ఆరోపణలకు సంబంధించిన కేసుల విచారణను ఇప్పటికే సెబీ పూర్తి చేసిందని గుర్తు చేసింది. కోర్టు నియమించిన కమిటీ సిఫార్సుల మేరకే ప్రభుత్వం, సెబీ నడుచుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. అదానీ గ్రూపు తన కంపెనీల వాటాల విలువను కృత్రిమంగా పెంచిందంటూ న్యాయవాదులు విశాల్ తివారీ, ఎంఎల్ శర్మ, కాంగ్రెస్ నేత జయా ఠాకూర్, అనామికా జైస్వాల్ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. సెబీ చట్టంలో చేసిన మార్పుల కారణంగానే అదానీ గ్రూపు అవకతవకలు వెలుగు చూడడం లేదని ఆరోపించారు. దీనిపై గతంలో తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు బుధవారం దానిని వెల్లడించింది. హిండెన్‌బర్గ్ నివేదికలోని అంశాలను వాస్తవాలుగా పరిగణించలేమని తెలిపింది. కాగా తీర్పుపై అదానీ హర్షం వ్యక్తం చేశారు.

దురదృష్టకరం



- అసంతృప్తిని కలిగించింది
- అదానీ కేసులో సుప్రీం తీర్పుపై సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : అదానీ కేసులో నిష్పాక్షిక విచారణ జరిపించాలంటూ దాఖలైన పిటిషన్లను తిరస్కరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అసంతృప్తిని కలిగించిందని, ఇది దురదృష్టకరమని సీపీఐ(ఎం) వ్యాఖ్యానించింది. ఈ మేరకు పార్టీ పొలిట్‌బ్యూరో బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. అదానీ గ్రూపుపై వచ్చిన ఆరోపణలపై త్వరితగతిన విచారణ జరపాలంటూ తనకు నిర్దేశించిన బాధ్యతను సెబీ సక్రమంగా నిర్వర్తించలేకపోయిందని తెలిపింది.

'అదానీకి వ్యతిరేకంగా ప్రత్యక్ష ఆరోపణ చేస్తూ 2014లో సెబీకి డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) నివేదించింది. అదానీపై సెబీ విచారణ జరుపుతోందని 2021లో పార్లమెంటుకు తెలియజేశారు. అయితే అలాంటి విచారణ ఏదీ జరపడం లేదని న్యాయస్థానానికి ఇచ్చిన అఫిడవిట్‌లో సెబీ తోసిపుచ్చింది. ఫిర్యాదులపై సెబీ ఎందుకు చర్య తీసుకోవడం లేదని ప్రశ్నించాల్సిన న్యాయస్థానం ఆ పని చేయకుండా ఆ సంస్థ వాదనను పరిగణనలోకి తీసుకోవడం ఆశ్చర్యకరంగా ఉంది. ఇక రెండో విషయం...సెబీ తన సొంత నిబంధనలను మార్చివేసింది. వాటిలో ఎలాంటి పారదర్శకత లేదు. చివరికి లబ్దిదారు ఎవరో చెప్పాల్సిన అవసరం కూడా లేకుండా చేసింది. సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ కూడా సెబీ పనితీరుపై కొన్ని వ్యాఖ్యలు చేసింది. అయినప్పటికీ సెబీ నిబంధనలలో సవరణలను సుప్రీంకోర్టు ఆమోదించింది. అంతిమ లబ్దిదారులైన విదేశీ పెట్టుబడిదారుల సంబంధాలను బహిర్గతం చేయకుండా సెబీ తాజా నిబంధనలు అడ్డుగోడగా నిలిచాయి. ఇక మూడో విషయం...హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ చేసిన ఆరోపణలు నిబంధనలను విస్మరించాయా, దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలా అనే విషయాలపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి బహిరంగంగా లైసెన్స్ ఇవ్వడం అత్యంత దురదృష్టకరం. మరో మాటలో చెప్పాలంటే హిండెన్‌బర్గ్ నివేదికను ప్రచురించిన మీడియా సంస్థలన్నింటినీ ప్రమదంలో పడేశారు' అని సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో వివరించింది. ఈ తీర్పు ద్వారా న్యాయస్థానం తన విశ్వసనీయతను పెంచుకోలేదని వ్యాఖ్యానించింది.

అమర్ రాజా భారీ పెట్టుబడులు

- సీఎం రేవంత్ రెడ్డితో కంపెనీ ఛైర్మెన్ గల్లా జయదేవ్ చర్చలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమర్ రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధ్వర్యంలో రాష్ట్రంలో తల పెట్టిన పెట్టుబడులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో ఆ కంపెనీ ఛైర్మెన్ గల్లా జయదేవ్ సంప్రదింపులు జరిపారు. బుధవారం సచివాలయంలో వారిని కలిసి అమర రాజా ప్రాజెక్టుల పురోగతిపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధిలో అమరరాజా కీలక భాగస్వామి అని సీఎం అన్నారు. రాష్ట్రంలో ఆ కంపెనీ తలపెట్టిన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన సహాయ సహకారాలను అందిస్తుందని భరోసా ఇచ్చారు. అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ గిగా ఫ్యాక్టరీ, ప్యాక్ అసెంబ్లీ, ఇ పాజిటివ్ ఎనర్జీ ల్యాబ్‌ల నిర్వహణకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. క్లీన్ ఎనర్జీకి తెలంగాణ కట్టుబడి ఉందనీ, కొత్త పరిశ్రమల స్థాపనకు రాష్ట్రం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని సీఎం తెలిపారు. తమ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి జయదేవ్ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. దివిటిపల్లిలో లిథియం అయాన్ బ్యాటరీల తయారీకి సంబంధించిన గిగా ప్రాజెక్టు, బ్యాటరీ ప్యాక్ అసెంబ్లింగ్ యూనిట్, శంషాబాద్‌లోని ఇ-పాజిటివ్ ఎనర్జీ ల్యాబ్స్ మొదలగు పరిశ్రమల కోసం మొత్తం రూ.9,500 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్టు తెలిపారు. దాదాపు 4,500 మందికి ప్రత్యక్షంగా మరో 4,500కి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని వివరించారు. బ్యాటరీ, ఫుడ్ ప్రాసెసింగ్‌తో పాటు వివిధ రంగాలలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు తమ కంపెనీ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి బడులకు సంక్రాంతి సెలవులు

13 నుంచి జూనియర్ కాలేజీలకూ...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఈనెల 12 నుంచి 17 వరకు ఆరురోజులపాటు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించింది. అందుకు సంబంధించి అకడమిక్ క్యాలెండర్‌లోనే పాఠశాల విద్యాశాఖ పొందుపరిచింది. డిసెంబర్ 22 నుంచి 26 వరకు మిషనరీ స్కూళ్లకు క్రిస్‌మస్ సెలవులను ఇచ్చింది. దీంతో ఈనెల 12 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు మిషనరీ స్కూళ్లకు వర్తించబోవని విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈనెల 13 నుంచి 16 వరకు రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు సంక్రాంతి సెలవులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించి అకడమిక్ క్యాలెండర్‌లో విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈనెల 18న పాఠశాలలు, 17న జూనియర్ కాలేజీల్లో తరగతులు పునఃప్రారంభమవుతాయి.

సీఎంఓ నుంచి స్మితా సబర్వాల్ బదిలీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


(ఫైల్)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మరోసారి పెద్ద ఎత్తున ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఇప్పటికే పలువురు అధికారులకు ప్రమోషన్లు, కీలక శాఖలు కేటాయించిన సర్కార్ తాజాగా కొంత మందిని బదిలీ చేయగా, మరి కొంత మందికి అదనపు బాధ్యతలు అప్పగించింది. పలు శాఖల కార్యదర్శులతో పాటు జిల్లా కలెక్టర్లను కూడా మార్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి కార్యదర్శిగా గత ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఐఏఎస్ అధికారి స్మితా సబ ర్వాల్‌ను ప్రాధాన్యతలేని టీఎస్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్య కార్యదర్శిగా బదిలీచేసింది. మాజీ ఎంపీ సర్వే సత్యనారాయణ కుమార్తె, ఐఏఎస్ అధికారి ఎస్.సంగీత సీఎం సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇటీవలే జీఏడీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ రాహుల్ బొజ్జను కీలకమైన ఇరిగేషన్ కార్యదర్శిగా నియమించింది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ అదనపు డైరెక్టర్‌గా ఉన్న మహేష్ దత్ ఎక్కాను గనుల శాఖ ముఖ్య కార్యదర్శిగా, కార్మికశాఖ కమిషనర్‌గా ఉన్న అహ్మద్ నదీమ్‌ను ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శిగా, సంగారెడ్డి కలెక్టర్ డాక్టర్ ఎ. శరత్‌ను గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శిగా ఉన్న కృష్ణ ఆదిత్యను కార్మిక శాఖ డైరెక్టర్‌గా, పంచాయతి రాజ్ రూరల్ డెవలప్ మెంట్ కార్యదర్శిగా ఉన్న ఆయేషా మస్రత్ ఖనమ్‌ను మైనార్టీ గురుకులాల కార్యదర్శిగా, పురావస్తు శాఖ డైరెక్టర్‌గా భారతి హోలికేరి, ఆయుష్ డైరెక్టర్‌గా ఎం ప్రశాంతిలను ప్రభుత్వం బదిలీ చేసింది. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు బీసీ సంక్షేమ ముఖ్య కార్యదర్శిగా, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు మిషన్ భగీరథ కార్యదర్శిగా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావుకు జీఏడీ కార్యదర్శిగా, రవాణాశాఖ కమిషనర్ డాక్టర్‌జ్యోతి బుద్ధప్రకాశ్‌కు కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిగా, ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డీ కృష్ణ భాస్కర్‌కు ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌కు టీఎస్‌ఎంఎస్ ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా, విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి హరితకు కో ఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగిం చింది. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న డి.దివ్యను పురపాలక శాఖ డైరెక్టర్, ప్రజావాణి రాష్ట్రస్థాయి నోడల్ అధికారిగా, చిట్టెం లక్ష్మిని డైరీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఎండిగా, దాసరి హరిచందనను నల్గొండ కలెక్టర్‌గా నియమించారు. మహబూబాబాద్ కలెక్టర్ కె. శశాంకను రంగారెడ్డి కలెక్టర్‌గా, సెంట్రల్ డిప్యు టేషన్ ముగించుకొని రాష్ట్ర సర్వీసులకు వచ్చిన అద్వైత్ కుమార్ సింగ్‌ను మహబూబాబాద్ కలెక్టర్‌గా, గద్వాల కలెక్టర్ వల్లూరు క్రాంతిని సంగారెడ్డి కలెక్టర్‌గా, జయశంకర్ భూపాలపల్లి అడిషినల్ కలెక్టర్ పి కదిరవన్‌ను హైదరాబాద్ జిల్లా అడిషినల్ కలెక్టర్‌గా, గద్వాల కలెక్టర్‌గా బిఎం సంతోష్‌ను ప్రభుత్వం బదిలీచేసింది. అటవీ అభివృద్ధి కార్పోరేషన్ ఎండీ సీనియర్ ఐఎఫ్‌ఎస్ అధికారి డా.చంద్రశేఖర్ రెడ్డిని సిఎం కార్యదర్శిగా, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వేముల శ్రీనివాసులును సీఎం ఓఎస్డీగా నియమిస్తూ సిఎస్ శాంతికుమారి బుధవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేశారు.

ఆర్టీసీకి నిధులిస్తాం



టీఎస్ఆర్టీసీపై సమీక్షలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీకి క్రమం తప్పకుండా నిధులు ఇస్తామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. 'మహాలక్ష్మి' స్కీం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం దిగ్విజయంగా కొనసాగుతున్నదనీ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాన్ని కొనసాగించాలని చెప్పారు. 'మహాలక్ష్మి' నిధుల్ని ఏనెలకు ఆ నెలలోనే ఇచ్చేస్తామనీ, సంస్థపై ఎలాంటి ఆర్థికభారం పడనీయబోమని స్పష్టం చేశారు. టిక్కెట్ చార్జీలు పెంచకుండా ఇతర ఆదాయ మార్గాలు అన్వేషించాలనీ, సంస్థ అంతర్గత సామర్థ్యాన్ని పెంచేదిశగా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. బుధవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) స్థితిగతులపై రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్, డైరెక్టర్లు కూడా దీనికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ఆర్థిక, సాంకేతిక అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.


మహాలక్ష్మి స్కీం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 6.50 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు. దీన్ని ఇలాగే ప్రశాంత వాతావరణంలో కొనసాగించాలని ఆర్థికమంత్రి చెప్పారు.

తన శాఖ నుంచి పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈపాటికే టీఎస్ఆర్టీసీకి నిర్వహణ వ్యయ నిధుల్ని సమకూర్చాలని ఆర్థిక శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. సిబ్బందికి రావల్సిన బకాయిలు, సంస్థ అప్పులు, పీఎఫ్, సీసీఎస్, ఇతర సెటిల్‌మెంట్లకు నిధులపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో మహాలక్ష్మి పథకం ద్వారా రోజుకు సగటున 27 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారనీ, దాదాపు రూ.10 కోట్ల విలువైన జీరో టికెట్లను జారీ చేస్తున్నామని వివరించారు. ఆ సొమ్ముపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ, రోజువారీ నిర్వహణకు అవసమైన నిధులను ప్రభుత్వం సమకూరుస్తుందని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై ఆలోచన చేస్తున్నామనీ, లాజిస్టిక్స్, కమర్షియల్, టిక్కేటేతర ఆదాయంపై దృష్టి పెట్టామన్నారు.

కార్యక్రమంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, రవాణా, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఉప ముఖ్యమంత్రి ఓఎస్డీ కృష్ణభాస్కర్, టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు మునిశేఖర్, కృష్ణకాంత్, ఫైనాన్స్ అడ్వయిజర్ విజయ పుష్ప, సీఎంఈ రఘునాథరావు, సీటీఎం జీవనప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తూచ్

చమురు ధరలను తగ్గించేది లేదు..!: కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ వెల్లడి



న్యూఢిల్లీ : చమురు ధరలను తగ్గించే అవకాశాలు లేవని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురీ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ముందు చమురు ధరలను కేంద్రం తగ్గిస్తుందంటూ కార్పొరేట్ మీడియా ఇచ్చిన లీకులను... ఉత్తుత్తివని ఆయన ఖండించారు. ఒకప్పటితో పోలిస్తే చమురు ధరలు గరిష్ఠాల నుంచి భారీగా తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఆ మేర వినియోగదారులకు ప్రయోజనాన్ని బదిలీ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని రిపోర్టులు వచ్చాయి. లీటర్‌కు రూ.6 నుంచి పది రూపాయల మేర తగ్గే అవకాశం ఉందని కేంద్రం ప్రచారం చేసుకున్నది. అయోధ్య రామజన్మ భూమి ప్రచారం ఊపందుకుందని భావించినా.. అలాంటిదేమీ లేదంటూ మంత్రి హరదీప్ స్పష్టం చేశారు. చమురు ధరల తగ్గింపుపై జరుగుతున్న ప్రచారం అనేది పూర్తిగా ఊహాజనితమన్నారు. ధరల తగ్గింపుపై ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో ఎలాంటి చర్చలూ జరగలేదన్నారు. అంతర్జాతీయంగా చమురు ధరలు ఒడుదొడుకుల కారణంగా అటు అభివృద్ధి చెందిన, పొరుగు దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం పెరిగాయని అన్నారు. భారత్‌లో మాత్రం ధరలు స్థిరంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు, ఎల్పీజీ దిగుమతిదారుగా భారత్ ఉందన్నారు. ప్రపంచ మార్కెట్‌లో ఎప్పడికప్పుడు చమురు ధరలు తీవ్రమైన ఒడుదొడుకులు ఎదుర్కొంటూ ఉంటాయని తెలిపారు. అలాంటి స్థితిలో ఏ ప్రభుత్వానికి అయినా చమురు ధరలు తగ్గించడం కష్టంతో కూడుకున్న వ్యవహారమన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. దొంగను గజదొంగకు పట్టించాలంటూ కిషన్‌రెడ్డి అడుగుతున్నాడు. కాళేశ్వరం అవినీతిపై మేం జ్యుడీషియల్ విచారణ చేసి తీరుతాం. బీజేపీ, బీఆర్ఎస్ తోడు దొంగలు. ఇద్దరూ కలిసే కాళేశ్వరం పేరుతో దోచుకున్నారు. పాలమూరు ఎత్తిపోతలకు అన్యాయం చేశారు' అని విమర్శించారు.

టీమ్ వర్క్ ఉండాలి : ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి

కాంగ్రెస్‌లో మరింత టీమ్ వర్క్ పెరగాలని ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సూచించారు. ఇక ముందు చాలా ఎన్నికలు రాబోతున్నాయనీ, అందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు కావడం వల్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో కలిసి పని చేస్తే మంచి ఫలితాలొస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి కార్యకర్తలు పదేండ్లు కష్టపడ్డారని కొనియాడారు. హైదరాబాద్‌లో బోగస్ ఓట్లు చాలా ఉన్నాయన్నారు. నాయకులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

దశాబ్దం తర్వాత గొప్ప అవకాశం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

'దశాబ్ద కాలం తర్వాత మనకు ఇదో గొప్ప అవకాశం. అనేక కష్టనష్టాలను భరించి అధికారంలోకి వచ్చాం. యువత ఎన్నో కలలు కని రాష్ట్రం కోసం పోరాటం చేసింది. ప్రజలు విశ్వాసంతో మనం వారికి ఇచ్చిన హామీలను నమ్మి మనల్ని గెలిపించారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన పని చేస్తున్న వారంతా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి. గత ప్రభుత్వ ఆర్థిక అరాచకత్వంతో రాష్ట్రాన్ని పీల్చి పిప్పి చేశారు. ఒకవైపు ఆర్థికంగా బలోపేతం కావాలి. మరోవైపు మనం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. రాష్ట్రంలో ఒక ఫీల్ గుడ్ ఫ్యాక్టు వచ్చింది. ఒక స్వాతంత్ర్యం వచ్చినట్టు ప్రజలు ఫీల్ అవుతున్నారు. కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఇస్తాం' అని భరోసా ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఉచిత బస్ సౌకర్యంతో ఆరున్నర కోట్ల మంది ఉచితంగా ప్రయాణం చేశారని తెలిపారు. ఈనెల 6న ఆటో డ్రైవర్ల ధర్నా వెనుక బీఆర్ఎస్ ఉందని విమర్శించారు. ఉచిత బస్ సౌకర్యాన్ని బీఆర్ఎస్ రాజకీయం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం ఎంతో మంది కార్యకర్తలు, నాయకులు ఎంతో శ్రమించారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. వారి కష్టానికి తగిన ఫలితం ఉంటుందని చెప్పారు. జాతీయ స్థాయి ఎన్నికల్లో బిఆర్ఎస్ మరింత బలహీన పడుతుందని చెప్పారు. అనంతరం పార్టీ ఉపాధ్యక్షులు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

జైళ్లలో కుల వివక్ష

కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జైళ్లలో కుల వివక్షపై స్పందన తెలపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. రాష్ట్రాల్లోని జైలు మాన్యువల్‌లు ఖైదీల మధ్య కుల ఆధారిత వివక్షను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. పిటిషనర్ లేవనెత్తిన ఈ అంశం చాలా కీలకమైనదని ధర్మాసనం పేర్కొంది.

'ఇది చాలా తీవ్రమైన అంశం. అన్ని రాష్ట్ర మాన్యువల్‌లను పట్టికలో ఉంచబడిన చార్ట్‌లో పెట్టేలా చూడండి' అని ఎస్‌జీ మెహతాను ధర్మాసనం ఆదేశించింది. 'ఈ పరిస్థితి ఆమోదించదగినది కాదు. దీనిని పరిష్కరించడంలో ఉమ్మడి ప్రయత్నాలు అవసరం' అని ఎస్‌జీ మెహతా తెలిపారు.

జైలు బ్యారక్‌లలో కుల ఆధారిత వివక్ష కొనసాగుతున్నదనీ, మాన్యువల్ లేబర్ అసైన్‌మెంట్‌ల వరకు విస్తరించిందని, డీనోటిఫైడ్ తెగలు, అలవాటైన నేరస్థులుగా వర్గీకరించబడిన వారిని ప్రభావితం చేస్తుందని పేర్కొంటూ జర్నలిస్ట్ సుకన్య శాంత కోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. వివిధ రాష్ట్రాల జైలు మాన్యువల్స్‌లో ఉన్న వివక్షతో కూడిన నిబంధనలను రద్దు చేయాలని కోరారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ఎస్ మురళీధర్ వాదనలు వినిపిస్తూ.. దళితులను ప్రత్యేక జైళ్లలో నిర్బంధించిన సందర్భాలూ ఉన్నాయని, ఇతర కులాలకు చెందిన వ్యక్తులు వివిధ ప్రాంతాల్లో నిర్బంధించారని వివరించారు. 'ఇటువంటి కుల ఆధారిత వివక్ష జైలులో అడుగుపెట్టినప్పటి నుంచి ఉంది' అన్నారు. ప్రాథమిక వాదనలు సంక్షిప్తంగా విన్న ధర్మాసనం, కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, ఒరిస్సా, జార్ఖండ్, కేరళ, తమిళనాడు, మహారాష్ట్రలకు నోటీసులు జారీ చేసింది.



ఏకపక్షంగా కోర్టుకు పిలిచే విషయంలో అధికారులకు మినహాయింపు

అధికారులకు న్యాయస్థానాలు సమన్లు జారీపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు

అధికారులను న్యాయస్థానాలు కోర్టులకు పిలిపించడం, వస్త్రధారణపై వ్యాఖ్యలకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. అధికారులను కించపరిచేలా మాట్లాడడం, వారి వేషధారణపై వ్యాఖ్యలు చేసే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు సూచనలు చేసింది. ఈ మేరకు ప్రభుత్వాధికారులను కోర్టుల ముందు హాజరుకావాలంటూ జారీ చేసే సమన్ల విషయంలో 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' పేరిట కొన్ని మార్గదర్శకాలను సూచించింది. ఏకపక్షంగా కోర్టుకు పిలిపించే విషయంలో అధికారులకు మినహాయింపునివ్వాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మార్గదర్శకాలను దేశంలోని అన్ని హైకోర్టులు తప్పనిసరిగా అనుసరించాలని ఆదేశించింది.

అధికారుల వస్త్రధారణపై వ్యాఖ్యలకు న్యాయమూర్తులు దూరంగా ఉండాలనీ, కోర్టు కార్యాలయంలో దుస్తుల కోడ్‌ను ఉల్లంఘిస్తే తప్ప అధికారుల వస్త్రధారణను కించపరిచేలా మాట్లాడొద్దని ధర్మాసనం నొక్కి చెప్పింది.

గతేడాది ఇద్దరు సీనియర్ ప్రభుత్వ అధికారులు కోర్టుకు హాజరుకావాలంటూ అలహాబాద్ హైకోర్టు సమన్లు జారీ చేయడాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సవాలు చేసింది. ఈ మేరకు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు ఆదేశాలను సమర్థించింది. అయితే ప్రభుత్వాధికారులను తరచూ కోర్టులకు పిలిపిస్తే రాజ్యాంగం ప్రకారం అమలవుతున్న పథకాల అమలు విషయంలో ఇబ్బందులు తలెత్తుతాయని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ మేరకు బుధవారం ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొంది.

మహువా బహిష్కరణపై మీ స్పందనమిటి?

- రెండు వారాల్లో సమాధానమివ్వండి
- లోక్‌సభ సెక్రటేరియట్‌కు సుప్రీంకోర్టు నోటీసు

మాజీ ఎంపి మహువా మొయిత్రాను లోక్‌సభ నుంచి బహిష్కరించడంపై స్పందన తెలపాలని లోక్‌సభ సెక్రటేరియట్‌కు అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. లోక్‌సభ నుంచి తనను బహిష్కరించడాన్ని సవాల్ చేస్తూ టీఎంసీ నేత మహువా మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. బహిష్కరణపై లోక్‌సభ సెక్రటేరియట్ నుంచి ధర్మాసనం సమాధానం కోరింది. అయితే మొయిత్రాకు మధ్యంతర ఉపశమనం కల్పించేందుకు న్యాయమూర్తుల ధర్మాసనం నిరాకరించింది. 'మొదటి ప్రతివాది (లోల్‌సభ సెక్రటేరియట్) అఫిడవిట్‌ను రెండు వారాల్లో దాఖలు చేయాలి. ఆ తరువాత మూడు వారాల్లో తిరిగి రిజాయిండర్‌ను దాఖలు చేయండి. మార్చి 11 నుండి ప్రారంభమయ్యే వారంలో ఈ పిటిషన్‌ను జాబితా చేయండి" అని ధర్మాసనం ఆదేశించింది. అలాగే సీనియర్ న్యాయవాది సింఘ్వీ హీరానందానీతో లోక్‌సభ పోర్టల్ లాగిన్ పాస్‌వర్డ్‌ను పంచుకున్నందుకు, లంచం ఆరోపణలను పరిశీలించనందుకే మొయిత్రాను బహిష్కరించినట్టు వాదించారు. 'ఆమె లాగిన్ ఐడీని పంచుకున్నందుకు మాత్రమే ఆమెను బహిష్కరించారు. లంచం విషయంలో ఆరోపణలను పరిశీలించాలని చెప్పారు. పాస్‌వర్డ్ షేరింగ్‌కు వ్యతిరేకంగా ఎటువంటి నిబంధనలు లేకుండా ఆమెను బహిష్కరించారు' అని సింఘ్వీ చెప్పారు. లోక్‌సభ పోర్టల్ లాగిన్ కోసం మొయిత్రా ఓటీపీని హీరానందనీతో పంచుకున్నారని కూడా ఆయన చెప్పారు. మధ్యంతర ఉపశమనం కోసం చేసిన పిటిషన్‌పై కోర్టు అధికారిక నోటీసును కూడా జారీ చేయలేదు. అయితే లోక్‌సభ సెక్రటేరియట్ ప్రత్యుత్తరాన్ని పరిశీలించిన తర్వాత దానిని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. ఆ తరువాత లోక్‌సభ సెక్రటేరియట్ నుంచి స్పందన కోరుతూ ధర్మాసనం కేసును మార్చికి వాయిదా చేసింది.

సింగరేణి ఇన్‌చార్జి సీఎమ్‌డీగా బాధ్యతలు స్వీకరించిన ఎన్ బలరాం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



సింగరేణి కాలరీస్ ఇన్‌చార్జి ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎమ్‌డీ)గా ఎన్ బలరాం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని కొత్త గనులు చేపట్టి, కార్మికుల సంక్షేమాన్ని విస్తరిస్తామన్నారు. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలన్నింటికీ బొగ్గు కొరత లేకుండా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సింగరేణి అభివృద్ధితో పాటు సమీప గ్రామాల అభివృద్ధిని కూడా ప్రాధాన్యతాంశంగా పరిగణిస్తూ సామాజిక బాధ్యతా కార్యక్రమాలను విస్తృతపరుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ని సింగరేణి మాజీ డైరెక్టర్(ఫైనాన్స్, పర్సనల్) పవిత్రన్‌కుమార్, సెంట్రల్ కోల్ ఫీల్డ్స్ ఛైర్మెన్, కోలిండియా డైరెక్టర్ టెక్నికల్ బీ వీరారెడ్డి, సింగరేణి డైరెక్టర్లు ఎన్.వి.కె.శ్రీనివాస్ (ఆపరేషన్స్), జి.వెంకటేశ్వరరెడ్డి(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), ఈడీ(కోల్ మూమెంట్) జె.అల్విన్, జీఎం(కో ఆర్డినేషన్) ఎం.సురేశ్, జీఎం సేఫ్టీ గురవయ్య, సింగరేణి అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.వి.రాజశేఖరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

సంపాదకీయం

యూట్యూబో రక్షతి రక్షితః

నువ్వు యూట్యూబుల్ని పుట్టించి, పెంచి, పోషించ గలిగితే అవే నీ పాలనను సుస్థిరం చేస్తాయి! 'ఎక్స్' అలియాస్ ట్విట్టర్‌లో కేటీఆర్‌కొచ్చిన ఒకానొక సలహానట! కొన్ని శాపనార్థాలు కూడా ఉన్నా ఈ సూచన భేషైనదిగా కన్పడిందాయనకు. టెక్నాలజీ రంగంపై మంచి అవగాహనుండే వ్యక్తిగా కీర్తించబడే కేటీఆర్ కల్లోల నౌకకు 'అరేబియన్ నైట్స్' కథల్లో ఒక తీరం దొరికిన 'సింద్‌బాద్' పొందిన ఆనందం దొరికింది. 32మెడికల్ కాలేజీలు పెట్టి, వాటి కింద ఆసుపత్రులు నెలకొల్పి జనానికి వైద్య సదుపాయాలు కల్పించడం కంటే 32 యూట్యూబ్ చానెళ్లు పెట్టి బాగా డప్పు కొట్టుకొని ఉంటే ఈవిఎమ్‌లు గులాబీ శోభతో అలరారుతుండేవని సదరు మంత్రి గారి తాత్పర్యం.

కొన్ని వాస్తవాలు కల్వకుంట్ల కుటుంబీకులు లేదా ఆ పార్టీ వారు విన గలిగితే, తెల్సుకునే ఆసక్తి ఉంటే... దాదాపు ఎనిమిదిన్నరేండ్లు రాష్ట్రంలోని యావన్మీడియా మీ బాకాలుగానేగా ఉండింది. విమర్శించే పత్రికల గొంతు నులిమే ప్రయత్నం నిర్విరామంగానే చేశారు కదా! ఏ ప్రభుత్వంలోనైనా ఐ అండ్ పి.ఆర్ కో మంత్రి ఉంటారు. కేసీఆర్ ఆ పదవిని తన వద్దే ఉంచుకుని, పత్రికలను నియంత్రించే ప్రయత్నం చేయలేదా? విమర్శించే పత్రికలకు 'యాడ్స్' ఇవ్వకుండా ఎండబెట్టిన విధానం, అధినాయకుడే ఆయుధం పట్టుకుని అదిలించిన తీరు అందరికీ తెల్సిందే! మంత్రివర్గ సమావేశా నంతరం పత్రికలకు 'బ్రీఫ్' చేసిందీ ఆయనే. కఠినమైన ప్రశ్నలడిగే విలేకర్లని దబాయించి, నోరు మూయించిందీ ఆయనే. మొన్నటి ఎన్నికల్లో మిగిలిన పార్టీలకంటే శక్తివం తంగా సోషల్ మీడియాను ఉపయోగించింది బీఆర్ఎస్ పార్టీయేనని బీజేపీ కూడా ఏడ్చిన సందర్భం లేదా? ఇంక యూట్యూబ్ చానళ్ల కోసం ఆ వగచుండెందుకు? లేదా ప్రజలకం దిన ఆ కాస్త వైద్య సేవలు కూడా అందించి ఉండాల్సింది కాదని కేటీఆర్ భావమా?



ఇంగ్లీషు అనర్గళంగా మాట్లాడగలిగిన వ్యక్తికి 'రైటింగ్ ఆన్ ది వాల్' అర్థం తెలిసే ఉంటుంది. బహుశా తెలియబట్టే ఓడిపోతే ప్రతిపక్షంలో కూచుంటామని ఒక చర్చ సందర్భంగా మంత్రి వర్యులే సెలవిచ్చారేమో! "కొన్ని సార్లు కొంత మంది నిజాలు వినడానికి ఇష్టపడరు, ఎందుకంటే వారి భ్రమల లోకం కూలిపోవడం వారికి ఇష్టముండదు" అన్న ఫ్రీడ్ రిచ్ నీట్స్‌జే అనే జర్మన్ తత్వవేత్త మాటలు ఈ సందర్భానికి సరిగ్గా నప్పుతాయి.

తమ అప్రజాస్వామిక అహంకార పూరిత ధోరణుల గురించి వెనక్కి తిరిగి చూడకుండా ఓటమికి కారణాలు యూట్యూబుల్లో దేవులాడుకునే వారికి మనమేం చెప్పగలం? 2014 జూన్ 2 నుండి మొన్న ఓటమి పాలయ్యే వరకు తోటి ఉద్యమకారులు, మేధావుల మొదలు తనని అందలమెక్కించడంలో కీలకభూమిక పోషించిన రంగాలనేతల వరకు చెప్పుకింద తేళ్లలాగా పడుండే వారితోనే మాటామంతీ ఉండింది. 'కొండె' కాదు కదా, కనీసం గొంతెత్తి విమర్శించినా, అధినేతను ప్రశ్నించినా అధఃపాతాళంలోకి తొక్కేసిన ఘటనలెన్నో. అవిగవిగో కోట గుమ్మానికి వేలాడుతున్న తలకాయలు! తమ కోసం రావల్సిన వాటితో పాటు రాష్ట్ర ప్రజానీకం సౌకర్యాల కోసం నిటారుగా నిలబడ్డ పాపానికి 'ప్రగతి రథాన్ని' రోడ్ రోలర్లతో తొక్కించి ఆర్టీసీ కార్మికోద్యమాన్ని మసి చేసి, నుసి చేసే ప్రయత్నం చేస్తే ఆ కార్మికులు, వారి కుటుంబాలు కట్టగట్టుకుని బీఆర్ఎస్ పాలనను దెబ్బతియ్యవా? నల్లటి బొగ్గు బావుల్లో మండిన మంటలు రాష్ట్రావతరణోద్యమంలో కీలక భూమిక పోషించాయి. కొందరు నాయకుల అవినీతి, అధికార పార్టీకి అంటకాగుతూ, లంచాలు, పైరవీలకై ఎగబడిన తీరుకు నేడు సింగరేణి ఎన్నికల్లో ఆ సంఘం నామరూపాలు లేకుండా పోవడమే కాదు, మొత్తం సింగరేణి బెల్టులోని శాసనసభా స్థానాలన్నీ బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయింది. అదేవిధంగా బీడీ కార్మికులు లక్షల సంఖ్యలో కేంద్రీకరించి ఉన్న జిల్లాలన్నింటిలో బీఆర్ఎస్‌కు చుక్కెదురైంది. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు నూతన పెన్షన్ స్కీంపై రగిలిపోతున్నారు. దాదాపు 30 శాతం మంది రెగ్యులరైజేషన్ కోసం తపిస్తున్నారు. కాని కొందరు నాయకులకి మేత వేస్తూ, మచ్చిక చేసుకుని అదే "ఎంప్లాయీ ఫ్రెండ్లీ" ప్రభుత్వమని చాటింపు వేసుకుంటే చాల్తుందా? కీలెరిగి వాత పెట్టారు ఆ ఉద్యోగులు.

సంక్షేమ పథకాలే గట్టెక్కించలేవు. దళితబంధు, డబల్‌బెడ్ రూం ఇళ్లు అందిన వారు గుప్పెడు మంది. ఇంకా రాని వారు గంపెడు మంది ఉన్నారు. ఇలాంటి స్కీంలు ఏదో ఒక పేరు మీద చాలా రాష్ట్రాల్లో ఉన్నాయి. అయినా, తానే 'సంక్షేమ చర్యల సామ్రాట్'గా చెప్పుకుంటూ అన్ని రాష్ట్రాల పత్రికల్లోను వాణిజ్య ప్రకటనలు గుప్పించారు. ఇవన్నీ రాష్ట్ర ప్రజలు గమనించరా? రాష్ట్రంలో పదేపదే పోటీ పరీక్షలు వాయిదా, అనేక మంది ఆత్మహత్యలు, పేపర్ల లీకేజీలు, నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం వంటివి యువతను పెద్దఎత్తున ప్రభావితం చేశాయి. ఎన్నికల వేళ మేడిగడ్డ కుంగింది. ప్రభుత్వ అవినీతిపై విపక్షాల వాదనకు బలం చేకూరింది. కర్ణుడి చావుకి మించినన్ని కారణాలు బీఆర్ఎస్ ఓటమిలో ఉన్నాయి. అది గుర్తించకుండా 'యూట్యూ బు'ల్లో కారణాలు వెతుక్కుంటే ఉపయోగమేమిటి మహాశయా!

> మొత్తం సింగరేణి బెల్టులోని శాసనసభా స్థానాలన్నీ బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయింది. అదేవిధంగా బీడీ కార్మికులు లక్షల సంఖ్యలో కేంద్రీకరించి ఉన్న జిల్లాలన్నింటిలో బీఆర్ఎస్‌కు చుక్కెదురైంది. రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు నూతన పెన్షన్ స్కీంపై రగిలిపోతున్నారు. దాదాపు 30 శాతం మంది రెగ్యులరైజేషన్ కోసం తపిస్తున్నారు. కాని కొందరు నాయకులకి మేత వేస్తూ, మచ్చిక చేసుకుని అదే "ఎంప్లాయీ ఫ్రెండ్లీ" ప్రభుత్వమని చాటింపు వేసుకుంటే చాల్తుందా? కీలెరిగి వాత పెట్టారు ఆ ఉద్యోగులు.

ఎర్ర సముద్రంలోకి ఇరాన్ యుద్ధనౌక!

ఒకవైపు గాజా నుంచి సైన్య ఉపసంహరణ వార్తలు, మరోవైపు ఆలోగా మిగిలి ఉన్న నివాసాలను పూర్తిగా నాశనం చేయటం, సాధ్యమైనంత మంది పాలస్తీనియన్ల ప్రాణాలను హరించేందుకు వైమానిక, టాంకులతో ఇజ్రాయిల్ మిలిటరీ విరుచుకుపడుతున్నట్లు సమాచారం.



ఎం కోటేశ్వరరావు
8331013288

నిబంధనలను తోసిరాజని అమెరికా భారీ ఎత్తున మిలిటరీ సాయం. పాలస్తీనా జాతిని తుడిచి పెట్టేందుకు పూనుకున్న ఇజ్రాయిల్ మీద విచారించాలంటూ అంతర్జాతీయ కోర్టు (ఐసిజె)లో దక్షిణాఫ్రికా కేసు దాఖలు. ఎమెన్ కేంద్రంగా ఉన్న హౌతీ సాయుధులు ఎర్రసముద్రంలో నౌకలపై దాడులు, వారి మీద అమెరికా యుద్ధనౌకల నుంచి ప్రతిదాడులు. పది మంది హౌతీల మరణం, ఈ పూర్వరంగంలో మంగళవారం నాడు ఎర్ర సముద్రంలోకి ఇరాన్ తన యుద్ధనౌక అల్‌బోర్జ్‌ను నడిపింది. ఈ పరిణామంతో అంతర్జాతీయ మార్కెట్లో స్వల్పంగా ముడిచమురు ధరలు పెరిగాయి. హిందూ మహా సముద్రంతో ఎర్రసముద్రాన్ని కలిపే ఏడెన్ జలసంధి నుంచి ఎర్ర సముద్రం దక్షిణ ప్రాంతంలోకి ఇరాన్ నౌక ప్రవేశించింది. తాము కూడా ఆ ప్రాంతంలో ప్రయాణించే నౌకలకు రక్షణ కల్పించేందుకే అని ఇరాన్ ప్రకటించింది. అదే పేరుతో అమెరికా, బ్రిటన్ ఇతర దేశాల నౌకలు ఉన్నాయి. 2009 నుంచి నియమిత కాలాల్లో తమ నౌక ఆ ప్రాంతంలో గస్తీకి రావటం మామూలేనని, ఎవరికీ చెందని జలాల్లోకి ఇతర దేశాల యుద్ధ నావలు ఎలా వస్తున్నాయో తమది కూడా అంతేనని ఇరాన్ చెప్పింది. 2021లో ఏడెన్ జలసంధిలో రెండు చమురు టాంకర్లపై సముద్ర దొంగల దాడిని తమ అల్‌బోర్జ్ తిప్పికొట్టిన అంశాన్ని గుర్తు చేసింది. ఎర్ర సముద్రంలో నౌకల స్వేచ్ఛా విహారానికి విఘాతం కలిగిస్తున్న హౌతీల మీద ప్రత్యక్ష చర్యకు దిగుతామని బ్రిటన్ బెదిరించింది. ఇవీ మధ్యప్రాచ్యంలో వర్తమాన పరిణామాలు.

పాలస్తీనా జాతిని తుడిచిపెట్టి, గాజా ప్రాంతాన్ని నామరూపాల్లేకుండా చేసేందుకు పూనుకున్న ఇజ్రాయిల్ మీద విచారణ జరపాలని దక్షిణాఫ్రికా ఐసిజెలో కేసు దాఖలు చేసింది. పాలస్తీనియన్లు యూదు దురహంకారుల అణచివేతకు గురవుతున్నట్లే శతాబ్దాల తరబడి శ్వేత జాతి దురహంకారుల వివక్ష, అణచివేతకు దక్షిణాఫ్రికాలో ఆఫ్రికన్లు బలైన సంగతి తెలిసిందే. ఆ బాధ ఏమిటో వారికి తెలిసినంతగా మరొకరికి అవగతం కాదు, ఈ కారణంగానే పాలస్తీనియన్లకు మద్దతుగా కేసుదాఖలు చేసినట్లు భావిస్తున్నారు. అది ఏమౌతుందో చెప్పలేము గానీ ఇజ్రాయిల్ మీద ఒత్తిడి పెంచుతుంది. బహుశా దాని ప్రభావం వల్లనే పెద్ద సంఖ్యలో సేనలను గాజా నుంచి వెనక్కి రప్పిస్తున్నట్లు ప్రకటిం చిందా? అబ్బే అదేమీ లేదు, పోరులో ఉన్నవారికి విశ్రాంతి నిచ్చేందుకు, వారి స్థానంలో కొత్తవారిని దించుతామని ఇజ్రాయిల్ అధికారులు ప్రకటించింది వాస్తవమా? చూడాల్సి ఉంది. ఇప్పటి వరకు గాజాలో ఇరవై రెండువేల మందికి పైగా పౌరులను చంపారు. ఎనిమిది వేల మంది హమాస్ తీవ్రవాదులను హతమార్చినట్లు ఇజ్రాయిల్ చెప్పుకోవటం తప్ప దానికి తగిన ఆధారాలను చూపలేదు, ఎవరూ నమ్మటం లేదు. ఈ ఏడాది అంతటా తమ దాడులు కొనసాగుతాయని ప్రకటించారు. అంతర్జాతీయ వ్యవస్థలో ఐసిజె సివిల్ కోర్టు, ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు(ఐసిసి) నేరాలను విచారిస్తుంది. ఐరాసలో రెండు దేశాలూ సభ్యులే కనుక కోర్టు నిర్ణయాలకు బద్దులు కావాల్సి ఉంది. తమ దేశంలో 1994లో అంతమైన జాత్యంహకార పాలనలో శ్వేతజాతి మైనారిటీలు జనాన్ని బలవంతంగా వేర్వేరుగా ఉంచారని, ఇప్పుడు ఇజ్రాయిల్ విధానాలు కూడా అలాగే ఉన్నట్లు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా చెప్పాడు. అక్టోబరు ఏడు నుంచి గాజాలో ఇజ్రాయిల్ చర్యలు జాతుల అంతంపై ఐరాస తీర్మానాలకు విరుద్ధంగా ఉన్నాయని అందువలన తక్షణమే విచారణ జరపాలని కోర్టును దక్షిణాఫ్రికా అభ్యర్థించింది. గాజాలో కాల్పుల విరమణ జరిపేవరకు ప్రిటోరియాలోని ఇజ్రాయిల్ రాయబార కార్యాలయాన్ని మూసివేయాలని ఆదేశించటమే గాక అన్ని రకాల దౌత్య సంబంధాలను పక్కన పెడుతున్నట్లు దక్షిణాఫ్రికా చాలా రోజుల క్రితమే ప్రకటించింది. తమ మీద చేసిన అభియోగాలకు ఆధారం లేదని, రక్తపు మరకలను తమకు అంటిస్తున్నారని ఇజ్రాయిల్ ఆరోపించింది. గాజాలోని పౌరులు తమకు శత్రువులు కాదని చెప్పుకుంది. మరోవైపు గాజాలో అమాయకులెవరూ లేరని ఇజ్రాయిల్ అధ్యక్షుడు హెర్జోగ్ ప్రకటించాడు. అక్కడి జనం మానవ మృగాలు గనుక వారికి సామూహిక శిక్ష విధిస్తామని రక్షణ మంత్రి చెప్పాడు. ప్రధాని నెతన్యాహు బైబిల్‌లోని అంశాలను ఉల్లేఖించటం జాతి నిర్మూలనకు పిలుపునివ్వటం తప్ప మరొకటి కాదని అనేక మంది చెప్పారు. దక్షిణాఫ్రికా చర్యను పాలస్తీనా విదేశాంగ మంత్రిత్వశాఖ స్వాగతించింది. వెంటనే కోర్టు స్పందించాలని, పౌరులకు మరింత హాని జరగకుండా చూడాలని కోరింది.

గాజాలో ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్ మాండెబ్ జలసంధి ద్వారా రాకపోకలు సాగిస్తున్న నౌకలపై తాము దాడులు చేస్తామని ఎమెన్ కేంద్రంగా ఉన్న హౌతీ సాయుధ దళాలు ప్రకటించాయి. తమ సేనలు మూడు హౌతీ పడవలను ముంచివేసి పదిమందిని హతమార్చినట్లు అమెరికా వెల్లడించింది. తొలిసారిగా ప్రత్యక్ష దాడులకు దిగటం ఇదే ప్రథమం. ఎమెన్ కాలమానం ప్రకారం ఆదివారం నాడు ఉదయం ఆరున్నర గంటలకు హంగఝౌ అనే కంటెయినర్ నౌక మీద చిన్న పడవల నుంచి దాడులు జరగటంతో తమను రక్షించాలని నౌకలో ఉన్నవారు కోరిన వెంటనే యుద్ధ నౌకలు, కొన్ని హెలికాప్టర్లను పంపి హౌతీలపై అమెరికన్లు దాడులు జరిపారు. బహుళజాతి సముద్రయాన రక్షణ దళాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డిసెంబరు 19న అమెరికా ప్రకటించగా సుముఖత చూపిన పందొమ్మిది దేశాలు సంతకాలు చేసినప్పటికీ కేవలం తొమ్మిది మాత్రమే ఈ ప్రయత్నంలో ఉన్నట్లు తమ పేర్లు పేర్కొనాలని చెప్పాయి. ఒక్క బ్రిటన్ మాత్రమే తమ యుద్ధ నౌకలను పంపింది. అనేక అరబ్బు దేశాలు పరిణామాలు, పర్యవసానాల గురించి ఆందోళన చెందుతున్నాయి. ఇజ్రాయిల్‌కు సంబంధం ఉన్న నౌకల రక్షణకు తామెందుకు మద్దతు ఇవ్వాలని అవి ఆలోచిస్తున్నాయి. హౌతీల దాడుల గురించి అమెరికా రక్షణశాఖ ఆందోళన చెందుతున్నట్లు వార్తలు వెలువడ్డాయి. హౌతీలు కేవలం రెండువేల డాలర్ల విలువగల డ్రోన్లతో దాడులు చేస్తుంటే తాము 21 లక్షల డాలర్ల విలువగల క్షిపణులను వాటిని కూల్చేందుకు వినియోగించాల్సి రావటం భారంగా భావిస్తున్నట్లు చెబుతున్నారు. గడచిన రెండు నెలల కాలంలో ఎర్రసముద్రంలో 38 డ్రోన్లను కూల్చివేసినట్లు అమెరికా చెప్పుకుంది. ఇరాన్ తయారు చేస్తున్న డ్రోన్ల కనిష్ట ధర రెండు వేల డాలర్లు కాగా గరిష్టంగా ఇరవైవేల డాలర్లు ఉంది. ప్రస్తుతం అమెరికా మధ్యధరా సముద్రం, ఏడెన్ గల్ఫ్‌కు రెండు విమాన వాహక యుద్ధ నౌకలు, నాలుగు డెస్ట్రాయర్లు, ఒక క్రూయిజర్‌ను పంపింది. సూయజ్ కాలువ ద్వారా హిందూ మహాసముద్రంలో ప్రవేశించే మార్గం ద్వారా ప్రపంచ వాణిజ్యంలో పన్నెండు శాతం రవాణా జరుగుతుంది. ఎర్ర సముద్రంలో తలెత్తిన పరిస్థితి కారణంగా నౌకలు గుడ్‌హోప్ అగ్రం వరకు వెళ్లి ఆఫ్రికా ఖండాన్ని చుట్టి వచ్చే పాత మార్గానికి మళ్లుతున్నాయి. ఇది ఖర్చుతో పాటు ప్రయాణ సమయాన్ని కూడా పెంచు



> గాజాలో కాల్పుల విరమణ జరిపేవరకు ప్రిటోరియాలోని ఇజ్రాయిల్ రాయబార కార్యాలయాన్ని మూసివేయాలని ఆదేశించటమే గాక అన్ని రకాల దౌత్య సంబంధాలను పక్కన పెడుతున్నట్లు దక్షిణాఫ్రికా చాలా రోజుల క్రితమే ప్రకటించింది. తమ మీద చేసిన అభియోగాలకు ఆధారం లేదని, రక్తపు మరకలను తమకు అంటిస్తున్నారని ఇజ్రాయిల్ ఆరోపించింది. గాజాలోని పౌరులు తమకు శత్రువులు కాదని చెప్పుకుంది. మరోవైపు గాజాలో అమాయకులెవరూ లేరని ఇజ్రాయిల్ అధ్యక్షుడు హెర్జోగ్ ప్రకటించాడు. అక్కడి జనం మానవ మృగాలు గనుక వారికి సామూహిక శిక్ష విధిస్తామని రక్షణ మంత్రి చెప్పాడు. ప్రధాని నెతన్యాహు బైబిల్‌లోని అంశాలను ఉల్లేఖించటం జాతి నిర్మూలనకు పిలుపునివ్వటం తప్ప మరొకటి కాదని అనేక మంది చెప్పారు.


తుంది. ఇజ్రాయిల్ చెబుతున్నట్లు ఈ ఏడాది అంతా గాజా మీద దాడులు జరిపితే ఎర్రసముద్రంలో దాడులు కూడా కొనసాగుతాయి. ఎవరి ఎత్తుగడలు వారికి ఉంటాయి. అమెరికా నేరుగా రంగంలోకి దిగటంతో తమ దాడులను కూడా తీవ్రం చేస్తామని హౌతీలు ప్రకటించారు.

పశ్చిమాసియా, ఉక్రెయిన్ సంక్షోభాలలో డ్రోన్ల వినియోగం యుద్ధ తీరుతెన్నులనే మార్చివేసిందంటే అతిశయోక్తి కాదు. భారీ ఖర్చుతో కూడిన అమెరికా, ఇతర నాటో దేశాల ఆధునిక ఆయుధాలు స్వల్ప ఖర్చుతో రూపొందించే నాటు రకం డ్రోన్లను కూల్చేందుకు ఉపయోగించాల్సి రావటం ఎంతో వ్యయంతో కూడుకున్నది. అందువలన ఇప్పుడు డ్రోన్లను కూల్చేందుకు శక్తివంతమైన లేజర్ కిరణాలను పంపే విధంగా కొత్త వ్యవస్థలను రూపొందించాల్సిన అగత్యం అమెరికాకు ఏర్పడింది. రష్యా ఇప్పటికే తన డ్రోన్లు పనిచేయకుండా స్తంభింపచేసే ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలను వమ్ము చేసేందుకు మాజిక్ రేడియో పేరుతో రక్షణ కల్పిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. దీన్ని బట్టి రానున్న రోజుల్లో సినిమాల్లో మాదిరి కిరణాల యుద్ధాలు జరగనున్నాయని చెప్పవచ్చు. శక్తివంతమైన లేజర్ కిరణాలను పంపి డ్రోన్లు, క్షిపణుల మీద దాడి చేసినపుడు వాటినుంచి వెలువడే ఉష్ణం వాటిని మండించి పనికి రాకుండా చేస్తుంది. హమస్, హౌతీ సాయుధులు ఉపయోగిస్తున్న మానవ రహిత ఆత్మాహుతి డ్రోన్లతో అమెరికా రక్షణశాఖను ఆతురతలోకి నెట్టారు. ఈ డ్రోన్లన ఇరాన్ వీరితో పాటు రష్యాకూ సరఫరా చేస్తున్నది. వాటితో ఉక్రెయిన్ మౌలిక సదుపాయాల వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న సంగతి తెలిసిందే. కేవలం యాభైవేల డాలర్ల విలువ గల రష్యా డ్రోన్లను కూల్చేందుకు అమెరికా అందచేసిన 30లక్షల డాలర్ల ఖరీదు చేసే పేట్రియాట్ క్షిపణులను జెలెన్స్కీ సేనలు ప్రయోగిస్తున్నాయి. వీటిని ప్రయోగించే మొత్తం వ్యవస్థకయ్యే ఖర్చు 110 కోట్ల డాలర్లు. ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణులు ఉక్రెయిన్ వద్ద నిండుకున్నట్లు, అందుకే పరిమి తంగా వాటిని వినియోగిస్తున్నట్లు చెబుతున్నారు. డ్రోన్ల గుంపు అంటే ఎన్ని అన్నది కూడా అర్ధంకాని స్థితి ఉంది. కొన్ని డజన్లు అంత కంటే ఎక్కువ దూసుకువచ్చినపుడు శక్తివంతమైన లేజర్ కిరణాలు వాటన్నింటినీ కూల్చివేసే అవకాశం లేదని చెబుతున్నారు. వీటిని ప్రయోగించాలంటే వాటిని ఉంచిన కేంద్రాలలో నిరంతరం విద్యుత్ సరఫరా కూడా ఉండాలి.

తాము నిర్మించినవే గనుక ఉక్రెయిన్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థలన్నీ రష్యన్లకు కొట్టినపిండి. ఇరాన్ సరఫరా చేసిన దీర్ఘ శ్రేణి డ్రోన్లలో ముందుగానే లక్ష్యాలను నిక్షిప్తం చేసి వదులుతున్నందున అక్కడి వ్యవస్థలను ధ్వంసం చేయగలుగుతున్నాయి. గాజాపై దాడులను విరమించకపోతే తాము ఇజ్రాయిల్‌లో మంటలు రేపుతామని హమాస్ తీవ్రవాదులు హెచ్చరిస్తున్నారంటే వారి దగ్గర ఇలాంటి డ్రోన్లు ఇప్పటికే చేరి ఉండాలి. ఉక్రెయిన్ వద్ద రాడార్లను, లేజర్ కిరణాలను తప్పించుకుంటూ సముద్రాల మీద తక్కువ ఎత్తులో ఎగిరే డ్రోన్లు ఉన్న కారణంగానే అజోవ్ సముద్రంలోని వంతెన పేల్చివేత, సెవాస్తపూల్‌లోని రష్యా నౌకలపై దాడులు సాధ్యమైందని చెబుతున్నారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్ యుద్ధాలలో వీటిని చూసిన తరువాత ప్రపంచ దేశాలలో ఆందోళన తలెత్తుతున్నది, భారీ ఆయుధాలు, జెట్ విమానాలను కూల్చటమెట్లా అని ఇప్పటి వరకు ఆలోచిస్తున్న దేశాలు ఇప్పుడు ఇలాంటి చిన్న వాటిని పసిగట్టేవాటిని తయారు చేయటం మీద కేంద్రీకరించాయి.

ప్రపంచంలోని అంధుల విద్య అభివృద్ధికి నిరంతరం కృషి చేసి ప్రత్యేక లిపిని కనిపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహా నీయుడు లూయిస్ బ్రెయిలీ. చిన్నతనంలోనే చూపు కోల్పోయినప్పటికీ ఏమాత్రం కుంగిపోకుండా తనలాంటి అంధులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునే విధంగా ప్రత్యేక లిపి కోసం పాటుపడ్డాడు. 1809 జనవరి 4న పారిస్ దగ్గరలోని క్రూవే గ్రామంలో జన్మించిన ఆయన బాల్యంలో ప్రమాదవశాత్తు రెండు కండ్లు కోల్పోయి అంధుడిగా మారాడు. పారిస్‌లో 1784లో వాలెంటైన్ హ్యూ ప్రారంభించిన అంధుల పాఠశాలలో చేరాడు. ఆయనకున్న తెలివితేటలను చూసి ఉపాధ్యాయులే ఆశ్చర్యపోయారు అప్పటికే అమలులో ఉన్న 'లైన్ టైపు' పద్ధతిలో పట్టుదలతో చదువుకుని పదిహేండ్ల వయసులోనే అదే స్కూలులో ప్రొఫెసరుగా నియమించబడ్డాడు. పగలు పాఠశాలలో విద్యార్థులకు చదువు చెప్పుతూ, రాత్రి సమయంలో అంధులు చదవగలిగే, రాయగలిగే లిపి తయారీ కోసం అహర్నిషలు కృషిచేసాడు. అంధులకు పుస్తకాలు స్పర్శతో గుర్తుపట్టి చదివేందుకు వీలుగా చుక్కలు ఉండాలనే నిర్ణయానికి వచ్చాడు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన
లూయిస్ బ్రెయిలీ



1821లో ఛార్లెస్ బార్బియర్ అనే సైనికాధికారి, తన సైనికులు చీకటిలో కూడా తాను పంపిన సమాచారం గుర్తించేందుకు పన్నెండు ఉబ్బెత్తు చుక్కలతో ఉన్న లిపిని బ్రెయిలీ ఆరు చుక్కలకు తగ్గించాడు. బ్రెయిలీ కనిపెట్టిన లిపికి అధికారిక గుర్తింపు కోసం అతని శిష్యులు చేసిన పోరాటం వలన అతని లిపికి అధికార గుర్తింపునిచ్చి బ్రెయిలీని ఫ్రాన్స్ దేశం తమ ముద్దుబిడ్డగా ప్రకటించుకుంది. అంధులు చదువుకోవడానికి ఎక్కువ కృషి చేసింది అంధులే. స్పెయిన్ దేశానికి చెందిన ఫ్రాన్సిస్కో లూకాస్ 16వ శతాబ్దంలో చెక్క మీద ఎత్తుగా ఉబ్బివుండే అక్షరాలను చెక్కే పద్ధతి రూపొందించాడు. పారదస్ అనే అంధుడైన సంగీతజ్ఞుడు, అతని మిత్రుడు హెయిలీ కలిసి పేపరు మీద ఎత్తుగా ప్రింటు చేసే విధానం రూపొందించారు. తరువాత ఎంతోమంది దీని గురించి పరిశోధన కొనసాగించారు. అయితే అవి గుడ్డివారికి చదువు నేర్చుకొనడానికి అంత సులభంగా వుండేవి కావు.

కానీ బ్రెయిలీ మాత్రం తన నూతన పద్ధతి సిద్ధాంతీకరించాడు. ఐదేండ్ల పరిశోధనలో బ్రెయిలీ తన పద్ధతిలో సంపూర్ణత సాధించాడు. ఆరు చుక్కలను వివిధ రకాలుగా ఉపయోగించడం వల్ల మొత్తం అక్షరాలను రూపొందించాడు. ఇది విప్లవాత్మకమైన మార్పు, ఆరుపాయింట్లు వివిధ రకాలుగా వాడి మొత్తం ఇంగ్లీషు అక్షరాలన్నీ పలికేటట్లు చేశాడు. ఒక చుక్క నుండి ఆరు చుక్కల్లోనే మొత్తం అక్షరాలన్నీ తయారు చేశాడు. ఈ విధంగా మొత్తం భాషకు 250 గుర్తులు ఈ ఆరు చుక్కలలో బ్రెయిలీ రూపొందించాడు. దీంతో గుడ్డివారికి ఇతరుల సహాయం అక్కరలేదు బ్రెయిల్‌లో రాయగలరు, చదవగలరు. అంధులకు అతను కనుగొన్న లిపికి గుర్తింపు అతని మరణానం తరమే వచ్చింది. సంగీతాన్ని కూడా తన లిపిలో రాయడం అతని విశిష్టత. ఆధునికయుగంలో అంధులు చదువుకునే పుస్తకాలన్నీ బ్రెయిలీ లిపిలో ఉంటున్నాయి. తన పరిశోధన ద్వారా విప్లవాత్మకమైన మార్పు సాధించి దీనిని కనుగొన్న వ్యక్తిగా లూయిస్ బ్రెయిలీగా చరిత్రకెక్కాడు. బ్రెయిలీ 1852 జనవరి 6న 43 సంవత్సరాల పిన్న వయస్సులోనే మరణించాడు. అంధులకు విద్యాదానం చేసిన బ్రెయిలీ చిరస్మరణీయుడు.

ప్రపంచ జనాభాలో నాటికి సుమారు 49.1మిలియన్ల మంది అంధులున్నారు. 1990లో 34.4శాతం ఉంటే 2020నాటికి 49.1 శాతానికి అంధుల జనాభా పెరిగింది. అభివృద్ధి చెందిన అమెరికాలో 40ఏండ్ల కంటే తక్కువ వయసున్న వారిలో 12 మిలియన్ల మందికి దృష్టిలోపం ఉంటే,అమెరికాలో అత్యధిక మంది కండ్లద్దాలు అవసరం అవుతున్నవి. ప్రతి యేటా అమెరికాలో ఒక మిలియన్స్ అంధులు కంటి వైద్యున్ని సంప్రదిస్తున్నారు. 2020నాటికి అంధత్వాన్ని నివారించాలని ప్రారంభించిన విజన్ 2020లో భారత ప్రభుత్వం చేరింది. ప్రపంచంలోనే అత్యధిక అంధులు ఉన్న దేశం కూడా ఇండియానే. దేశంలో పురుషుల కంటే స్త్రీలలో అంధత్వం ఎక్కువగా ఉంది. దేశంలో తొమ్మిది రాష్ట్రాలలో అంధుల పాఠశాల వివరాలు ప్రకారం 60 శాతం మంది అబ్బాయిలు పాఠశాలకు వెళ్తున్నారు. 40శాతం మంది మాత్రమే బాలికలున్నారు. రేటీనా క్షీణత వలన 16.7శాతం మంది పూర్తిగా కంటిచూపు కోల్పోతున్నారు. అంధుల సగటు జీవిత కాలం 40-55ఏండ్లు ఉంటోంది.

1976లో అంధత్వ నియంత్రణ జాతీయ కార్యక్రమం ప్రారంభించారు. 2025నాటికి అంధత్వం కలిగిన వారి సంఖ్య 0.25 శాతనికి తగ్గించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న అది సాధ్యం కాలేదు. ప్రతి ఏటా ఏప్రిల్ 1-7 వరకు దేశవ్యాప్తంగా అంధత్వ నివారణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. 2023లో నిర్వహించిన వారోత్సవాలలో అంధులకు, పుట్టుకతో అంధులు లేదా ప్రమాదం కారణంగా కంటిచూపు కోల్పోయిన వారికి కంటి విలువ తెలియ చేయడానికి అవగాహనా కల్పించేందుకు 2023 ఏప్రిల్ 1-7వరకు అంధత్వ నివారణ వారోత్సవాలు అన్ని రాష్ట్రాల్లో జరిగాయి. 2021-22లో గుజరాత్ రాష్ట్రం అంధత్వ నివారణ కోసం రూ.4295.22 కోట్లు ఖర్చు చేయాలని అంచనా వేసి కేవలం 1288.80కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. తెలంగాణలో రూ.1125.70 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించి 283.87కోట్లు ఖర్చు చేసింది. గొప్పగా నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చడంలో మన పాలకులకు అంధత్వ నిర్మూలన పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థం అవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంధుల కోసం ప్రత్యేకంగా విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలి. సామూహిక ప్రాంతాల్లో బ్రెయిలీ లిపిని అందుబాటులో ఉంచాలి. అన్ని రకాల అంధత్వం కలిగిన వారికి వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారిచేయాలి. ప్రభుత్వ సమాచారం, జీవోలు, చట్టాలు బ్రెయిలీ లిపిలో ముద్రించి అందుబాటులోకి తేవాలి. వారికి పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాల్సిన అవసరముంది.

(నేడు లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి)

- యం అడివయ్య, 9490098713

స్టాక్ మార్కెట్ వీరంగం దేనికి సంకేతం?


మన దేశీయ సెన్సెక్స్‌లో ఇండెక్స్ 72,000 దాటిందని, ఇది ప్రభుత్వ ఘనతగా కొన్ని పత్రికలు, ప్రభుత్వ అనుకూల ఆర్థికవేత్తలు హంగామా చేస్తున్నారు. ఇదే ఊపులో ఇండెక్స్ ఒక లక్ష దాటినా ఆశ్చర్యం లేదని ఉదర కొడుతున్నారు !!లోతుగా పరిశీలిస్తే సెన్సెక్స్‌లో ఉండే 30 కంపెనీల వెయిటేజీలో ఆరు కంపెనీలకు దాదాపు 48 శాతం వెయిటేజీ ఉంది. అవి ఆర్ఐఎల్, ఐటీసీ, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ ఈ షేర్‌ల ధరలను బట్టి సెన్సెక్స్ పెరుగడం, తగ్గడం జరుగుతోంది. సెన్సెక్స్ పెరుగుదల, తగ్గుదల ఆరు కంపెనీలపై ఆధారపడి ఉంటే, అది ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను ఎలా ప్రతిబింబిస్తుంది? దేశ ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా ఉంటే అభివృద్ధి సూచికలు అన్నింటిలో మన దేశం ఎందుకు తీసికట్టుగా ఉంటోంది? 80 కోట్ల మంది ప్రభుత్వం నెలకు ఇచ్చే ఐదు కేజీల తిండిగింజలపై ఎందుకు ఆధారపడి ఉన్నారు? ప్రజల ఆదాయాలు, జీవన ప్రమాణాలు దిగజారి,కుటుంబ అప్పు ఎందుకు పెరుగుతోంది? కనీవినీ ఎరుగని నిరుద్యోగం దేశంలో ఎందుకు తాండవ మాడుతోంది? కాబట్టి ఆర్థిక వ్యవస్థ తీరు తెన్నులకు, సెన్సెక్స్ పరుగులకు ఎలాంటి సంబంధం లేదని మనకు తెలుస్తుంది. దేశంలో పెరుగుతున్న ఆదాయ అసమానతలు ఈ మార్కెట్ వీరంగానికి ప్రధాన కారణం. దేశంలో ఒకశాతం ధనికులు లక్షల కోట్ల రూపాయల ఆస్తులు కలిగి ఉన్నారు. ప్రతీ ఏటా ధనికుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. దేశంలోని ధనిక కుటుంబాలు 2022-23లో 20 లక్షల కోట్ల రూపాయలు వ్యక్తిగత సంపద పెంచు కున్నట్లు నిపుణులు చెబుతున్నారు. దీనిలో కొంతభాగం దేశీయ స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. అందుకే గత ఏడాది దేశీయ ఫండ్స్ నుంచి 20 బిలియన్ డాలర్లు,15 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు మన దేశీయ స్టాక్ మార్కెట్ లోకి వచ్చింది.



పి. సతీష్
9441797900

గతేడాది సెన్సెక్స్‌లో ధనికుల పెట్టుబడుల పై వారికి 20 శాతం దిగుబడి రావడం విశేషం!! 2024లో సైతం ధనిక మదుపుదారులకు లాభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లు తగ్గించే సూచనలు కనిపిస్తున్నాయి. దీని ప్రభావం మన దేశంపై కూడా పడుతుంది. అమెరికాలోని మదుపుదారులు అక్కడ చౌకగా రుణాలు పొంది, వాటిని అమెరికన్, ఇండియా స్టాక్ మార్కెట్‌లలో సైతం పెట్టుబడులు పెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కూడా వడ్డీరేట్లు తగ్గిస్తే ,ఇక్కడ దేశీయ మదుపుదారులు ఇంకా స్టాక్ మార్కెట్‌లలో పెట్టే మొత్తాలు పెరుగుతుంది. స్టాక్ మార్కెట్ల పూనకం కొనసాగుతుంది. అయితే, రిటైల్ మదుపుదారులు స్టాక్ మార్కెట్‌లలో స్పెక్యులేటివ్ పెట్టుబడులు పెద్దఎత్తున పెడుతుండడం ఆందోళనకరం. ఫ్యూచర్ మార్కెట్‌లో లాభాలు రావాలంటే, ఎక్కువ సంఖ్యలో షేర్‌లు కొనాలి. ఉదాహరణకు క్యాష్ మార్కెట్‌లో 100 ముఖవిలువతో 20 వేల షేర్లు కొనాలంటే, 20 లక్షల రూపాయలు ఖర్చు చేయాలి.అదే డెరివేటివ్ మార్కెట్‌లో పదిశాతం మార్జిన్ అమౌంట్ చెల్లిస్తే సరిపోతుంది. అయితే, షేర్ ధరలు పడిపోతే,భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇతర దేశాల్లో క్యాష్ మార్కెట్ లో డెరివేటివ్ మార్కెట్ వాటా ఐదు నుంచి పదిశాతం ఉంటుంది. మన దేశంలో ఇది 400 రెట్లు ఉంది. ఒకవేళ, మార్కెట్లు ఉన్నపళంగా కుప్పకూలితే దీని ప్రభావం అప్పుల మీద,చెల్లింపుల మీద పడుతుంది.అప్పుడు పారు బకాయిల భారం పెరుగుతుంది. దీనర్థం ఏమిటంటే ప్రజల సొమ్ముతో కార్పొరేట్లు, బడా ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్‌లో పెద్దఎత్తున లాభాలు ఆర్జిస్తున్నారు. నష్టం వస్తే బ్యాంకులకు, ఎన్‌బీఎఫ్‌సీలకు పంగ నామాలు పెడుతున్నారు. ఒక రైతు ట్రాక్టర్ కొనుక్కోవ డానికి ఆయనకు 14శాతం నుండి 16శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. కానీ కాల్ మనీ, షార్ట్‌టర్మ్ లోన్ పేర్లతో స్టాక్ బ్రోకర్లకు, మదుపుదారులకు కారుచౌకగా అప్పులు దొరుకుతున్నాయి. నిజ ఆర్థిక వ్యవస్థ కన్నా, స్టాక్ మార్కెట్ అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేయడం వల్ల ఇదంతా జరుగుతోంది

1996లో ఎన్రాన్ కంపెనీ విద్యుత్ ఉత్పత్తి చేస్తామని ఇలాగే ప్రభుత్వ బ్యాంకుల నుండి అప్పు తీసుకుని, ఆనాటి మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకుని చివరికి ఉత్పత్తి చేయకుండానే మన దేశం నుంచి ఉడాయించింది. దానికి అప్పు ఇచ్చిన బ్యాంకులు మునిగాయి. ఆ కంపెనీలో షేర్లు కొన్న సామాన్య మదుపుదారులు మునిగారు. చివరికి ఆ కంపెనీ ఉద్యోగులు కూడా మునిగిపోయారు. స్టాక్ ఆప్షన్లు పేరుతో ఎన్రాన్ ఉద్యోగులకు ఇచ్చిన షేర్లు చిత్తు కాగితాలుగా మిగిలాయి. కింగ్ ఫిషర్, నీరవ్ మోడీల కథలు ఇవే కదా!! 2021-22లో ఎఫ్‌డిఐ రూపేణా రూ.4.37 లక్షల కోట్లు మన దేశ ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశిస్తే, 2022-23 సంవత్సరంలో మన దేశంలోకి విదేశీ పెట్టుబడులు భారీగా తగ్గి



> దేశంలో పెరుగుతున్న ఆదాయ అసమానతలు ఈ మార్కెట్ వీరంగానికి ప్రధాన కారణం. దేశంలో ఒకశాతం ధనికులు లక్షల కోట్ల రూపాయల ఆస్తులు కలిగి ఉన్నారు. ప్రతీ ఏటా ధనికుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. దేశంలోని ధనిక కుటుంబాలు 2022-23లో 20 లక్షల కోట్ల రూపాయలు వ్యక్తిగత సంపద పెంచు కున్నట్లు నిపుణులు చెబుతున్నారు. దీనిలో కొంతభాగం దేశీయ స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించింది.అందుకే గత ఏడాది దేశీయ ఫండ్స్ నుంచి 20 బిలియన్ డాలర్లు,15 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు మన దేశీయ స్టాక్ మార్కెట్ లోకి వచ్చింది.

రూ.3.67 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయి. మన దేశంలోకి వచ్చిన ఎఫ్‌డిఐ కూడా సేవా రంగంలోకి, సాఫ్ట్‌వేర్ రంగంలోకి కీలకంగా వచ్చింది.తయారీ రంగం, నిర్మాణ రంగంలో,నైపుణ్య మెరుగుదల రంగంలోకి ఎఫ్‌డిఐ నామమాత్రంగా వచ్చింది. ఇది దేశ అభివృద్ధికి ఎలా దోహదపడుతుంది? అస్థిరమైన విదేశీ పెట్టుబడుల కోసం, అర్రులు చాస్తున్నారు. విదేశీ పోర్టు ఫోలియో పెట్టుబడులు దేశ ఆర్థికవ్యవస్థలను ఎలా దెబ్బ తీస్తాయో, 80,90 దశకంలో ఆగ్నేయసియా దేశాల ఆర్థికవ్యవస్థల పతనం చూస్తే తెలిసి పోతుంది. ఇన్ని దశాబ్దాల అనుభవం ఉన్నా, ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడులు కోసం ఎగబడుతూ, చేయని పని లేదు.

దేశంలో నియంత్రణా వ్యవస్థల నిర్వహణ సామర్థ్యం వల్లే 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని మన దేశం సమర్థవంతంగా ఎదుర్కొనగలిగింది. బ్యాంకులలో ద్రవ్య లభ్యత ఎంత ఉండాలి, ఎంతమేర అప్పులివ్వాలి, మూల ధనం ఎంత ఉండాలో మన దేశంలో కఠిన చట్టాలు ఉన్నాయి. అయితే, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒత్తిడి మేరకు, వాటిని నిర్వీర్యం చేయాలనే ప్రయత్నాలు వేగవంతమయ్యాయి.అందుకే రాను రానూ దేశంలో నియంత్రణా వ్యవస్థల పరిధికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇచ్చే పరపతి రుణాలు కోతకు గురవుతున్నాయి. కార్పొరేట్ రుణాలు, అంతకంతకూ పెరుగుతున్నాయి. ప్రజల సొమ్ముతో వ్యాపారాలు చేసి కార్పొరేట్లు వేలకోట్ల రూపాయలు ఆర్జించడం,అప్పులను ఎగ్గొట్టి బ్యాంకులను ముంచడం,ఆ బ్యాంకులను కాపాడే మిషతో మళ్లీ ప్రభుత్వం ప్రజాధనాన్ని బ్యాంకులకు కాపిటల్‌గా అందించడం ఇదే పరిపాటి అయ్యింది

ఎందుకు కార్పోరేట్ కంపెనీల పారు బకాయిలను మాఫీ చేస్తున్నారు? వారి అప్పులను గోళ్ళూడ గొట్టి ఎందుకు వసూలు చేయరు? ఎందుకు బ్యాంకులను ప్రయివేటుపరం చేస్తున్నారు?ప్రజలు చైతన్యపూర్వకంగా ఈ ప్రశ్నలు అడిగి, ప్రభుత్వాలను నిలదీయనంత కాలం ఈ దోపిడీ విశృంఖలంగా సాగుతూనే ఉంటుంది!! ప్రజల డబ్బుతో కొంత మంది బడా బాబులు స్టాక్ మార్కెట్‌లో జూదం ఆడుతూనే ఉంటారు !!స్టాక్ మార్కెట్‌ల వీరంగం చూసి, నిజ ఆర్థిక వ్యవస్థ పెరుగుతోందని భ్రమ పడేవారు ఈ వాస్తవాలు గ్రహించాలి.

గ్రామీణ ప్రాంతాల్లో పని హక్కుపై కేంద్రం దాడి

- 'ఉపాధి'కి ఎబీపీఎస్ అనుసంధానాన్ని ఉపసంహరించుకోవాలి
- కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ఆందోళనలు
- 'ఉపాధి' ప్రాథమిక స్వభావానికి మోడీ సర్కార్ వ్యతిరేకం : ఎఐఎడబ్ల్యూయూ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గ్రామీణ భారతదేశంలో పని హక్కుపై కేంద్ర ప్రభుత్వం దాడి చేయడాన్ని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యూయూ) సెంట్రల్ వర్కింగ్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకింది. ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబీపీఎస్)కి అనుసంధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఎబీపీఎస్ విధించిన కారణంగా ఉపాధి హామీ కింద నమోదైన కోట్లాది మంది కార్మికుల పని హక్కును నిరాకరించడాన్ని వ్యతిరేకించింది. ఈ చర్యకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం ఎఐఎడబ్ల్యూయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. విజయరాఘవన్, బి.వెంకట్ ప్రకటన విడుదల చేశారు. ఎబీపీఎస్‌ని తప్పనిసరి చేయడంతో ఉపాధి కింద పని చేసే హక్కుపై జరుగుతున్న దాడులను ఆపాలని కోరారు.

"ఎబీపీఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వాలు డేటాబేస్‌ను నవీకరించడానికి గడువు 2023 డిసెంబర్ 31తో ముగిసింది. కేంద్ర ప్రభుత్వం తేదీని మరింత పొడిగించలేదు. కేంద్ర ప్రభుత్వం మొదట 2023 జనవరి 30న ఎబీపీఎస్‌ని విధించింది. ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘాల నుండి ప్రతిఘటన వ్యక్తమైంది.అయినప్పటికీ ప్రభుత్వం తన నిర్ణయాలను కొనసాగించింది. ఏడాది పొడవునా పొడిగింపులు పొడిగించారు. అయితే కోట్లాది మంది కార్మికులు ఇప్పటికీ ఎబీపీఎస్‌కి అనర్హులుగా ఉన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం జాబ్ కార్డ్‌లో 34.8 శాతం హెూల్డర్లు ఇప్పటికీ ఈ చెల్లింపు పద్ధతికి అనర్హులుగా ఉన్నారు" అని తెలిపారు.

ఎబీపీఎస్‌కు అనర్హులుగా వ్యవసాయ కార్మికులు

"ఇన్‌యాక్టివ్ జాబ్ కార్డ్ హెూల్డర్లను అనర్హులుగా కేంద్ర ప్రభుత్వం పరిగణిస్తోందని వివిధ మీడియా నివేదికలు సూచిస్తున్నాయి. ఉపాధి హామీ కింద నమోదైన 25.25 కోట్ల మంది వ్యవసాయ కార్మికుల్లో, కేవలం 14.35 కోట్ల మంది క్రియాశీల వ్యవసాయ కార్మికులుగా ఉన్నారు. అనర్హులను ప్రకటించడం పార్లమెంటు ఆమోదించిన ఉపాధి చట్టంలో పొందుపరిచిన కార్మికుల హక్కులకు విరుద్ధం. క్రియాశీల కార్మికులలో 12.7 శాతం మంది ఇప్పటికీ ఎబీపీఎస్‌కి అనర్హులుగా ఉన్నారు" అని పేర్కొన్నారు.

ఉపాధి హామీ ప్రాథమిక స్వభావానికి వ్యతిరేకంగా మోడీ సర్కార్

'కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఎబీపీఎస్‌ని 100 శాతం సాధించాలని రాష్ట్రాలు ఒత్తిడి చేస్తున్నాయి. ఆధార్ చెల్లింపులకు అర్హత లేని కోట్లాది జాబ్ కార్డులను (7.6 కోట్ల మంది వ్యవసాయ కార్మికులు) రాష్ట్రాలు తొలగించాయని క్షేత్రస్థాయి నివేదికలు వెల్లడిస్తున్నాయి" అని తెలిపారు. "జీవనోపాధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కోసం తీసుకొచ్చిన ఉపాధి హామీ ప్రాథమిక స్వభావానికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం నిరంతరం పని చేస్తోంది.

ఉపాధి హామీ గ్రామీణ ప్రజానీకానికి చెందిన అత్యంత పేద, అణగారిన వర్గాలు మనుగడ సాగించేందుకు సహాయపడింది. అదే సమయంలో వ్యవసాయ కార్మికులు, గ్రామీణ కార్మికుల సాధారణ వేతనాలు క్షీణించకుండా నిరోధించబడ్డాయి. చాలా ప్రాంతాలలో వేతనాలు స్థిరంగా ఉన్నాయి. నగదు పరంగా పెరుగుదల ఉంది" అని పేర్కొన్నారు.

ఐలు కేంద్ర కమిటీ జాతీయ కార్యవర్గ సభ్యులుగా సీనియర్ న్యాయవాది జీ.విద్యాసాగర్

- ఉపాధ్యక్షులుగా కొల్లి సత్యనారాయణ, కే. పార్థ సారథి..



(ఫైల్)

హైదరాబాద్: అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) జాతీయ మహాసభలు కోల్‌కతాలోని హౌరాలో విజయవంతంగా జరిగాయి. జాతీయ మహాసభల సందర్భంగా ఎన్నికైన కొత్త కమిటీ లోకి తెలంగాణ నుండి ప్రముఖ సీనియర్ న్యాయవాది, ఐలు తెలంగాణ గౌరవాధ్యక్షులు జీ.విద్యాసాగర్ , జాతీయ కార్యవర్గ సభ్యులుగా, బార్ కౌన్సిల్ మెంబర్, రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, ఐలు రాష్ట్ర కార్యదర్శి కె. పార్థ సారథి జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వీరితో పాటు కేంద్ర కమిటీలో తెలంగాణ నుంచి మరో ఏడుగురిని తీసుకున్నట్లు ఆ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

అమ్మాయి ప్రొఫైల్‌తో నకిలీ ఇన్‌స్టాగ్రామ్

- పలువురి అమ్మాయిలతో చాట్..నగ్న ఫొటోలతో వేధింపులు
- నిందితుడిని అరెస్టు చేసిన సైబర్‌క్రైమ్ పోలీసులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

అమ్మాయి ప్రొఫైల్‌తో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ సృష్టించి పలువురు అమ్మాయిలతో పరిచయం పెంచుకుని.. వారి ఫొటోలు మార్ఫింగ్ చేసి వేధిస్తున్న నిందితుడిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం జాయింట్ సీపీ ఏవి.రంగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన జె.కార్తిక్ రెడ్డి అమ్మాయిగా చెప్పుకుంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో చాలా మంది అమ్మాయిలను పరిచయం చేసుకుని వారికి దగ్గరయ్యేవాడు. అతను ఆమే అని నమ్మిన అమ్మాయిలు వారి వ్యక్తిగత చిత్రాలను, వీడియోలను షేర్ చేశారు. నిందితుడు వాటిని తన స్నేహితులకు, ఇతరులకు పంపించి పైశాచిక ఆనందం పొందేవాడు.

మరికొన్ని చిత్రాలను మార్ఫింగ్ చేసి.. తాను చెప్పినట్టు వినాలంటూ యువతులను వేధింపులకు గురిచేవాడు. ఇదే తరహాలో ఓ మైనర్ ఫొటోలను మార్ఫింగ్ చేసిన నిందితుడు ఆమెను భయాందోళనకు గురిచేశాడు. తాను చెప్పినప్పుడల్లా నగ్న వీడియోలు, ఫొటోలు పంపించాలంటూ వేధించాడు. ఆందోళనకు గురైన బాలిక విషయాన్ని ఇంట్లో చెప్పింది. బాధితుల ఫిర్యాదుతో నిందితుడిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులతో ఫేస్‌బుక్, ఇన్ స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సోషల్‌మీడియా మాధ్యమాలలో పరిచయాలు చేసుకోవద్దని, వారితో చాటింగ్ చేయొద్దని జాయింట్ సీపీ రంగనాథ్, డీసీపీ శిల్పవలి సూచించారు. ఎలాంటి ఫొటోలూ షేర్ చేయొద్దని చెప్పారు.

బీజేపీ.. సెంటిమెంట్ రాజకీయం

- ఎన్నికల వేళ తెరపైకి రామమందిరం
- మోడీని గద్దె దించడమే ఇండియా కూటమి లక్ష్యం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-నల్లగొండటౌన్

సెంటిమెంట్ పేరుతో బీజేపీ రాజకీయం చేసి లబ్ది పొందాలని చూస్తోందని, పార్లమెంటు ఎన్నికల వేళ అయోధ్యలోని రామమందిరాన్ని తెరపైకి తీసుకొచ్చిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో సీపీఐ(ఎం) సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి మూడోసారి అధికారంలోకి రావాలని బీజేపీ కుట్ర చేస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే అయోధ్యలోని రామ మందిరాన్ని ముందుకు తెచ్చి.. దేశవ్యాప్తంగా క్యాంపియన్ చేస్తూ ప్రజలను భక్తి సెంటిమెంట్‌తో మోసం చేయాలని చూస్తోందన్నారు. మూడోసారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని చెప్పారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష, ఒకే ఆహారం లాంటి విధానాలను ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ఇండియా కూటమి లక్ష్యమని చెప్పారు. ఆర్ఎస్ఎస్ విధానాలను మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్నదని, మోడీకి ఓటు వేస్తేనే గ్యాస్, పెట్రోల్‌పై సబ్సిడీ ఇస్తామని చెప్పడం మోసపూరితమన్నారు. సంక్షేమాన్ని రాజకీయంగా వాడుకుని లబ్దిపొందాలని చూస్తున్నారని విమర్శించారు. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్, బడా బాబులకు అప్పజెప్పి లూటీ చేస్తున్నారని వివరించారు. మోడీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో కేసీఆర్ అహంకారం వల్లే బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఓడిపోయిందని, గతంలో ఇచ్చిన హామీలు కూడా అమలు చేయకపోవడంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సాగర్ ఆయకట్టుకు, ఏఎంఆర్పీ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు సర్వేలు చేసి వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. ప్రజా పాలనలో భాగంగా గ్రామాలకు వస్తున్న అధికారులకు అన్ని పథకాలపై అర్హులతో దరఖాస్తులు పెట్టించాలని కోరారు. ఇటీవల మరణించిన తెలంగాణ సాయుధ పోరాట యోధులు కొయ్య లింగారెడ్డికి సమావేశంలో సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నారి ఐలయ్య, కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, మహమ్మద్ హాశం, సిహెచ్. లక్ష్మీనారాయణ, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి
- రావల్ కోల్, సైదోనిగడ్డ తండాలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో భారతదేశం ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని కేంద్ర బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని రావల్‌కోల్, సైదోనిగడ్డ తండా గ్రామ పంచాయతీల్లో బుధవారం జరిగిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సమాచార డిజిటల్ వాహనాన్ని వీక్షించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ సమాచారంతో కూడిన ఐఈసీ మెటీరియల్‌ను మంత్రి ఆవిష్కరించారు. రావల్ కోల్, సైదోని గడ్డతండా గ్రామ పంచాయతీల లో ఏర్పాటు చేసిన వివిధ కేంద్ర ప్రభుత్వ స్టాళ్లను సందర్శించారు. అనంతరం ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ.. దేశం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న ఈ సమయంలో, మనం వికసిత భారత్ సంకల్ప యాత్రను జరుపుకుంటున్నామన్నారు. 2008, 2009 సమయంలో భారత్ ఆర్థిక వ్యవస్థని ఐదు బలహీన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా చూసేవారని, ప్రధాని మోడీ సమర్థ పరిపాలన ఫలితంగా బలమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నేడు దేశం నిలిచిందన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి మారుతోందని, దాని ఫలం ప్రతి పేదవాడికీ చేరువవ్వాలన్నారు. ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకం ప్రయోజనాలను పొందని వారికి అందజేయడమే ఈ డిజిటల్ వాహనం ఉద్దేశమని వివరించారు.

గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లో తెలంగాణ రాష్ట్రానికి రూ.2.5 లక్షల కోట్లు ఇచ్చినట్టు తెలిపారు. రహదారుల అభివృద్ధికి రూ.93,000 కోట్లు, రైల్వేల అభివృద్ధికి ఐదేండ్లలో రాష్ట్రానికి రూ.4,500 కోట్లు ఇచ్చినట్టు చెప్పారు. పీఎం ఉజ్వల యోజన ద్వారా పదేండ్లలో 9.5 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇచ్చామని, దీని వల్ల దేశంలో మనం పొగ రహిత వంటిల్లు చూస్తున్నాం అన్నారు. గ్యాస్ మన దగ్గర ఉత్పత్తి బాగా తక్కువగా ఉందని, బయటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. అయినా పీఎం ఉజ్వల ద్వారా రూ.600కే గ్యాస్‌ను కేంద్రం అందజేస్తున్నట్టు తెలిపారు. మన ఇరుగు పొరుగు దేశాల్లో ఇంత చౌకగా దొరకదని చెప్పారు. గ్రామాలకు నీటిని సరఫరా చేయాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలది, రాష్ట్ర ప్రభుత్వానిది అని, కానీ ప్రతి గ్రామాన్నీ చేరుకోవడానికి హర్ ఘర్ నల్ జల్, జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ మంచి నీటి కుళాయి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. చిన్న వ్యాపారస్తులకు ఎలాంటి గ్యారంటీ లేకుండా రుణాలు ఇవ్వడం కేంద్రం సులభతరం చేసిందన్నారు. వీధి వర్తకులకు రుణాలు మంజూరు చేసి వారి ఉన్నతికి కట్టుబడి ఉందన్నారు.

అంతరాల సమాజంలో అవతరించిన మాతృమూర్తి సావిత్రిబాయి ఫూలే

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంతరాల సమాజంలో అవతరించిన మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య అన్నారు. హైదరాబాద్‌లోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శూద్రులు, మహిళలకు ఆనాటి సమాజంలో చదువు నిషేధం ఉన్నప్పటికీ, భర్త ప్రోత్సాహం, ఆమె పట్టుదలతో భారత దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా అవతరించారని గుర్తు చేశారు. ఎన్నో విద్యా కేంద్రాలను నెలకొల్పి బాలికలను విద్యావంతులను చేసిన గొప్ప తపస్వి అని ఆమె సేవలను కొనియాడారు. ఎన్నో అవమానాలను భరిస్తూనే ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా, సంఘసంస్కర్తగా ఆనాటి సమాజానికి ఎంతో సేవలందించిన గొప్ప త్యాగశీలి అని అన్నారు. ఇప్పుడు ఆధునిక సమాజంలో 30 శాతం మంది చదువుకు దూరంగా ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు అందరికీ చదువును అందించకపోగా, విద్యను ప్రయివేటీకరిస్తున్నాయని విమర్శించారు. సామాన్యులకు చదువును మరింత దూరం చేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక ప్రధాన సంపాదకులు పి మాణిక్ రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకులు జి మస్తాన్ రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 44 మంది పోలీసు అధికారుల బదిలీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో భారీ ఎత్తున పోలీసు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో పలు జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు కూడా ఉన్నారు. బదిలీ అయినవారిలో 23 మంది ఐపీఎస్ అధికారులు, 21 మంది నాన్‌క్యాడర్ ఎస్పీలున్నారు. రాష్ట్ర పోలీసు నియామక బోర్డు చైర్మెన్ వి.వి శ్రీనివాస రావ్‌ను రాష్ట్ర పోలీసు సాంకేతిక సేవల విభాగానికి బదిలీ చేశారు. అలాగే, టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మెన్‌గా కొత్త అధికారిని నియమించేంత వరకు ఈ విభాగాన్ని శ్రీనివాస్‌కే అదనపు చార్జీగా అప్పగించారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న గజరావ్ భూపాల్‌ను పోలీసు కోఆర్డినేషన్ డీఐజీగా నియమించి, రామగుండం కమిషనర్ రెమా రాజేశ్వరిని రాష్ట్ర మహిళా భద్రతా విభాగం డీఐజీగా బదిలీ చేశారు. డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్‌ను రామగుండం కమిషనర్‌గా నియమించారు. హైదరాబాద్ ఎస్‌బీ డీసీపీ జోయెల్ డేవిస్‌ను జోగులాంబ రేంజ్ డీఐజీగా నియమించి, ఖమ్మం కమిషనర్ విష్ణు ఎస్ వారియర్‌ను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఎస్పీ పి.వి పద్మజను మల్కాజ్‌గిరి డీసీపీగా నియమించి, పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ జానకీ షర్మిలను నిర్మల్ ఎస్పీగా నియమించారు.

మల్కాజ్‌గిరి డీసీపి జానకీ ధరావత్‌ను ట్రాన్స్‌ఫర్ చేసి నగర సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా పోస్టింగ్ ఇచ్చి నగర తూర్పు మండలం డీసీపీ సునీల్‌దత్‌ను ఖమ్మం కమిషనర్‌గా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను సీఐడీలో నియమించారు. ఆదిలాబాద్ ఎస్పీ డి. ఉదయ్ కుమార్ రెడ్డిని ట్రాన్స్‌కోకు బదిలీ చేసి.. గౌస్ ఆలమ్‌ను ఆదిలాబాద్ ఎస్పీగా నియమించారు. భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ వినీత్‌ను మాదాపూర్ డీసీపీగా నియమించి డాక్టర్ పి. శబరీశ్‌ను ములుగు ఎస్పీగా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న నితికా పంత్‌ను మేడ్చల్ జిల్లా ఎస్పీగా నియమించి.. సైబర్‌క్రైమ్ డీసీపీ బి. అనురాధకు సిద్దిపేట్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. మరో ఎస్పీ ప్రవీణ్ కుమార్‌ను ఎల్బీనగర్ డీసీపీగా నియమించి, నగర సౌత్ ఈస్ట్ డీసీపీ బిరుదరాజు రోహిత్ రాజును భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా నియమించారు.

నగర సౌత్‌వెస్ట్ డీసీపీ బాలస్వామిని మెదక్ ఎస్పీగా బదిలీ చేశారు. ములుగు ఓఎస్డీ అశోక్ కుమార్‌ను ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి ఓఎస్డీగా బదిలీ చేసి.. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న వెంకటేశ్వర్లును నగర ట్రాఫిక్ డీసీపీ-3గా ట్రాన్స్‌ఫర్ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న మరో డీసీపీ సీహెచ్ శ్రీనివాస్‌ను రాజేంద్రనగర్ జోన్ డీసీపీగా నియమించారు. వీరితో పాటు మరో 21 మంది నాన్‌క్యాడర్ ఎస్పీలనూ బదిలీ చేశారు.

చెయ్యి విరిగిందని వస్తే చంపేశారు!

- పీర్జాదిగూడ శ్రీకర ఆస్పత్రిలో దారుణం
- చికిత్సకు శరీరం సహకరించలేదన్న వైద్యులు
- పెద్ద దిక్కును కోల్పోయిన రెండు కుటుంబాలు



మృతుడు (ఫైల్)



నవతెలంగాణ-బోడుప్పల్

చెయ్యి విరిగిందని ఆస్పత్రిలో జాయిన్ అయితే.. ఆ వ్యక్తి ప్రాణమే పోయింది. దీంతో అతనిపై ఆధారపడిన రెండు కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయాయి. ఈ ఘటన హైదరాబాద్ మేడిపల్లి పీఎస్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు గ్రామానికి చెందిన మండల వెంకటేష్ గౌడ్(45) డిసెంబరు 30న కెపాల్ వద్ద ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొట్టింది. దీంతో అతని కుడి భుజం విరిగింది. చికిత్స కోసం పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని శ్రీకర ఆస్పత్రిలో జాయిన్ అయ్యాడు. పరీక్షించిన వైద్యులు.. జనవరి 1న ఆపరేషన్ చేశారు. అనంతరం ఐసీయూలో పెట్టారు. ఆ సమయంలో కుటుంబ సభ్యులను చూడనివ్వలేదు. రెండో తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో పరిస్థితి విషమించి వెంకటేష్‌గౌడ్ చనిపోయినట్టు కుటుంబీకులకు చెప్పారు. కాగా, వైద్యుల నిర్లక్ష్యం వల్లే వెంకటేష్ ప్రాణం పోయిందని కుటుంబీకులు మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సర్జరీ సమయంలో ఇచ్చిన మత్తు మందు వికటించడంతోనే కోమాలోకి వెళ్లి మృతిచెందాడని ఆరోపించారు. ఒకటో తేదీ ఆపరేషన్ జరిగితే.. రెండో తేదీ రాత్రి అతని శరీరం వైద్యానికి సహకరించడం లేదని, బతికించే ప్రయత్నం చేస్తున్నామని తమతో బలవంతంగా సంతకాలు చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

వెంకటేష్ గౌడ్ స్థానికంగా ప్రయివేటు స్కూల్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నారు. అతని అన్న అనారోగ్యంతో మృతిచెందగా.. అన్న కుటుంబాన్ని, పిల్లలను వెంకటేష్ గౌడ్ పోషిస్తున్నాడు. ఇప్పుడు కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వెంకటేష్‌గౌడ్ కూడా మృతిచెందడంతో రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మా ఇంటి పెద్ద దిక్కు ఇక లేడని కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు. శ్రీకర ఆస్పత్రిలో వెంకటేష్ మృతి ఘటనపై మేడ్చల్ జిల్లా వైద్యాధికారి రఘునాథ్‌ను మీడియా వివరణ అడగ్గా.. అతనికి ఆపరేషన్ సమయంలో పరిస్థితి విషమించిందని, ఐసీయూలో పెట్టి చికిత్స అందించినా ఫలితం లేకపోయిందని చెప్పారు. ఆ సమయంలో ఇలాంటి ఘటనలు జరగడం సహజమేనంటూ చెప్పుకొచ్చారు.

ఎంపీల్లో టెన్షన్..అసంతృప్తుల్లో జోష్

సిట్టింగ్‌లకు కన్ఫర్మ్ లేదంటున్న కిషన్‌రెడ్డి

- బీజేపీ అభ్యర్థుల మార్పు చర్చ మరోమారు
- ఆదిలాబాద్, కరీంనగర్ అభ్యర్థిత్వాలపైనే ఉత్కంఠ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రాష్ట్రంలోని బీజేపీ సిట్టింగ్ ఎంపీలకు సీట్లు కన్ఫర్మ్ అని ఎవరు చెప్పారు? రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో అమిత్‌షా సిట్టింగ్‌లకు హామీనిచ్చారని ఎవరన్నారు? దాని గురించి నిమిషం కూడా చర్చ జరగలేదు. ఆశావహుల మధ్య తీవ్ర పోటీ ఉంది. రాష్ట్రంలో 50 శాతం సీట్లకు అభ్యర్థులు ఖరారై పోయారు' అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కాక పుట్టిస్తున్నాయి. సిట్టింగ్ స్థానాల్లో ఇద్దరు అభ్యర్థులను మారుస్తారనే చర్చ మళ్లీ మొదలైంది. ఎవర్ని మారుస్తారనే చర్చ ఆ పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. దీనిపై తాజా ఎంపీలు బండి సంజయ్, సోయం బాపూరావు అనుచరులు గరంగరమవుతున్నారు. జాతీయ నాయకత్వమేమో అభ్యర్థుల బలాబలాలు, సామాజిక నేపథ్యం, సర్వే రిపోర్టుల ఆధారంగా ప్రకటిస్తామని చెబుతుండగా కిషన్‌రెడ్డి మాత్రం ఇప్పటికే 8 స్థానాలకు అభ్యర్థులు ఖరారయ్యారని ప్రకటించడంపై టికెట్ ఆశిస్తున్న నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో అభ్యర్థిత్వ మార్పు తమ నియోజకవర్గంలోనే అంటూ ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల్లోని ఎంపీల వ్యతిరేక గ్రూపు నేతలు ఖుషీ అవుతున్నారు. తాజా పరిణామాలను చూస్తే అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాదిరిగానే ముఖ్య నేతల మధ్య ఆధిపత్య పోరు లోలోన రగులుతున్నట్టే కనిపిస్తున్నది. సికింద్రాబాద్ నుంచి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి ధర్మపురి అర్వింద్ మరోసారి బరిలోకి దిగటం పక్కాగా కనిపిస్తోంది. ఆ నియోజకవర్గాల్లో వారిద్దరికీ ఇతర నేతల నుంచి పోటీ కూడా లేదు. కొన్ని రోజులుగా కరీంనగర్, ఆదిలాబాద్ ఎంపీలకు వచ్చే ఎన్నికల్లో ఆ స్థానాల నుంచి టికెట్లు ఇవ్వబోరనే చర్చ ఇప్పటికే జోరుగా నడుస్తున్నది. ఆదిలాబాద్ ఎంపీగా సోయం బాపూరావు ఉన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి అనూహ్యంగా ఆదిలాబాద్‌లో విజయం సాధించారు. ఇప్పుడు ఆ నియోజకవర్గంలో ఆయన సొంతగూటి నుంచే తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నారు. మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బాపూరావు(ఇటీవల బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు) రేసులోకి వచ్చారు. వారిద్దరూ బలమైన అభ్యర్థులే. ఆదిలాబాద్ పార్లమెంటరీ స్థానం పరిధిలో తాజా ఎంపీకి వ్యతిరేకంగా బీజేపీ కీలక నేతలు ఒక్కటవుతుండటం ఆయనకు మైనస్‌గా మారుతున్నది. మొత్తంగా అక్కడ ముగ్గురి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కరీంనగర్ నుంచి బండి సంజయ్‌ని వేరే నియోజకవర్గానికి పంపి ఆ స్థానం నుంచి రెడ్డి లేదా ముదిరాజ్ సామాజిక తరగతులకు చెందిన వారికి టికెట్ ఇస్తే బాగుంటుందని నియోజకవర్గంలోని బీజేపీ ముఖ్యనేతలు పట్టుబడుతున్నారు. తాజా రాజకీయ పరిస్థితుల్లో అక్కడ నుంచి బండి గెలవడనీ, అభ్యర్థిని మార్చాలని ఆ పార్టీలోని బండి వ్యతిరేక వర్గం పట్టుబడుతున్నట్టు తెలుస్తున్నది. బండికి టికెట్ ఇస్తే సహకరించేదే లేదంటూ ఆ ఎంపీ స్థానం పరిధిలోని గుజ్జుల రామకృష్ణారెడ్డి, సుగుణాకర్‌రావు, లింగయ్య లాంటి బీజేపీ సీనియర్ నేతలు బాహాటంగానే చెబుతున్న పరిస్థితి. అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో రెండు చోట్ల ఈటల రాజేందర్ ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఆయన తనకు కరీంనగర్ లేదంటే మల్కాజిగిరి స్థానం కేటాయించాలని అధిష్టానం వద్ద పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలోనే బండిని జహీరాబాద్‌కు మార్చి ఈటలను అక్కడ నుంచి పోటీచేయిస్తారనే చర్చ నడుస్తున్నది. దీనికి కరీంనగర్ తాజా ఎంపీ బండి సంజయ్ సుముఖంగా లేరని తెలుస్తోంది. అక్కడ ఈటలకు సీటివ్వకపోతే మల్కాజిగిరి ఎంపీ స్థానం నుంచి బరిలోకి దిగే అవకాశముంది. మహబూబ్‌నగర్ స్థానం తమకంటే తమకే అని డీకే అరుణ, జితేందర్‌రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో ఆ నియోజకవర్గంలో బీజేపీ శ్రేణులు రెండు గ్రూపులుగా విడిపోయిన పరిస్థితి. మల్కాజిగిరి సీటుపై డజన్‌కుపైగా ముఖ్యనేతలు కన్నేశారు. అక్కడ అభ్యర్థిని ప్రకటించడం కూడా ఆపార్టీకి కత్తిమీద సామే అన్నట్టుగా పరిస్థితి తయారైంది.

విద్యార్థినిపై వేధింపులు

- ఉపాధ్యాయునికి దేహశుద్ధి, అరెస్ట్



నవతెలంగాణ - భువనగిరి

విద్యార్థినిని వేధిస్తున్న ఓ ఉపాధ్యాయుడికి కుటుంబీకులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని బ్రిలియంట్ స్కూల్లో సైన్స్ ఉపాధ్యాయుడు సంజయ్‌కుమార్ 10వ తరగతి విద్యార్థినికి ఫోన్‌లో అసభ్య మెసేజ్‌లు పంపుతూ వేధించాడు. కొన్ని నెలలుగా వేధింపులు ఎక్కువ కావటంతో విద్యార్థిని కుటుంబసభ్యులకు చెప్పింది. దీంతో వారు బుధవారం పాఠశాలకు వచ్చి అతనికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంజయ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. విద్యార్థినిపై వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

విద్యార్థినులను బెదిరిస్తూ.. లైంగిక వేధింపులకుగురి చేసిన ఉపాధ్యాయున్ని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వడంతోపాటు ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు తీసుకునే చర్యలను వివరించాలని కోరారు. గతంలో జిల్లా కలెక్టర్ ఇలాంటి ఘటనపై విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు.

నవతెలంగాణ

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

చదువుకు కులం అడ్డు

కులనిర్మూలన కోసం పోరాడాలి

- సావిత్రిబాయిలా ముందుకెళ్లాలి : పెద్దపల్లి డీసీపీ చేతన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అందరికి విద్య అందకుండా కులం అడ్డుపడుతున్నదనీ, ఆ కుల నిర్మూలన కోసం పోరాడాలని పెద్దపల్లి డీసీపీ చేతన పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా దళిత స్త్రీ శక్తి (డీఎస్ఎస్) అధ్యక్షురాలు గెడ్డెం ఝాన్సీ అధ్యక్షతన బుధవారం హైదరాబాద్ లకిడీకాపూల్ సమీపంలోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో "పేదలకు అందని నాణ్యమైన విద్య" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేతన మాట్లాడుతూ, నాడు సావిత్రిబాయి పూలే పోరాటం లేకుంటే నేడు మహిళా విద్య అనేదే ఉండేది కాదని గుర్తుచేశారు. ఇప్పటికీ పరిస్థితిలో పూర్తిస్థాయిలో మార్పు రాలేదని అభిప్రాయపడ్డారు. సమాజంలో అట్టడుగున ఉన్నవారు విద్య, ఉద్యోగం, సామాజికంగా, రాజకీయంగా ఎదగడం అవసరమనీ, అందరూ సమానమని చెప్పే విద్య నేటి సమాజానికి అవసరమన్నారు. ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా దక్కాలన్నారు. అలాంటి హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కులవివక్ష తట్టుకోలేక బడి మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల నిర్మూలనే సమస్యలకు పరిష్కారమని స్పష్టం చేశారు. ఇంటర్నేషనల్ స్కూళ్లు విద్యార్థులను రోబోలుగా తయారు చేస్తున్నాయని విమర్శించారు. విద్యావ్యవస్థలో మార్పులు రావాలనీ, రాజకీయాల్లో నిలకడగా ఏండ్ల తరబడి నిలబడగలిగిన దళిత నాయకత్వం రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. సామాజిక కార్యకర్త సజయ మాట్లాడుతూ అందరూ చదువుకోకుండా ఆధిపత్య కులాలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. మనిషికి సహజంగానే తెలివి ఉంటుందనీ, చదువుకుంటే ఆ తెలివి పెరుగుతుందన్నారు. దాడులను ఎదుర్కొనే ధైర్యం వస్తుందన్నారు. మొదట్లో కొందరికే చదువును పరిమితం చేశారని గుర్తుచేశారు. నేర్చుకోవడం, సాధించుకోవడమే సావిత్రభాయి పూలేకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. ఇంటర్నేషనల్ ఫోర్డ్ ఫెల్లో (యుఎస్ఏ) డాక్టర్ ఎన్. సిద్ధోజీరావు మాట్లాడుతూ సావిత్రభాయి ఎదిగిందనీ, అలాగే సమాజం ఎదిగేందుకు పాటుపడిందని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతలు గుర్తెరిగితే హక్కులు సాధించుకోగలుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎఫ్ డైరెక్టర్ గిరిజ, ఆటమిక్ ఎనర్జీ సైంటిస్ట్ చారులత, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సెక్రెటరీ జనరల్ శంకర్, డిక్కీ మెంటార్ వనజాక్షి, డిక్కీ అరుణ తదితరులు పాల్గొన్నారు.



కాపురానికి రావడం లేదని..

- భార్య, అత్తపై కత్తితో దాడి
- మృతి చెందిన అత్త.. భార్య పరిస్థితి విషమం
- సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు
- పటాన్‌చెరు పీఎస్‌లో లొంగిపోయిన నిందితుడు



నవతెలంగాణ-పటాన్‌చెరు

భార్య కాపురానికి రాకపోవడానికి అత్తె కారణమని కోపంతో అల్లుడు అత్తపై దాడి చేయగా.. అదే కోపంలో భార్యపైనా విచక్షణా రహితంగా కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో నిందితుడి అత్త అక్కడికక్కడే మృతి చెందగా.. భార్య పరిస్థితి విషమంగా ఉండటంతో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రి తరలించారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన సాయిబాబాకు, ఇస్నాపూర్ గ్రామానికి చెందిన సత్యవతి (22)తో 2021లో వివాహమైంది. కాగా కొంతకాలంగా కుటుంబంలో మనస్పర్థలు ఏర్పడి గొడవలు జరగడంతో సత్యవతి పుట్టింటికి వచ్చేసింది. అయితే తమ కాపురానికి అడ్డువస్తున్నదనే కోపంతో ఇస్నాపూర్ పద్మారావు కాలనీలోని తన అత్త శాంతమ్మ ఇంటికి బుధవారం సాయంత్రం వెళ్లిన సాయిబాబా.. అత్తపై కత్తితో విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఆమెను కడుపులో పొడవడంతో శాంతమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. అడ్డొచ్చిన భార్య మెడపై కత్తితో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పటాన్ చెరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. పరిస్థితి విషమంగా ఉన్న సత్యవతిని హుటాహుటిన సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శాంతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడు సాయిబాబా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. కాగా వారికి రెండేండ్ల పాప, ఆరు నెలల బాబు ఉన్నారు. శాంతమ్మ భర్త శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గల్ఫ్‌లో కార్మికుడు మృతి

- పనిచేస్తుండగా స్టాండ్ విరగడంతో ప్రమాదం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఉన్న ఊర్లో ఉపాధి లేక.. బతుకు వేటలో గల్ఫ్‌కు ఉపాధి బాట పట్టిన వలస జీవుల బతుకులు ఆగమ్యగోచరంగా మారుతున్నాయి. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం దూస్గాం గ్రామానికి చెందిన సురుకుట్ల ప్రవీణ్‌కుమార్(30) సౌదీ అరేబియాలో మంగళవారం ప్రమాదవశాత్తు పని ప్రదేశంలో మృతిచెందాడు. దాంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ ఐదేండ్ల క్రితం బతుకు దెరువు కోసం సౌదీ అరేబియాకు ఎలక్ట్రిషన్ పనిపై వెళ్లాడు. విధినిర్వహణలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో స్టాండ్ విరగడంతో కింద పడి మృతిచెందాడు. కొద్ది రోజుల క్రితమే సెలవులపై స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్లాడు. ఇంతలోనే మరణవార్త విని కుటుంబీకులు గుండెలవిసేలా రోదిస్తుండటం స్థానికులను కంటతడిపెట్టిస్తుంది. మృతుని భార్య సమత ప్రస్తుతం గర్భిణి. ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా, సౌదీలో మృతిచెందిన ప్రవీణ్‌కుమార్ భౌతికకాయాన్ని స్వగ్రామానికి తెప్పించాలని భార్య, బంధువులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఎంపీ అరవింద్, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని కోరారు. ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. దాంతో ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేస్తూ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రవీణ్‌కుమార్ భౌతికకాయాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు కృషి చేస్తామన్నారు.

మైనార్టీ గురుకుల ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను ఎత్తేయాలి

టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహబూబ్‌నగర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు బాధ్యులను చేస్తూ ఐదు మంది ఉపాధ్యాయులు, ఒక సెక్యూరిటీగార్డును ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం శోచనీయమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) తెలిపింది. ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండా సస్పెండ్ చేయడంతో వారి ఆత్మస్థైర్యం దెబ్బతిని విద్యా బోధన కుంటుపడుతుందని పేర్కొంది. తక్షణమే ఈ ఆరుగురి సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి, మైనారిటీ గురుకుల విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి రాంబాబు, ఎం మహేష్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రామ్‌రెడ్డి అనే విద్యార్థి కుటుంబ సమస్యలు, తల్లి అనారోగ్యంపై బెంగతో ఈనెల ఒకటో తేదీన తెల్లవారుజామున మూడు గంటలకు అందరూ నిద్ర పోయిన సమయంలో తరగతి గదిలో ఫ్యానుకు ఉరేసుకుని మరణించినట్టు సీసీ కెమెరా ఫుటేజ్‌లో ఉందని తెలిపారు. అవేవీ పరిగణలోకి తీసుకోకుండా, సమగ్ర విచారణ జరపకుండా అందరి దృష్టి మళ్లించేందుకు ఉపాధ్యాయులను బలి పశువులను చేశారని విమర్శించారు. విద్యా బోధన చేయాల్సిన ఉపాధ్యాయులు వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డ్ డ్యూటీలను నిర్వహించాల్సిన పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు సంబంధం లేని అంశాలకు వారిని బాధ్యులను చేసి బలి చేయడం సరైనది కాదని అధికారులను కోరారు. అన్ని గురుకుల పాఠశాలలకూ కేర్ టేకర్లు, వార్డెన్లు, సైకాలజిస్టులు, ఇతర సిబ్బందిని నియమించాలనీ, గురుకుల ఉపాధ్యాయులపై ఉన్న బోధనేతర పనిభారాన్ని, మానసిక ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్‌ను ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఎత్తేయాలని కోరారు. లేకుంటే టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో దశల వారీ ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

- ఉప ముఖ్యమంత్రికి బీటీఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని బీటీఏ అధ్యక్షులు కల్పదర్శి చైతన్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం హైదరాబాద్‌లో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ,ఎస్టీలకు గొడ్డలిపెట్టుగా ఉన్న అడిక్వసీ జీవో నెంబర్ రెండును రద్దు చేసి కొత్త జీవోను తేవాలని సూచించారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను చెల్లించాలనీ, డీఏలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర సలహాదారులు మధుకర్, ఎస్ యాదయ్య, నాయకులు కావలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ముందు సంగారెడ్డి ప్రజలను ఓట్లు అడగను : జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'ఇక ముందు నేను సంగారెడ్డి ప్రజలను ఓట్లు అడగను. వారిని నేను రిజక్ట్ చేస్తున్న' అని మాజీ ఎమ్మెల్యే జగారెడ్డి వ్యాఖ్యానించారు. నేను ఓడిపోతున్నట్టు ఆరు నెలలకు ముందే నాకు తెలుసని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నియోజకవర్గంలో 99 అభివృద్ధి పనులు చేసి ఒక్క పని చేయకపోయినా ప్రజలు వాటినే అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పార్టీ ఆదేశిస్తే రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ కోసం పని చేస్తానని స్పష్టం చేశారు. పదేండ్లలో ఎవరు చేయని అభివృద్ధి చేశానన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ నేను అభివృద్ధి కోసం అనేక ప్రయత్నాలు చేసినట్టు తెలిపారు. సంగారెడ్డికి మెడికల్ కాలేజ్ సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతున్నట్టు రేవంత్‌రెడ్డికు ముందే చెప్పానన్నారు. రేవంత్ మాత్రం నేను గెలుస్తానని తనతో చెప్పారని గుర్తు చేశారు. ప్రజలు నన్ను గెలిపించలేదు కాబట్టి సంగారెడ్డి అభివృద్ధిపై నేను అడగలేనన్నారు. అన్ని నియోజకవర్గాల మాదిరిగానే సంగారెడ్డిలో ఆరు గ్యారంటీలు అమలవుతాయని చెప్పారు. ఓట్లు అడగడానికి మాత్రమే పని చేసే నాయకున్ని కాదని స్పష్టం చేశారు.

మారుతున్న వరంగల్ బల్దియా సమీకరణలు

- కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- బీఆర్ఎస్ బలం తగ్గితే..మేయర్‌కు గండమే..



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరతారని శాసనసభ ఎన్నికల ముందు నుంచి ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఆరుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరితోపాటు మాజీ కార్పొరేటర్లు సైతం కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. దాంతో 'పశ్చిమ' నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు గట్టి షాక్ తగిలింది. ఎన్నికల కంటే ముందే బీజేపీ కార్పొరేటర్ కాంగ్రెస్‌లో చేరారు. త్వరలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తాజాగా ఆరుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరడంతో ఇప్పటికే నలుగురు కార్పొరేటర్లున్న కాంగ్రెస్ పార్టీ బలం.. ఇప్పుడు 12కు చేరింది.



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల డివిజన్లున్నాయి. వాటిల్లో కార్పొరేటర్లు.. బీఆర్ఎస్‌కు 49 మంది, కాంగ్రెస్ నలుగురు, బీజేపీ 8 మంది, ముగ్గురు ఇండిపెండెంట్లు ఉన్నారు. ఈ బలాబలాలు క్రమక్రమంగా మారుతూ వచ్చాయి. ఎన్నికల సందర్భంలోనే వర్ధన్నపేట నియోజకవర్గంలో 1వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ అరుణాదేవి కాంగ్రెస్‌లో చేరగా, 'తూర్పు' నియోజకవర్గానికి చెందిన గుండేటి నరేందర్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ఆరుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, 9వ డివిజన్ కార్పొరేటర్ చీకటి శారద ఆనంద్, 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు, 48వ డివిజన్ కార్పొరేటర్ సర్తాజ్ బేగం, 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, 50వ డివిజన్ కార్పొరేటర్ కవితా కిషన్ కాంగ్రెస్‌లో చేరారు. వీరితోపాటు మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, స్వామిచరణ్, వీరగంటి రవీందర్, నలుబోల శ్యాం తదితరులు చేరారు.

మేయర్‌కు పదవీగండం..

వరంగల్ పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరుతుండటంతో బీఆర్ఎస్ బలం క్రమేణా తగ్గుతుంది. ఈ బలం మరింత తగ్గితే మేయర్ గుండు సుధారాణికి పదవీ గండం తప్పదు. మేయర్ తన పదవిని కాపాడుకోవడానికే మొగ్గు చూపితే భవిష్యత్తులో పార్టీ మారక తప్పకపోవచ్చని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ మారడానికి మొగ్గు చూపకపోతే పదవీ త్యాగం చేయాల్సి రావచ్చని భావిస్తున్నారు.

ఎక్సైజ్ పాలసీ కేసులో మూడోసారి

ఈడీ సమన్లు : పట్టించుకోని కేజ్రీవాల్



సమన్లకు సర్నైన కారణం చూపలేదు : ఈడీకి కేజ్రీవాల్ లేఖ

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు దర్యాప్తులో భాగంగా ఢిల్లీ ముఖ్యమంత్రికి ఈడీ జారీ చేసిన సమన్లను బుధవారం మూడోసారి కూడా అరవింద్ కేజ్రీవాల్ తోసిపుచ్చారు. తనకు సమన్లు జారీ చేసేందుకు దర్యాప్తు సంస్థ సహేతుక కారణం వెల్లడించలేదని ఈడీకి రాసిన లేఖలో కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈడీ ఈ అంశంలో అనవసరమైన గోప్యతను పాటిస్తోందని, ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తనను విచారణకు పిలవడం వెనుక నిజమైన ఉద్దేశం, పరిధి, స్వభావం, విస్తతిని అర్థం చేసుకోవడానికి తనకు వీలు కల్పించే పరిస్థితిని స్పష్టం చేయాల్సిందిగా అరవింద్ కేజ్రీవాల్ ఈ లేఖలో కేంద్ర ఏజెన్సీని కోరారు. మరోవైపు ఈడీ సమన్లపై ఆప్ తీవ్రంగా స్పందించింది. ఈ నోటీసులు అక్రమమని, తమ పార్టీ అధినేతను అరెస్ట్ చేసే ఉద్దేశంతోనే వాటిని ఇచ్చారని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. అయితే, దర్యాప్తు సంస్థలకు సహకరించేందుకు కేజ్రీవాల్ సిద్ధంగా ఉన్నారని తెలిపింది.

న్యూఢిల్లీ : ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఈడీ మూడోసారి జారీ చేసిన సమన్లను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పట్టించుకోలేదు. పైగా ఆ నోటీసులను చట్టవిరుద్ధమైనవిగా పేర్కొంటూ రాతపూర్వక సమాధానాన్ని పంపించారని ఆప్ వర్గాలు తెలిపాయి. ఈడీ జారీ చేసే నోటీసులు చట్ట విరుద్ధమైనవని, కేజ్రీవాల్‌ను అరెస్టు చేయాలన్నదే ఈడీ ఉద్దేశ్యంగా వుందని ఆప్ పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లకుండా కేజ్రీవాల్‌ను అడ్డుకోవాలని కేంద్ర ప్రయత్నిస్తోందని పేర్కొంది.ఈడీకి సహకరించేందుకు కేజ్రీవాల్ సిద్ధంగా వున్నారని, కానీ ఆయనను అరెస్టు చేయాలనే ఉద్దేశ్యంతోనే ఈ సమన్లు జారీ చేస్తున్నారని ఆప్ విమర్శించింది. ఎన్నిసార్లు అడిగినా, ఇప్పటివరకు కేజ్రీవాల్‌ను సాక్షిగా పిలిచారా లేక నిందితుడిగా రమ్మంటున్నారా అన్న విషయంపై ఇడి వివరణ ఇవ్వలేదని ఆప్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు. నవంబరు 2, డిసెంబరు 21 తేదీల్లో రెండుసార్లు ఇడి సమన్లు జారీ చేసింది. శిసోడియా అమాయకుడని రుజువవుతుందని, ఆయన జైలు నుండి విడుదలవుతారని, కేంద్రానికి కూడా ఈ విషయం తెలుసునని అన్నారు. ఇడిని ఉపయోగించి ప్రతిపక్షాల నేతలను అరెస్టు చేయడానికి దేశవ్యాప్తంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

అక్రమ మైనింగ్ కేసులో జార్ఖండ్ సిఎం పత్రికా సలహాదారు నివాసంపై ఈడీ దాడులు

జార్ఖండ్ రాష్ట్రంలో అక్రమ గనుల తవ్వకాలు, మనీ లాండరింగ్ వ్యవహారాలపై దర్యాప్తులో భాగంగా ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ పత్రికా సలహాదారు అభిషేక్ ప్రసాద్ అలియాస్ పింటూ నివాసంపై, సాహిబ్‌గంజ్ జిల్లా కలెక్టర్, ఎస్పి, మాజీ ఎంఎల్ఎ పప్పు యాదవ్ నివాసాలపై ఈడీ అధికారులు బుధవారం దాడులు చేశారు. కొంతమంది జైలు అధికారులు, పోలీసు కానిస్టేబుల్ నివాసాలపై కూడా దాడులు చోటు చేసుకున్నాయి. రాజధాని రాంచితో సహా మొత్తంగా రాష్ట్రంలో 12కి పైగా ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. రాజస్థాన్‌లో కూడా ఒక నివాసంపై దాడి జరిగింది. పిఎంఎల్ఎ నిబంధనల కింద ఈ దాడులు చేపట్టినట్లు ఇడి అధికారులు తెలిపారు. రాష్ట్రంలో అక్రమ గనుల తవ్వకాల వల్ల వంద కోట్ల రూపాయిల మేరకు లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. వాటిపై 2022 నుండి ఇడి దర్యాప్తు చేపట్టింది. సోరెన్ రాజకీయ సహాయకుడు పంకజ్ మిశ్రా, ఆయన అనుచరుల నివాసాలపై ఇడి దాడుల నేపథ్యంలో మనీ లాండరింగ్ దర్యాప్తు ప్రారంభమైంది. దర్యాప్తులో భాగంగా సేకరించిన సాక్ష్యాధారాలు, డిజిటల్ సాక్ష్యాలు, పత్రాలు బట్టి చూసినట్లైతే నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న మొత్తాలన్నీ అక్రమ గనుల తవ్వకాల నుండి వచ్చినవేనని వెల్లడైందని ఇడి తెలిపింది.

కోవిడ్‌తో దేశంలో ఐదుగురు మృతి

న్యూఢిల్లీ : గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా కోవిడ్‌తో ఐదుగురు మరణించారని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి) తెలిపింది. జెఎన్.1 సిరీస్ వేరియంట్‌కి సంబంధించి మంగళవారానికి మొత్తంగా 11 రాష్ట్రాల్లో 511 కేసులు నమోదయ్యాయి. ఇందులో కర్ణాటకలో 199, కేరళలో 148, గోవాలో 47, గుజరాత్ 36, మహారాష్ట్ర 32 కేసులు నమోదయ్యాయి. తెలంగాణాలో రెండు కేసులు తేలాయి. గత 24గంటల్లో 602 కొత్త కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుతం దేశంలో యాక్టివ్‌గా వున్న కేసుల సంఖ్య 4,440గా వుంది. గత 24గంటల్లో 722మంది కోలుకున్నారు. తాజాగా మరణించిన ఐదుగురిలో ఇద్దరు కేరళలో మృతి చెందారు. ఇప్పటికే ఇతర వ్యాధులతో బాధపడుతున్న 66ఏళ్ళ వృద్ధుడు, 79ఏళ్ళ వృద్ధురాలుగా వీరిని వున్నారు. హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్న 45ఏళ్ళ వ్యక్తి ఒకరు కర్ణాటకలో చనిపోయారు. పంజాబ్, తమిళనాడుల్లో మరో ఇద్దరు మరణించారు. కోవిడ్ సబ్ వేరియంట్ జెఎన్.1 చాలా వేగంగా వ్యాప్తి చెందుతోందని, అపోలో ఆస్పత్రికి చెందిన డాక్టర్ రాజేష్ చావ్లా తెలిపారు. ఇది ఒమిక్రాన్ వర్గానికి చెందినదన్నారు.





సెక్షన్ 104(1), (2) రద్దు కోసం ఉద్యమిస్తాం

హిట్ అండ్ రన్ కేసులపై కేంద్రం వెనక్కి తగ్గాలి : సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హిట్ అండ్ రన్ కేసుల్లో డ్రైవర్లకు పదేండ్ల జైలుశిక్ష, రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా జరిమానా విధించటం నుంచి కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గేదాకా ఉద్యమిస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్ చెప్పారు. భారత న్యాయ సంహితలోని హిట్ అండ్ రన్‌కు సబంధించి సెక్షన్ 104(1), (2) సెక్షన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్-సీఐటీయూ) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి చిక్కడపల్లి మెట్రో రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం వెంకటేశ్ మాట్లాడుతూ..ఉత్పత్తులు, నిత్యావసరాలు ఒక చోట నుంచి మరోచోటకు చేరవేయడంలో డ్రైవర్లు అందించే సేవలు కీలకమైనవన్నారు. అటువంటి డ్రైవర్లను ప్రమాదాలకు కారణమని నిందించడం సరిగాదన్నారు. రోడ్లు, సిగ్నలింగ్ వ్యవస్థలు సరిచేయకుండా డ్రైవర్లను బాధ్యులుగా చిత్రీకరించడం దుర్మార్గమన్నారు. అనుకోకుండా జరిగే యాక్సిడెంట్లను డ్రైవర్లకు ఉద్దేశపూర్వకంగా ఆపాదించడం అన్యాయమన్నారు. డ్రైవర్ల జీవితాల్ని జైలు పాలు చేస్తే అది భారత న్యాయ సంహిత కాదనీ, భారత అన్యాయ సంహిత అవుతుందని విమర్శించారు. ప్రమాదాల విషయంలో డ్రైవర్లకు పదేండ్ల జైలు శిక్ష, రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల జరిమానా ప్రతిపాదనలను వెనక్కి తీసుకోకపోతే మోడీ బండిని ముందుకు కదలనివ్వబోమని హెచ్చరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏఐఆర్‌ఈడబ్ల్యూఎఫ్ నగర కార్యదర్శి కే అజయ్ బాబు మాట్లాడుతూ..ప్రమాదాలు జరిగిన సందర్భంలో చట్టం చెప్పినట్టు డ్రైవర్లు అక్కడే ఉండి పోలీసులకు వివరాలు తెలుపుతారనీ, కానీ, పోలీసులు వచ్చేదాకా డ్రైవర్లపై దాడులు జరగకుండా అమిత్ షా, కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందా? అని ప్రశ్నించారు. సీఐటీయూ నగరాధ్యక్షులు జె.కుమారస్వామి మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ కేసులలో ఈ కొత్త ప్రతిపాదనల వలన డ్రైవర్ల సంపాదన ప్రభుత్వ ఖజానా పాలు, జీవితాలు జైలు పాలు అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలకు పూర్తిగా డ్రైవర్లు కారణం కాదనీ, ఇతర పరిస్థితులే 90 శాతం అని వివిగిరి లేబర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ సర్వే తేల్చిన విషయాన్ని ప్రస్తావించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు ఎం.సత్యనారాయణ, సహాయ కార్యదర్శులు జి.రాములు, డిఎల్ మోహన్, ఎఐఆర్‌డబ్ల్యూఎఫ్ నగర ఉపాధ్యక్షులు ఎమ్‌డీ ఖలీమ్, షేక్ సాబేర, గౌస్ భాష, సహాయ కార్యదర్శులు బి ఉమేష్ రెడ్డి, ముఖేష్ శర్మ, వహీద్, మజీద్, కోటి, నగర నాయకులు మోయిన్, శ్రీనివాస్, అర్బజ్ ఖాన్, శ్రీశైలం, రెహమాన్, ఫారుక్ పాల్గొన్నారు.

62కి పెరిగిన జపాన్ భూకంప మృతులు

- సహాయకచర్యలకు ఆటంకంగా మారిన వాతావరణం



వజిమా, జపాన్ : జపాన్ భూకంపంలో మృతుల సంఖ్య 62కి పెరిగింది. 300మందికి పైగా గాయపడగా, వారిలో 20మంది పరిస్థితి ఆందోళనకరంగా వుందని అధికారులు తెలిపారు. కాగా, శిధిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక సిబ్బంది శ్రమిస్తున్నారు. మరోవైపు బుధవారం భారీ వర్షాలు పడే అవకాశం వుందని, ఫలితంగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుందని అధికారులు హెచ్చరించడంతో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడుతోంది. తాజా భూకంపానికి ఇషికవా ప్రిఫెక్చర్, అందులోని నోటో ద్వీపకల్పం బాగా దెబ్బతిన్నాయి. వజిమా, సుజు నగరాల్లో అనేక వందల భవనాలు నేలమట్టమయ్యాయి. దాదాపు 32వేల మంది నిర్వాసితులు ప్రభుత్వం కల్పించిన ఆశ్రయాల్లో తల దాచుకున్నారు. కాగా, సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు ప్రధాని కిషిదా తెలిపారు. కాలంతో పోటీ పడుతూ సహాయక సిబ్బంది బాధితుల ప్రాణాలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

దీపాదాస్ మున్షీని కలసిన మధు యాష్కీ



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జిగా నియమితులైన సందర్భంగా బుధవారం తాజ్ డెక్కన్ హెూటల్ లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మధు యాష్కీగౌడ్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ప్రజల వద్దకు ప్రభుత్వాన్ని తీసుకొచ్చామని అన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



నవతెలంగాణ- సంతోష్ నగర్

యాకుత్‌పురా నియోజకవర్గం కుర్మాగూడ డివిజన్ మాదన్నపేట్ పరిధిలోని పూజారి శివ పంతులు, గురుస్వామి మోహన్ కృష్ణ (లడ్డు) ఆధ్వర్యంలో బుధవారం అత్యంత వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కన్నె స్వామి సహన్య, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత మోటార్ సైకిళ్లు ఇవ్వాలి

• సీఐటీయూ డిమాండ్

నవతెలంగాణ - ధూల్ పేట్

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత మోటార్ సైకిళ్ళు ఇవ్వాలని, అడ్డాల వద్ద మూత్రశాలలు, కనీస వసతులు కల్పించాలని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి మీసాల శ్రావణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తాడ్ బన్ లేబర్ అడ్డా వద్ద కార్మికుల సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఏ ఆపద వచ్చినా కార్మికులకు అండగా ఉండేది సీఐటీయూ యూనియన్ అని గుర్తుచేశారు. ప్రతి సంవత్సరం కార్మికులు తమ బాధ్యతగా సభ్యత్వం తీసుకొని సంఘంలో సభ్యులుగా చేరాలని కార్మికులకు పిలుపు నిచ్చారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం అనేక పోరాటాలు చేసి సాధించామని, ఆ సంక్షేమ బోర్డులో ప్రస్తుతం కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాల బెన్ పిట్స్ పెంచాలన్నారు. హైదరాబాద్‌లోని కార్మికులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని పట్టణాల్లో కూడా అమలులోకి తీసుకొనిరావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షురాలు మీనా, జిల్లా ఉపాధ్యక్షులు కె. జంగయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - సంతోష్ నగర్

హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ ఐపీఎస్ బిరుదు రాజు రోహిత్ రాజు మలక్‌పేట్ నియోజకవర్గం సైదాబాద్ పరిధిలోని డీసీపీ కార్యాలయంలో... సంతోష్‌నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్ యాకుత్ పురా నియోజకవర్గంలో ఏసీపీ కార్యాలయంలో బుధవారం



నవతెలంగాణ-2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ సమాజంలోని సమస్యలను వెలికి తీసి ప్రజల ముందు ఉంచడంలో నవ తెలంగాణ దినపత్రిక ముందుంటుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసే వారికి ఎప్పుడు ప్రజల అండదండలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ ఎల్బీనగర్ ఇంచార్జి భరత్ కుమార్, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి



భారత్ జాగృతి జాతీయ అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, భారత్ జాగృతి రంగారెడ్డి జిల్లా విద్యార్థి విభాగం నాయకులు మునుకుంట్ల నవీన్ గౌడ్ బుధవారం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలో జాగృతి ఉపాధ్యక్షులు దాస్యం విజయ్ భాస్కర్, వరలక్ష్మి, భారత్ జాగృతి జిల్లా నాయకులు నరసింహ రాజు, రాజ్ కుమార్, విక్కీ, వైష్ణవ్, బాలకృష్ణ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, కుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - చైతన్యపురి

నవతెలంగాణ - 2024 క్యాలెండర్‌ను ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని తన స్వగృహంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి బుధవారం కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నవతెలంగాణ దినపత్రిక ముందు వరుసలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భరద్వాజ్, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, శ్రీశైలం, పూర్ణ, శశి, శీను, నగేష్, విప్లవ రెడ్డి, రిపోర్టర్ రాజు గుప్త పాల్గొన్నారు.



అయ్యప్ప పడిపూజలో ఎమ్మెల్యే సబితమ్మ



నవతెలంగాణ - మీర్ పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ ఇంద్రావత్ రవి నాయక్ ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి పడిపూజకు బుధవారం మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కార్పొరేటర్ సిద్దాల లావణ్య, ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్, కో ఆప్షన్ సభ్యులు పల్లె జంగయ్య గౌడ్, జటావత్ రవి నాయక్, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జటవాత్ శ్రీనివాస్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఉప్పల



నవతెలంగాణ- నాగోల్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అండర్ 19 బాయ్స్ అండ్ గర్ల్స్ టోర్నమెంట్‌ను భారతదేశ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిందాబి శ్రీకాంత్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చందేశ్వర రావులతో కలిసి బుధవారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వహక అధ్యక్షుడు శ్రీనివాస గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ వికాస్ చీఫ్ కోచ్ బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో చాలామంది బ్యాడ్మింటన్ క్రీడాకారులకు కోచింగ్ ఇస్తూ నేడు ఆల్ ఇండియా లెవెల్‌లో ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసిన వికాస్‌కి ధన్యవాదాలు తెలిపారు. బుధవారం నుండి జనవరి 9 వరకు జరిగే ఆరు రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్ లో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ ఆల్ ది బెస్ట్ కంగ్రాట్యులేషన్స్ చెప్పారు. కిదాంబి శ్రీకాంత్ మాట్లాడుతూ మన రాష్ట్రానికి మన దేశానికి నాలాగా బ్యాడ్మింటన్ లో పేరు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరావు, ట్రెజరర్ బాబు, ఆనంద్, లక్ష్మణ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ట్రెజరర్, కోచ్‌లు, వివిధ రాష్ట్రాల నుండి 900 మంది అండర్ 19 క్రీడాకారులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి ఫూలే



నవతెలంగాణ- సంతోష్‌నగర్

సీపీఐ పార్టీ ఐఎస్‌సదన్ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్ ఆధ్వర్యంలో సింగరేణి కాలనీలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ హైదరాబాద్ సహాయ కార్యదర్శి కామ్రేడ్ కమతం.యాదగిరీ, సీపీఐ సీనియర్ నాయకులు ఆర్.శంకర్ నాయక్‌లు నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజునాయక్, అంజయ్య, సక్రీబాయి, అమీన, దశరత్ నాయక్, పాండు నాయక్, పెరోజ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

నవతెలంగాణ- నాగోల్



సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా జరపాలని తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దవూర బ్రహ్మయ్య అన్నారు. బుధవారం సాయి నగర్ కాలనీ రోడ్ నెంబర్ 4లో సావిత్రిబాయి పూలే జయంతిని తెలంగాణ గాడ్గే రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి స్కూల్ ప్రిన్సిపాల్ అంజనీ దేవి, సూపర్ కిట్ స్కూల్ ప్రిన్సిపాల్ పుష్పలత, సంఘం నాయకులు నాగిళ్ల యాదగిరి వెంకటేష్, జూపల్లి రామకృష్ణ, అబ్బి రవి, పున్నం రాములు, రత్నమ్మ, దివ్యభారతి, మాధవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - నాగోల్



నాగోల్ భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి.చైతన్య సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు డి.రవి, కమిటీ సభ్యులు టి.బాలస్వామి, ఎల్ శంకర్, కే చంద్రయ్య, వి. సైదులు, డి వెంకటేష్, ఎల్లయ్య, వెంకటయ్య, రామస్వామి, బాలు, వెంకటేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - మీర్‌పేట్



మహిళలకు చదువు నేర్పిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని కేవీపీఎస్ బాలాపూర్ మండల అధ్యక్షుడు దాసరి బాబు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం మీర్‌పేట్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

మండలంలోని పలు గ్రామాల్లో, పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్ర బోస్ నగర్ కాలనీలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ ప్రచారం కార్యదర్శి జయన్న ఆధ్వర్యంలో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

నవతెలంగాణ - ఎల్బీనగర్

సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్ర బోయిన శ్రీనివాస్ రావు ఘనంగా నిర్వహించారు. తర్వాత ఆమె



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నవతెలంగాణ -ఎల్బీనగర్

సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బేరా బాలకిషన్(బాలన్న), బీసీ సంఘాల నేతలు ఘనంగా నిర్వహించారు.



సరూర్ నగర్ పట్టణ పరిధిలోని జింకల బావి కాలనీ చౌరస్తాలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆకుల అరవింద్ కుమార్, బబ్బురి ఆనంద్ గౌడ్, నోముల కబీర్దాస్ గౌడ్, యాంద్రా లోకేష్, యాంద్రా కల్పన, చిత్తలూరి వెంకటేశ్వర్లు సిలివేరు వెంకట్ గౌడ్, కేష్ గౌడ్ నేతలు పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా పాలన



- డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్

నవతెలంగాణ- బడంగ్‌పేట్

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్ తెలిపారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 6, 7 డివిజన్ల కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుమన్ రావు, డి.ఈ.జ్యోతి, శానిటేషన్ అధికారి యాదగిరి, వివిధ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ - సంతోష్ నగర్

విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్రెడ్డి బుధవారం డీఈఈ హనుమంత్ రెడ్డి, ఏఈ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో అవసరమైన చోట బంచ్ కేబుల్స్ ఏర్పాటు చేయాలని, ప్రమాదకరంగా ఉన్న ఐరన్ బాక్స్ మీటర్లను తొలగించాలన్నారు. ఉపయోగంలోలేని సిమెంట్ పోల్స్‌ను తొలగించాలన్నారు. జయానగర్లో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. వీధి దీపాల సమస్యలు పరిష్కరించాలని, తప్పు పట్టి ప్రమాదకరంగా మారిన పోల్స్ స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని అధికారులను కార్పొరేటర్ కోరారు.

చిల్డ్రన్స్ పార్కులో పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ - చైతన్యపురి

చైతన్యపురి డివిజన్ సాయినగర్‌లోని చిల్డ్రన్స్ పార్కులో చేపట్టిన నిర్మాణ పనులకు బుధవారం కార్పొరేటర్ రంగ నరసింహ గుప్తా కాలనీవాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. అనంతరం స్వర్గీయ రామోజీ షణ్ముకన్నా కుటుంబాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డితో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రుద్రారపు శంకర్, వినోద్ యాదవ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమేష్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు వల్లూరి రమేష్ జన్మదిన వేడుకలను బుధవారం ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని పార్టీ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో సీనియర్ నాయకులు కొండ్ర శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, డివిజన్ కార్యనిర్వాహక అధ్యక్షులు కంచర్ల శేఖర్ పాల్గొన్నారు.

సాంకేతిక పదాలను బోధనాయోగ్యంగా మార్చుకోవాలి

• ఉస్మానియా వీసీ ఆచార్య రవీందర్



నవతెలంగాణ - ధూల్ పేట్

భారతీయ రాజ్యాంగంలోని సంక్లిష్టమైన పారిభాషిక పదాలను, వాటి భావాలను విద్యార్థుల అవగాహనా సౌలభ్యం కోసం పునర్విచించవలసిన అవసరం ఉందని, ఆ దిశగా ఈ సదస్సు ఉపయోగపడుతుందని ఉస్మానియా వీసీ ఆచార్య రవీందర్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలోని రాజనీతి శాస్త్ర విభాగం, కమీషన్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ, ఢిల్లీ సంయుక్తంగా జనవరి 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాశ్చాత్య భాషల దృష్టి కోణంలో నుండి రాజ్యాంగంలో పొందుపరచబడిన 4000 సాంకేతిక పదాలను దేశీయ కోణంలో నుండి బోధనా యోగ్యంగా మార్చుకోవాలన్నారు. విజ్ఞాన శాస్త్రాల (సైన్స్) నేపథ్యంలో నుండి వచ్చిన విద్యార్థులు కూడా రాజ్యాంగ విలువలను అర్థం చేసుకొనే విధంగా రాజనీతి శాస్త్రాన్ని రూపొందించుకోవాలని సూచించారు. అంతర్జాతీయ విజ్ఞానాన్ని స్థానిక భాషల్లోకి అందుబాటులోకి తీసుకురావాలని, రాజ్యాంగ పీఠికలోని సామాజికన్యాయం, లౌకిక, ప్రజాస్వామ్య, సామ్యవాద మొదలగు గంభీరమైన పారిభాషిక పదాలకు అర్థవంతమైన సూత్రీకరణలను, వ్యాఖ్యానాలను స్థిరపరిస్తే విద్యావిషయక ప్రయోజనం కలుగుతుందని అన్నారు. అత్యవసరమైన విషయంపై సదస్సు నిర్వహిస్తున్నందుకు కళాశాల ప్రిన్సిపాల్, సమన్వయకర్త డా.కె.భాస్కర్ ని, ఇతరులను అభినందించారు. ఆచార్య ఇ. వెంకటేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని నైతికతను, రాజ్యాంగ మౌలిక తత్వాన్ని గ్రామీణ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరముందన్నారు. ఎత్నిక్ డేమొక్రసి ఇన్ లిబరలిజం లాంటి కొత్త పదాలకున్న ప్రాసంగికతను అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అధ్యక్షత వహించిన ఈ సభలో కమీషన్ ఉపసంచాలకులు డాక్టర్.షహజాద్, వివిధ కళాశాలల నుండి రాజనీతిశాస్త్ర ఆచార్యులు, డాక్టర్.అయిజాజ్ సుల్తానా, డాక్టర్.విప్లవ్ దత్ శుక్లా, డాక్టర్.తిరుపతి, డాక్టర్.శంకర్, డాక్టర్.పావని, డాక్టర్.కృష్ణవేణి, డాక్టర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒడిశా టూ హైదరాబాద్‌కు గంజాయి తరలింపు

• 31.34 కిలోల గంజాయి పట్టివేత

• నలుగురి అరెస్ట్

నవతెలంగాణ- సంతోష్ నగర్

ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్న గంజాయిని టాస్క్ ఫోర్స్, కంచనాబాగ్ పోలీసులు పట్టుకున్నారు. కంచనాబాగ్ పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డితో కలిసి సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జి. మనోహర్ వివరాలు వెల్లడించారు. కంచనాబాగ్ పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఫిసల్బండ ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఓ కారులో రూ.3.10లక్షల విలువైన 31.34కిలోల (15ప్యాకెట్లు) గంజాయిని పట్టుకున్నారు. అందులో ప్రయాణిస్తున్న మైలార్దేవ్‌పల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి అబ్దుల్ ఫైసల్, ఆసీఫ్ నగర్‌కు చెందిన కారు డ్రైవర్ ఎండీ సమీయోద్దీన్, శాస్త్రీపురానికి చెందిన ఎలక్ట్రీషన్ మహ్మద్ హమీర్, క్యాట రింగ్ ఈవెంట్ మేనేజర్ పని చేస్తున్న హుస్నా ఫాతిమా అలియాస్ సాజిదా తబుసంలను పోలీసులు అదులోకి తీసుకొని విచారించారు. ఒడిశాకు చెందిన రితీష్కు రూ.56వేలకు గంజాయిని కొనుగోలు చేసినట్లు విచారణలో వారు తెలిపారు. ఒడిశా నుంచి అరుకు మీదుగా హైదరాబాదుకు గంజాయిని తరలిస్తున్నట్లు ఆడిషనల్ డీసీపీ తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు, నలుగురిని రిమాండ్‌కు తరలించారు. 5వ నిందితుడు రితీష్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. నిందితుల నుంచి 4 సెల్‌ఫోన్స్‌ను స్వాధీనం చేసుకుని, గంజాయిని సీజ్ చేశారు. ఈ సమావేశంలో టాస్కోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదాబాబు, కంచన్ బాగ్ ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్రెడ్డి, ఎస్ఐలు లింగరాజు, పద్మయ్య, హిమారెడ్డి, అనంతచారి, సాయిరాం, రాఘవేంద్రర రెడీ, డీసీపీ బి.రోహిత్ రాజు, టాస్క్ ఫోర్స్ డీసీపీ శ్రీబాల పాల్గొన్నారు



సరూర్‌నగర్ పట్టణంలోని క్రీస్తు సంఘం చర్చిలో నూతన సంవత్సరం 2024 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో సమాజ సేవకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌లు పాల్గొని కేక్ కట్ చేశారు.

నవతెలంగాణ - ఎల్బీనగర్

సింగరేణి ఏఐటీయూసీ నాయకులకు శుభాకాంక్షలు



నవతెలంగాణ- నాగోల్

ఇటీవల సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్యలకు బుధవారం హిమాయత్ నగర్ హైదరాబాద్ మక్దూమ్ భవన్‌లో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ 103 సంవత్సరాల నుండి ఏఐటీయూసీ కార్మికులకు ఎంతో సేవ చేస్తుందని గుర్తుచేశారు. ఏఐటీయూసీ వేజ్ బోర్డ్ సాధన, లాభాల వాటా, దీపావళి బోనస్ లాంటి ఎన్నో హక్కులు సాధించిందని వివరించారు. నేటి విజయం చారిత్రాత్మకమైనదని, సింగరేణిలో అవినీతి, రాజకీయ జోక్యాన్ని తుద ముట్టించాలని, ప్రమోషన్లు, సొంత ఇంటి పథకం, మైనింగ్, ట్రేడ్స్ మెన్స్ ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం తెలంగాణలోని ముఖ్య నగరాల్లో నెల వారి మందుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, సంయుక్త కార్యదర్శి సామంతుల నర్సింగ్ రావ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గీస కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన శ్రీకాంత్ యాదవ్



నవతెలంగాణ-జవహర్ నగర్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని జవహరనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంతాయాదవ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజాపాలన ఎలా సాగుతుందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజుయాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన రవీందర్ గౌడ్



నవతెలంగాణ-శామీర్‌పేట

నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ నాయకులు నూనెముంతల రవీంద్ర గౌడ్, శేఖర్ చారి, మేడ్చల్ రూరల్ మండలాల యువజన నాయకుడు నీరజ్ గౌడ్, యువజన నాయకులు అర్జున్, అజయ్ కుమార్, సత్యనారాయణ గౌడ్, వెంకటేష్ బుధవారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే బండారికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి నియోజకవర్గానికి చెందిన పలువురు అధికారులు, నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సైనిక్‌పూరిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి పూల బొకెల బదులు నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసే నాయకులకు ప్రజలు మద్దతు తెలిపి గెలించారని తెలిపారు. తనపై ప్రజల ప్రేమ, అభిమానాలు ఎప్పుడూ ఎలాగే ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

తిరుమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

మీర్‌పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలానగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలు ఆవిష్కరించారు. అనంతరం తిరుమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీ అభివృద్ధికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.మల్లేష్ గౌడ్, సెక్రటరీ అమరేంద్రబాబు, ముత్యం వెంకన్న గౌడ్, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, దాస్, రాజు, రఫీక్, జైపాల్ నాయుడు, మురళీకృష్ణ, శశికళ, బీఆర్ఎస్ నాయకులు శేఖర్ గౌడ్, నిస్సార్, అహ్మద్ ఘోరి పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్, బాక్స్ డ్రైన్ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ నోమా కల్యాణ మండపం నుంచి రైల్వే ట్రాక్ వరకు బాక్స్ డ్రైన్ వెడల్పు పనుల కోసం రైల్వే అధికారుల వినతి మేరకు ఆ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, జోనల్ కమిషనర్ పంకజం, స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్‌లు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రభుదాస్ రోనాల్డ్ రాస్ బృందాన్ని మల్లాపూర్ బండబావి ప్రాంతంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ విషయంలో సహకారం అందించాలని కోరారు. మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు సంబంధించిన లెటర్స్‌ను జోనల్ కమిషనర్‌కు అందించామని తెలిపారు. మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు సహకరిస్తే స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, సీఈ ప్రాజెక్ట్ దేవానంద్, ఎస్ఈ ప్రాజెక్ట్ రమేష్, ఎస్ఈ మెయింటెనెన్స్ అశోక్ రెడ్డి, ఈఈ ప్రాజెక్ట్, ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారికి శుభాకాంక్షలు తెలిపిన లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. అనంతరం కాలనీ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రామ్మోహన్ రావు, ఉపాధ్యక్షులు కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి కోటిరెడ్డి, కోశాధికారి జి. రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శులు మూర్తి, ప్రచార కార్యదర్శి బి. శ్రీనివాస్‌రెడ్డి, యాదవ రెడ్డి, కార్యవర్గసభ్యులు, స్థానిక నాయకులు కామేశ్వర్‌రావు, రాజేశ్వర రావు, సుబ్బారెడ్డి, వెంకట్ రెడ్డి, శేఖర్ గౌడ్, నిస్సార్, అహ్మద్ ఘోరి పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం : వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-కీసర

పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. కీసర మండల కేంద్రంతో పాటు చీర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డితో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సంధర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ స్కీంలను ప్రవేశపెట్టిందన్నారు. పేదల శ్రేయస్సు, సంక్షేమం కోసం అభయ హస్తం పథకం ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కీసర మండల వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, కీసర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణ యాదవ్ , కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మణ్ శర్మ ,కీసర గ్రామ అధ్యక్షుడు జూపల్లి రవీందర్ పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి ఫూలే జయంతి

- ఫూలే చిత్ర పటానికి నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థి, , యువజన సంఘాల నేతలు



కాప్రా..తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కాప్రా

దేశంలోనే తొలి ఉపాధ్యాయులురాలు సావిత్రిబాయి ఫూలే 193వ జయంతిని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'సామాజిక ఉద్యమం..కర్తవ్యాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సామాజిక ఉద్యమ నాయకురాలు శారద, పాషా సావిత్రిబాయి ఫూలే చిత్రపటానికి పూలమాలలను వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు మనం సంపాదకులు షేక్ షావలి మాట్లాడుతూ.. జ్యోతిరావు ఫూలే సతీమణి సావిత్రిబాయి ఫూలే 190 ఏండ్ల క్రితమే అణగారిన వర్గాల వారికి చదువు చెప్పారని గుర్తు చేశారు. సమాజ పురోభివృద్ధికి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. 1831 జనవరి మూడో తేదీన జన్మించిన సావిత్రిబాయి ఆమె భర్త సహకారంతో చదువు నేర్చుకోవడమే కాక పాఠశాలలను నెలకొల్పి విద్య బోధన చేసిందన్నారు. ఆ తర్వాత వితంతు పునర్ వివాహాల కోసం కృషి చేశారని చెప్పారు. కేకే ప్రసాద్ బాబు మాట్లాడుతూ ..ఫూలే దంపతుల పోరాటానికి వ్యతిరేకంగా సనాతన మనువాదులు ఎన్నో కుట్రలు జరిగినా ఎదురొడ్డి నిలబడ్డారని తెలిపారు. ఆనాడు వారికి ఓ ముస్లిం కుటుంబం అండగా నిలబడి అక్కడ విద్యాలయం ఏర్పాటుకు సహకరించిందన్నారు. సావిత్రిబాయి పూలేకు సహచరిగా ఫాతిమా షేక్ ముందుకు వచ్చి ఇద్దరూ అనేక విద్యాసంస్థలు నిర్మించారని పేర్కొన్నారు. ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవలు చేసిన ఫలితం తను కూడా ప్లేగు వ్యాధికి గురై మరణించారని అన్నారు. కోమటి రవి , జ్ఞానమాల టీం నాయకులు గగన్ కుమార్, భారత నాస్తిక సమాజం నాయకులు రషీద్ ద్రవిడ, షేక్ షావలి, శారద, ఐద్వా జిల్లా కార్యదర్శి వినోద, ధనలక్ష్మి, సురేష్ బాబు గొడుగు యాదగిరి రావు తదితరులు ప్రసంగించారు. అనంతరం సభికులందరూ సావిత్రిబాయి ఫైలే చిత్రపటానికి పూలను అర్పించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు శివ నారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, ఆర్.ఎస్. ఆర్. ప్రసాద్, వెంకటేశ్వం రావు, అంజలి, గోవిందరావు, పాష, జయప్రకాష్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

సావిత్రిబాయిఫూలే జయంతిని గాంధీనగర్ యూత్ అసోసియేషన్ సహాయక కార్యదర్శులు జి. హరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడతూ.. సావిత్రిబాయి ఫూలే తన భర్త జోతిరావుఫూలేతో కలిసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను స్థాపించిదన్నారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేసిందని పేర్కొన్నారు. ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిందన్నారు. అనంతరం కార్యాక్రమానికి హాజరైన నాయయులు ఫూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లోక్ సత్తా నాయకులు శివరాంకృష్ణ, గాంధీనగర్ యూత్ అధ్యక్షులు జి సత్యనారాయణ, రాకేష్, కార్తీక్, ధన్‌రాజ్, సిద్దూ, సాయి, అజయ్, భాస్కర్, మల్లేష్, కానిస్టేబుల్ సుమతి , జీహెచ్‌ఎంసీ సిబ్బంది వినయ్ (వర్క్ ఇన్‌స్పెక్టర్), మంజుల, దశరథ్, బాల్‌రాం, సుదర్శన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణీయ భావజాలాన్ని ధిక్కరించిన సాయిత్రి

సాయిత్రిబాయి పూలే బ్రాహ్మణీయ భావజాలాన్ని ధిక్కరించిన క్రాంతికారి అని అఖిల భారత యువజన సమాఖ్య మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ అన్నారు. సావిత్రిభాయి పూలే 193వ జయంతిని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టి. సత్యప్రసాద్ మాట్లాడుతూ.. భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా పేరు గడించారన్నారు. ఆమె 1831 జనవరి 3వ తేదీన మహారాష్ట్రలోని సతారా గ్రామంలో జన్మించారన్నారు. జ్యోతిరావు పూలేను వివాహం చేసుకొని ఆయన సహకారంతో చదువుకొని ఎంతో మంది మహిళలకు చదువు నేర్పిన ఘనత ఆమెకు దక్కిందన్నారు. బాల్య వివాహాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశారన్నారు. మగవారికి మాత్రమే చదువుకునే పరిస్థితులలో నుంచి ఆడవారు కూడా చదువుకునే స్థితికి తీసుకొచ్చిన మహా గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ఆమె జన్మదినాన్ని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భరత్, రవి, విజయ్, కిరణ్, నర్సింహా, మధురిమ, కీర్తన్, రవళి, సరిత తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి జీవితం ఆదర్శం : ప్రిన్సిపాల్ ఇస్రత్

శామీర్‌పేటలో..

నిమ్న జాతుల మహిళలలు విద్యావంతులు కావాలనే ఉక్కు సంకల్పంతో సావిత్రిబాయిపూలే ఎంతో పోరాటం చేసి చరిత్రలో నిలిచారాని, ఆమె జీవితం అందరికీ ఆదర్శం అని సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇస్రత్ అన్నారు. శామీర్ పేట మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయిపూలే చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేటలోని తెలంగాణ సాంఘీక గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు



కాప్రా..గాంధీనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయివిత్రి బాయి పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు



కాప్రా..ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా వీజేఐటీ సిల్వర్ జూబ్లీ వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యారంగంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని 25 ఏండ్ల మైలు రాయి సాధించిన విద్యాజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎంతో మందికి విశేషమైన విద్యను అందించినందుకు గుర్తుగా సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకుంది. బుధవారం వీజేఐటీ అజీజ్‌నగర్ క్యాంపస్‌లో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి, మాజీ ప్రిన్సిపాల్ కాలేజీ ఆవరణలో చెట్లు నాటడంతో సిల్వర్ జూబ్లీ వేడుకలు ప్రారంభించారు. వీజేఐటీ అభివృద్ధికి కృషి చేసిన మొట్టమొదటి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామారెడ్డి, ప్రొఫెసర్ పి.రామ్‌రెడ్డి, డాక్టర్ పి.వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ ఎ.పద్మజ, ప్రొఫెసర్ ఎస్.ఎం.జాఫరుల్లా, ప్రొఫెసర్ జి.రాధాకష్ణ, ప్రొఫెసర్ ఎన్.ఎల్.వి.ప్రసాదరావు, డా.బి.వి.రెడ్డిలను సత్కరించారు. ఈ సందర్భంగా కాలేజీ వ్యవస్థాపకులు, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సిల్వర్ జూబ్లీ వేడుకలకు హాజరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సమిష్టి కృషికి మొత్తం వీజేఐటీ టీమ్‌ను అభినందించారు. భవిష్యత్‌లో వారి విజయాన్ని కొనసాగించడానికి తన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వివిధ విభాగాల్లో శ్రేయోభిలాషులు, మాజీ నిర్వాహకులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రముఖ యజమానులు, అత్యుత్తమ విద్యార్థులను గుర్తించి అవార్డులను అందజేశారు.

మంత్రి మల్లారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు





నవతెలంగాణ- మేడ్చల్

మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలను మేడ్చల్ మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్లు కొడే మహేష్ కురుమ, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, నడికొప్పు నాగరాజు ముదిరాజ్, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌లు బుధవారం వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పార్కు స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నరేష్

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రావల్ కోల్ గ్రామంలోని జీపీఆర్ సెక్టర్3లోని పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నరేష్, తహశీల్దార్ శైలజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొందరు ప్రయివేట్ వ్యక్తులు పార్కు స్థలాన్ని కబ్జా చేసి ఇతరులకు యథేచ్ఛగా విక్రయిస్తున్నా గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకొని పార్కు స్థలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు ఎక్కాలదేవి కొమరయ్య, రమేష్, నాయకులు నర్సింగ్ రావ్, నర్సింహా, బిర్లా శేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కమిటీలో పని చేయుటకు

స్వచ్ఛంద సంస్థలను ఆహ్వానం

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి టి.రఘునాథస్వామి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో భ్రూణ హత్యల నియంత్రణ చట్టం కోసం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సలహా కమిటీలో జిల్లాలోని గర్భస్థ లింగ నిర్ధార పరీక్షా కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సలహాలు, సూచనలు ఇవ్వడానికి, జిల్లా కమిటీలో పని చేయడానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల సభ్యుల నుంచి చేర్చుకోవడానికి ఆసక్తి గల సంస్థల సభ్యుల నుంచి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆహ్వానిస్తున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ టి.రఘునాథస్వామి ఒక ప్రటనలో తెలిపారు. ఆసిక్తి గల స్వచ్ఛంద సంస్థలు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలకు కలెక్టరే ట్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలోని డెమో సెక్షన్‌లో సంప్రదించాలని కోరారు. స్వచ్ఛంద సంస్థ రిజిస్ట్రేషన్, పూర్తి ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం, ఏమైనా సందేహాలు ఉంటే డిప్యూటీ డెమో వి.అంజయ్య (9490138813)ని సంప్రదించాలని కోరారు.

మెట్రో రైలును ఉప్పల్ నుంచి యాదాద్రి వరకు విస్తరించాలి

- ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి



నవతెలంగాణ-ఘట్కేసర్

మెట్రో రైలును ఉప్పల్ నుంచి ఘట్కేసర్, యాదాద్రి వరకు విస్తరించాలని ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ ఈస్ట్‌గా పిలవబడే ఉప్పల్, బోడుప్పల్, పీర్జాదిగూడ, చెంగిచెర్ల, చర్లపల్లి, నారపల్లి, పోచారం, ఘట్కేసర్ ప్రాంతాలు ఐ.టీ హబ్‌గా ఇన్ఫోసిస్ సాఫ్ట్ వేర్ ఇతర కంపెనీలలో దాదాపుగా 25 వేల మంది ఉద్యోగాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి మల్లారెడ్డి వివక్ష చూపడంతో అభివృద్ధి చెందలేదని తెలిపారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ, యాదాద్రి-భువనగిరి, ప్రాంతాల నుంచి ప్రజలు ఉద్యోగ, ఉపాధి కొరకు పట్నానికి వలస వచ్చి స్థిరపడ్డారని తెలిపారు. జనాభా అధికం కావడంతో ఉప్పల్ నుంచి అవుటర్ రింగ్ రోడ్డు దాటి ఘట్కేసర్ వరకు రోడ్లపై విపరీతమైన రద్దీ ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉప్పల్ నుంచి నారపల్లి నేషనల్ హైవే అథారిటీ చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ పనులు సీపీఆర్ఏ నుంచి అన్నోజిగూడ వరకు జరుగుతున్నాయని తెలిపారు. ఏండ్ల తరబడి ఈ దారిలో ప్రతి నిత్యం ఏదో ఒకచోట వాహన ప్రమాదాలు జరిగి సామాన్య ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉప్పల్ నుంచి ఘట్కేసర్ యాదాద్రి వరకు మెట్రో రైల్ మార్గాన్ని విస్తరించి ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని లేఖలో పేర్కొన్నారు.

శబరిమల యాత్రకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రావల్ కోల్ గ్రామ అయ్యప్ప స్వాములు బుధవారం గ్రామంలోని శివాలయం నుంచి శబరిమల యాత్రకు తరలి వెళ్లారు. అంతకుముందు శివాలయంలోని సన్నిదానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడిలు కట్టుకొని బయలుదేరి వెళ్లారు. స్వాముల కుటుంబ సభ్యులకు ఆయలం కిటకిటలాడింది. వెళ్లిన వారిలో శ్రీనివాస్ యాదవ్, రాహుల్ యాదవ్, మాధవ చారి, చుక్క బాబు, నవీన్, గోపి యాదవ, నవీన్ రెడ్డి, గోపి యాదవ్, నవీన్ రెడ్డి, శేషి, రాజు, ఆశిష్, అక్షయ్, సిద్దు, సాయి, మోహన్ ఉన్నారు.

ఎంపీ రంజిత్ రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డికి, కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, బుధవారం రంజిత్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కూకట్‌పల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి మొగుళ్ల కనకా రెడ్డి, బస్తీ నేతలు శరత్ రెడ్డి, రాము గౌడ్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ నగర్ కాలనీని పరిశీలించిన మర్రి



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని 140 డివిజన్ భగత్ సింగ్ నగర్‌లో ఆర్‌కె పురం చెరువు పక్కన ఉన్న కాలనీ ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కాలనీ వాసులు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుంచి మాకు రోడ్డు లేక చాలా అవస్థలు పడుతున్నామని, కాలనీవాసులు విన్నవించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోని నాయకులు మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సతీష్ సాయినాథ్ పాల్గొన్నారు.

డ్రయినేజీని పరిశీలించిన ఎమ్మెల్యే మర్రి



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని 140 డివిజన్‌లోని బలరాం నగర్‌లో డ్రయినేజీ వ్యవస్థను బుధవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. అనంతరం కాలనీ వాసులు మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ఒకసారి బ్లాక్ కావడం గల్పర్ మిషన్ వచ్చి క్లియర్ చేయడం మామూలుగా అయిపోయిందన్నారు. గత ఏడు సంవత్సరాలుగా ఎన్ని విధాలుగా మొరపెట్టుకున్న డ్రయినేజీ లైన్‌ల కొరకు తవ్విన రోడ్డు వేయలేదని తెలిపారు. కనీసం నీళ్ల కూడా పోయే సౌకర్యం లేక రోడ్డు నిత్యం కాలువలను తలపిస్తుందని, గతంలో హెచ్చరించినట్లుగానే డ్రయినేజీ లైన్లు మొత్తం బ్లాక్ అయ్యే ట్రీట్మెంట్ ప్లాంటు నీరు పోకుండా ఆగిపోయింది. సంవత్సరం క్రితం తాత్కాలికంగా అని చెబుతూ డ్రయినేజీ లేని చెరువులో కలిపారు. దాదాపు 3 వంతుల కాలనీ డ్రయినేజీ నీరు చెరువులోకి వదలడం వల్ల మా లైన్లో బోర్లు మొత్తం కలుషితమైన నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలుష్యం ఇంతటితో ఆగకుండా పక్క లైన్లకు కూడా వ్యాపించి మొత్తం కాలనీలో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వ్యవస్థను మెరుగుపరిచి ట్రీట్మెంట్ ప్లాంట్ల వరకు లైన్లో సరి చేయవలసిందిగా కాలనీ వాసులు కోరారు. అలాగే ఎన్నో సంవత్సరాలుగా సరైన రోడ్డు లేక అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు తెలిపారు.

మాజీ మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ/కూకట్‌పల్లి

నూతన సంవత్సరం సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లతో కలిసి బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎలక్షన్లకు సన్నద్ధం కావాలని దిశా నిర్దేశం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, పగుడాల శిరీష బాబురావు, సబియా గౌసుద్దిన్, మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామ జన్మభూమి అక్షింతలు పంపిణీ



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అయోధ్య శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్రం ట్రస్ట్ ఆదేశానుసారం కేపీహెచ్‌బీ కాలనీ శ్రీ వెంకటేశ్వర బస్తీ ఆధ్వర్యంలో బుధవారం కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లో అక్షింతలను పంపిణీ చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ మూడో ఫేసు ఎల్ఐసీ ఫ్లాట్స్ ఒకటో నెంబర్ దగ్గర నుంచి 46 నెంబర్ వరకు ప్రతి ఇంటికి తిరిగి అక్షింతల వితరణ చేశారు. అయోధ్యలో భగవాన్ శ్రీ రాముడి భవ్య మందిర నిర్మాణానికి సమస్త సమాజం నుంచి సాత్విక భావనతో విరాళాల సేకరణలో భాగంగా 2021న నిధుల సేకరణలో భాగంగా కులమతాలకు అతీతంగా విరాళాల సేకరన చేశామన్నారు. దాంట్లో భాగంగా కేపీహెచ్‌బీ కాలనీలో హిందూ సోదరుడు కొల్లా శంకర్, ముస్లిం సోదరుడు షేక్ సత్తార్, క్రిస్టియన్ సోదరులు వినోద్ కుమార్, హెన్రీల నుంచి నిధులు సేకరణ చేపట్టారు. ఇప్పుడు ట్రస్ట్ ఆదేశానుసారం అక్షింతల వితరణ సందర్భంగా ముందుగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సోదరులకు అక్షింతలు ఇచ్చి వారిని శాలువాతో సన్మానించి అక్షింతల వితరణ కార్యక్రమమును ప్రారంభించారు. ప్రజలు ఎంతో ఆనందంతో అక్షింతల ను తీసుకుంటూ ఇంతటి మహాభాగ్యాన్ని అందించిన ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మాకు ఇంటికి తీసు కొచ్చి ఇవ్వటం మహాద్భుతం అని, ప్రజలు చాలా సంతోషాన్ని వ్యక్తపరిచారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ప్రజాపాలన కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పనిచేసి, ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ తెలిపారు. బుధవారం బాలానగర్, ఫతేనగర్ డివిజన్ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఫతేనగర్‌లో స్థానిక నాయకులు సమస్యలపై వివరించారు. ఇంజినీరింగ్ అధికారి వ్యవహార శైలి బాగోలేదని కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఏఈ పవన్ కుమార్ పై అయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు తీర్చడానికి పార్టీలకు అతీతంగా అధికారులు పనిచేయాలి తప్ప ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి కాదని దుయ్యబట్టారు. ఫతేనగర్‌లో దరఖాస్తులు ఇప్పటివరకు ప్రజల నుంచి ఎన్ని వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుక్కల రమేష్, పుష్పా రెడ్డి, సతీష్ రెడ్డి, కొప్పి శెట్టి దినేష్ కుమార్, గూడెపు నాగరాజు, బాకీ, సునీల్ యాదవ్, సలీం, తదితరులు పాల్గొన్నారు.



పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 125 డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మేడ్చల్ జిల్లా ప్రభుత్వ న్యాయవాది కమలాకర్ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమక్షంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రావుల శేషగిరి, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ జి. సురేష్ రెడ్డి, కొంపల్లి మున్సిపల్ వైస్ చైర్మెన్ గంగయ్య నాయక్, నిజాంపేట్ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, దుండిగల్ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-బాలానగర్

అనారోగ్యంతో ఉన్న స్నేహితుడిని చూసి వస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం రామిరెడ్డి నగర్‌లో నివాసముంటున్న నవదీప్ కోవిడ్ సమయంలో జాబ్ కోల్పోయాడు. అప్పటి నుండి ఇంట్లోనే ఉంటున్నాడు. గత నెల 22న తెల్లవారుజాము సమయంలో స్నేహితుడి తండ్రి అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నాడని చూసి వస్తానని భార్యతో చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. భార్య బంధువులను స్నేహితులను చుట్టుపక్కల వారిని ఆశ్రయించగా ఎటువంటి ఆచూకీ లభించక పోవడంతో బాలానగర్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు బాలానగర్ పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నెహ్రూ నగర్‌లో జలమండలి జీఎం పర్యటన

నవతెలంగాణ-మల్కాజిగిరి

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలో నీటి సమస్యను మెరుగుపరచాలని బుధవారం జలమండలి జీఎం సునీల్ కుమార్‌ను, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ కోరారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్‌లో ఎత్తు ప్రాంతంలో ఉన్న ఇండ్లకు గతంలో మంచినీటి కనెక్షన్లు ఇచ్చారన్నారు. కానీ నీటి సరఫరా చేయలేదన్నారు. అయినప్పటికీ నీటి బిల్లులు వచ్చాయని వాటిని రద్దుచేసి బూస్టర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు . అలాగే డివిజన్ పరిధిలో ఉన్న పవర్ బోర్లకు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని తెలిపారు. సానుకూలంగా స్పందించిన జీఎం సునీల్ కుమార్ సమస్య పరిష్కారానికి చొరవ చూపుతానని కార్పొరేటర్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మేకల రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డి నగర్ డివిజన్, పరిధిలోని ఏ.పి.హెచ్.బి. కాలనీలో గల జలమండలి ప్రధాన కార్యాలయంలో (2024) నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జలమండలి జీ.ఎం. శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డీ.జీ.ఎం. రాజేష్, మేనేజర్లు, జలమండలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన 'మైనంపల్లి'



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రాష్ట్ర ముఖ్య మంత్రి ఏ.రేవంత్ రెడ్డిని బుధవారం మల్కాజిగిరి మాజీ శాసనసభ్యుడు మైనంపల్లి హన్మంత రావు బుధవారం తన నివాసంలో కలిసి, పూలబొకేతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ...2024 కొత్త ఏడాదిలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకు పోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలందరూ సుఖ, సంతోషాలతో, ఆయురా రోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజలకు అభివృద్ధి, సంక్షేమంతో కూడిన పాలన అంద చేసిందన్నారు. ఇదే విధంగా భవిష్యత్తులో కూడా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలం గాణ ప్రజలకు మంచి పాలన అందుతుందన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుందని మైనంపల్లి తెలిపారు.

వాజ్ పేయ్ నగర్‌లో మర్రి పర్యటన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక నగర్ డివిజన్ పరిధిలోని వాజ్ పేయ్ నగర్‌లో బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, అధికారులతో కలిసి పర్యటించారు. ఇక్కడ రైల్వే ట్రాక్ వద్ద నెలకున్న డ్రయినేజీ, విద్యుత్ లైన్ సమస్యలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు, తమ బస్తీలో డ్రయినేజీ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. వర్షాకాలంలో నాలాలో వ్యర్థ పదార్థాలు ఇరుక్కు పోయి, డ్రయినేజీ నీరు రోడ్డు పై ప్రవహిస్తుంటుందని వారు తెలిపారు. అలాగే ఎలక్ట్రికల్ వైరు 33 కెవి లైన్, రోడ్డు పైనే ఉండటంతో చాలా ప్రమాదకరంగా మారిందని చెప్పారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జల మండలి జీఎం సునిల్ కుమార్, డీజీఎం భాస్కర్, జీహెచ్ఎంసీ ఇఈ.లక్ష్మణ్, ఎలక్ట్రికల్ ఏడీఈ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘం నూతన సంవత్సర (2024) క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

శెట్టిబలిజ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ (2024) ఆవిష్కరణ కార్యక్రమం నగరంలోని ట్యాంక్ బాండ్‌లో గల వై.ఎఫ్.సి.ఏ. ప్రధాన కార్యాలయంలో(శెట్టి బలిజ భవన్)వై.ఎఫ్.సి.ఏ. జంట నగరాల అధ్యక్ష, కార్యదర్శులు దంపనబోయిన శ్రీనివాస్, చెల్లుబోయిన ప్రసాద్‌ల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. శెట్టిబలిజ సంఘ పెద్దలు, సలహాదారు లు, ప్రముఖ పారిశ్రామికవేత్త, వి.వి.ఈ. ట్రాన్స్ఫార్మర్స్ అధినేత కీర్తిశేషులు ఇళ్ళ నారాయణరావు కుమారుడు ఇళ్ల వినోద్ చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జంట నగరాలలోని వివిధ ప్రాంతాల నుండి శెట్టిబలిజ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు.

ఓల్డ్ బోయిన్‌పల్లిలో 568 కిలోల క్లోరోహైడ్రేట్ పట్టివేత



నవతెలంగాణ-బాలానగర్

కల్తీ కల్లు తయారీలో వినియోగించే క్లోరోహైడ్రేట్‌ను బోయిన్‌పల్లి నుంచి బాలానగర్‌కు తరలిస్తుండగా ఎస్టీఎఫ్ సిబ్బంది వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో కల్లులో కలిపే మత్తు పదార్థాలను రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు నిందితుడి వద్ద నుంచి 28 బ్యాగులల్లో సుమారు 568 కిలోల క్లోరోహైడ్రేట్ అనే మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బాలానగర్ ఎక్సైజ్ సూపరిండెంట్ విజయ్ భాస్కర్ తెలిపారు. బోయిన్‌పల్లి నుంచి బాలానగర్‌కు వస్తున్న క్రమంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో ఈ మత్తు పదార్థాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని రాజు భాయ్ అనే వ్యక్తి వద్ద నుంచి వాటిని తీసుకుని వస్తుండగా రాముగౌడ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. నిందితుడి పైన కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుడు తెలిపిన వివరాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారికోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ మాధవయ్య, సిఐ వేణు కుమార్ పాల్గొన్నారు.

త్వరలో ముసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జిను అందుబాటులోకి తేవాలీ

- పలు అభివృద్ధి పనులను పరిశీలించిన
- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మూసీ నదిపై రూ.52 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ముసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో జరుగుతున్న పలు అభివద్ధి పనులను బుధవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ముందుగా చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి ఎఫ్.సీ.ఐ గోడౌన్ వరకు చేపట్టనున్న ఫార్మేషన్ రోడ్డు పనులను రైల్వే, ఫారెస్ట్ ఎస్.ఆర్.డీ.పీ ఉన్నతాధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. తదనంతరం ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో ప్రజాపాలన సందర్భంగా భోలక్‌పూర్ అంజుమాన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను రాష్ట్ర రవాణా, జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి అభయహస్తం దరఖాస్తు స్వీకరణ కౌంటర్ పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత అంబర్ పేట్ సర్కిల్ గోల్నాక వార్డులో ఏర్పాటు చేసిన ప్రజా పాలన దరఖాస్తు స్వీకరణ పరిశీలన చేశారు. అనంతరం మూసారంబాగ్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ బ్రిడ్జి 29.5 మీటర్ల పొడవు గల బ్రిడ్జి 6 లైన్లతో 20 మీటర్ల క్యారేజ్ వే 3.5 మీటర్ల ఫుట్ పాత్‌తో నిర్మాణం చేపట్టనున్నారు. ఈ బ్రిడ్జి ని ప్రజలకు తొందరగా అందుబాటులోకి తేవడానికి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన భూసేకరణ కూడా సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మ్యాప్‌ను పరిశీలించారు. కమిషనర్ వెంట ఈ.ఎన్.సి జియాఉద్దీన్, ఎస్.ఆర్.డి.పిసి.ఈ దేవానంద్, ఎస్.ఈ రవీందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలు నిర్భయంగా వెలికితీసే పత్రిక నవతెలంగాణ



- కార్పొరేటర్ రావుల శేషగిరిరావు
- నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నవశకానికి నాందిగా నిలుస్తూ అనుదినం జనస్వరంతో మీడియా ప్రపంచంలో పెరుగుతున్న పోటీ తత్వంలో నిర్భయంగా వాస్తవాలు రాస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యవంతులను చేస్తున్న దినపత్రిక నవతెలంగాణ అని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి రావు అన్నారు. బుధవారం నవతెలంగాణ దినపత్రిక (2024) నూతన సంవత్సర క్యాలెండర్‌ను డివిజన్ పరిధి మాదేవపురంలోని శ్రీమాత యోగ అన్నపూర్ణేశ్వరి దేవి దేవాలయంలో స్థానికులు, ఆ పత్రిక సీనియర్ రిపోర్టర్ సరస్వతి నరేందర్ రాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ప్రజల పక్షాన సంచలనమైన వార్త కథనాలు రాయడంలో నవతెలంగాణ దినపత్రికకు సాటి మరొకటి లేదని ప్రశంసించారు. నవతెలంగాణ యాజమాన్యం, సిబ్బంది కరోనా విపత్కర సమయంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు, పేద ప్రజలకు, సిబ్బందికి నిత్యావసర సరుకులు అందజేసి చేదోడుగా నిలిచిన పత్రిక నవతెలంగాణ కొనియాడారు. నవతెలంగాణ పత్రిక అభ్యున్నతి కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందజేస్తానని స్పష్టం చేశారు. అనంతరం యాజమాన్యం ,డెస్క్, విలేకరులకు, సిబ్బందికి, (2024) నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీసీ విభాగం ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, స్థానిక నాయకులు నారాయణ, రమేష్ బాబు, మూర్తి, జగదీశ్వర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, చిన్న, రమణారెడ్డి, మురళి, శ్రీనివాస్, శంకర్, రాజిరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

సుభాకర్ మాల్యా బత్తులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ పరిధి రంగారెడ్డి నగర్ పారిశ్రామిక వాడ ప్రాంతానికి చెందిన మానస టూల్ టెక్ అధినేత, అభినవ కవి, శ్రమ రత్న అవార్డు గ్రహీత, వాకిటి రామ్ రెడ్డి (2024) నూతన సంవత్సరం పురస్కరించుకొని బుధవారం బషీర్ బాగ్‌లో గల బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ ప్రధాన కార్యాలయంలో జోనల్ మేనేజర్ సుభాకర్ మాల్యా బత్తులనుకలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పారిశ్రామిక వేత్తలను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న జెడ్.ఎమ్.కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భముగా వాకిటి రామ్ రెడ్డి మాట్లడుతూ బాలానగర్ బ్రాంచ్ లో (ఎం.ఎస్.ఎం.) ఈ చిన్న తరహా పరిశ్రమలకు ఋణాలు అందించి యువతను ప్రోత్సహిస్తున్న తీరును ప్రశంసించారు. తమ వంతు సహకారం ఉంటుందని ఆయన తెలిపారు. బాలానగర్ బ్రాంచ్ మేనేజర్ అరుణ్ కుమార్‌తో పాటు బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు.

సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

- మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



నవతెలంగాణ-దుండిగల్

దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పట్టుదలతో చదివితే అద్భుత ఫలితాలు మీ సొంతమవుతాయన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులు తమపై పెట్టుకున్నటువంటి ఆశలు నెరవేర్చాలన్నారు. అనంతరం కళాశాలలోని సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఘనంగా డీజే స్టెప్పులతో స్వాగతం పలికారు. కళాశాలలోని అన్ని శాఖల సీనియర్లు తమ తమ బ్రాంచి జూనియర్లకు సాదర స్వాగతం ఈవెంట్‌ను ఆట పాటలతో చక్కగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జూనియర్ విద్యార్థులు ఆనందంతో గడిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చంద్రశేఖర్ యాదవ్, గ్రూప్ డైరెక్టర్ డా.పి.సంతోష్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన కాంగ్రెస్ నేత



నవతెలంగాణ-బేగంపేట

రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఏఐసీసీ మెంబర్ గౌరీ శంకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ప్రజాభవన్‌లో ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీలను ప్రజలల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని మంత్రి చెప్పినట్లు గౌరీ శంకర్ తెలిపారు.

జాతీయ పోటీలకు ఎంపికైన రితికకు సన్మానం



నవతెలంగాణ-బంజారా హిల్స్

ఖేలోఇండియాలో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి మహిళల హాకీ నేషనల్ ఛాంపియన్‌షిప్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న రితిక పాండేను అరోరా కాలేజీ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రదోష్ చంద్ర పట్నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ఆమెను సన్మానించారు. తమ కాలేజీలో విద్యను అభ్యసిస్తూ జాతీయ స్థాయి పోటీలకు సారథ్యం వహించడం తమకెంతో గర్వకారణంగా ఉందని కాలేజీ అధ్యాపకులు దీపిక విజయశ్రీయులు అన్నారు.

బంజారుల చరిత్ర గొప్పది : సీఎం రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

లిఖిత చరిత్ర లేని బంజారా గిరిజన తెగదిఘనమైన చరిత్రను పుస్తకరూపంలో సమాజానికి అందించడం చాలా అభినందనీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. హైకోర్టు న్యాయవాది, మాజీ వాణిజ్య పన్నుల అధికారి డా.ధనంజయ్‌నాయక్, ఉస్మానియా విశ్వ విద్యాలయ తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు, సీనియర్ ప్రొ.సూర్యాధనంజయ్ సంయుక్తంగా రచించిన బంజారా సాహిత్య అకాడమి సహకారంతో వెలువడిన "బంజారా చరిత్ర" గ్రంధాన్ని డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆయన ఆవి ష్కరించారు. రచయితలు గ్రంథం మొదటి ప్రతిని ముఖ్యమంత్రి కి అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆ సందర్భంగా ఆయన కవి దంపతులను అభినందించారు. బంజారా సాహిత్య అకాడమీ నుండి మరింత సాహిత్యం వెలువడాలని కోరారు. ముఖ్యమంత్రి కరకమలాల మీదుగా ఈ చారిత్రక గ్రంథాన్ని ఆవిష్కరించుకోవడం చాలా సంతోషాన్నిచ్చిందని తెలియ జేశారు. కార్యాలయ సిబ్బందికి రచయితలు కృతజ్ఞతలు తెలిపారు. నూతన సీఎం నాయ కత్వంలోని కాంగ్రెసు ప్రభుత్వం సమర్ధవంతంగా పనిచేసి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తుందని ఆకాంక్షించారు.

ఫిబ్రవరి 8 నుంచి కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఓయూలో-పోస్టర్స్ విడుదల

ఫిబ్రవరి 17న, కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నరేష్ ఆధ్వర్యంలో ఓయూలో ఫిబ్రవరి 8 నుంచి కేసీఆర్ కప్ క్రికెట్ పోటీలను నిర్వహి ంచనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దానికి సంబంధించిన పోస్టర్స్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఆవిష్కరించారు. ఓయూ అనుబంధ కాలేజీ విద్యార్థుల రాష్ట్రాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తుంగ బాలు మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడారంగంలో కూడా ముందంజలో ఉండాలని,తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీల విద్యార్థులు గత ఐదు సంవత్స రా లుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గెలి చిన వారికి మొదటి బహుమతిగా రూ.50,000-/,రెండవ బహుమతి నగదు రూ.25,000-/లు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కారదర్శి, ప్రోగ్రామ్ -కోఆర్డినేటర్ శిగ వెంకటేష్ గౌడ్, నాయకులు కార్యక్రమ నిర్వాహకులు కొంపెల్లి నరేష్ నాయకులు మల్లేష్. సురేష్ రాజు చందు చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



ఓయూ నుంచి చెరువుగట్టు వరకు పాదయాత్ర



నవతెలంగాణ-ఓయూ

అవినీతి కుటుంబ పాలన అంతమే కాంగ్రెస్ ప్రజా పాలన వచ్చిన సందర్భంగా, కోమటిరెడ్డి బ్రదర్స్, నకేరకల్ ఎమ్మెల్యేగా వేముల వీరేశం భారీ మెజార్టీతో గెలు పొందిన సందర్భంగా, వేముల వీరేశం అనుచరులు ఓయూ జెఏసీ వైస్ ప్రెసిడెంట్ పీసీసీ రాష్ట్ర నాయకులు నోముల శేషుయాదవ్ ఆధ్వర్యంలో బుధవారం టీఎస్‌పీ జాక్ స్టేట్ ప్రెసిడెంట్ ఓయూకాంగ్రెస్ నాయకుడు వలిగొండ నరసింహా సమన్వయకర్తగా 50 మంది విద్యార్థులతో కూడిన బృందం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ నుండి చెరువుగట్టు వరకు పాదయాత్ర బుధవారం ప్రారంభించారు. యాత్రను మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్ సోషల్ సైన్స్ డిన్ ప్రొ అర్జున్‌రావు జెండా ఊపి ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంపాల రాజేష్, ఉదయ్ కుమార్, శ్రీధర్ దయాకర్, ఉదయ్, రెడ్డి, శ్రీను, అజయ్, బండి నరేష్ పద్మయాదవ్, నల్లలత, పాల్గొన్నారు.

సావిత్రి బాయి పూలే అందరికీ ఆదర్శం : మంత్రి సీతక్క

నవతెలంగాణ-బంజారాహిల్స్

సావిత్రి బాయి పూలేనాడు వేసిన విద్య పునాదులే నేడు మనకు ఆదర్శ అడుగుజాడలని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. బుధవారం సోమాజీగూడ, ప్రెస్‌క్లబ్ ఆదర్శ మహిళా ఉపాధ్యా యులకు, తెలంగాణ ఉద్యమకారిణు లకు, మహిళా పాత్రికేయులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లా డుతూ... సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న మహిళలు ఇంకెన్నో విజయాలను సాధించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మహిళల్లో పోరాడే శక్తితో పాటు, సమస్యలను ఎదుర్కొనే శక్తి కూడా పెరగటం ఎంతో ఆహ్వానించదగ్గ పరిణామం అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ మాజీ చైర్మన్ బి.ఎస్.రాములు మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే భారతీయ తొలి ఉపా ధ్యాయురాలని 193 ఏళ్ళ తర్వాత కూడా ఆమె జయంతిని ఇంత గొప్ప స్థాయిలో జరుపుకోవడం ఎంతో హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన భారతీయ ఓబీసీ సమాఖ్య జాతీయ అధ్యక్షులు కే.కోటేశ్వర్ రావు మాట్లాడుతూ ఆదర్శ మహిళా ఉపాధ్యాయులకు, తెలంగాణ ఉద్యమకారిణులకు, మహిళా పాత్రికేయులకు, సామాజిక వేత్తలను పెద్ద ఎత్తున సన్మానించుకోవడం మనల్ని మనం సన్మానించుకున్నట్లేనని, సుమారు డెబ్బై మంది మహిళలను సన్మానించామని ఆయన అన్నారు. భారత ఓబీసీ సమాఖ్య జాతీయ ప్రధానకార్యదర్శి, ప్రముఖ సీనియర్ పరిశోధన పాత్రికేయులు అనంచిన్ని వెంకటేశ్వరావు తదితరులు మాట్లాడారు. అనంతరం సుమారు డెబ్బై మంది మహిళా ప్రముఖులను మంత్రి సీతక్క ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భారతీయ ఓబీసీ సమాఖ్య తెలుగు రాష్ట్రాల కోఆర్డినేటర్ సాయిరమ్య, అంబు రాథోడ్, వెంకటేశ్వర్లు, రాగుల శ్రవణ్ కుమార్, ఆల్ ఇండియా మహిళ రిజర్వేషన్ పై పోరాటం చేస్తున్న మహరాష్ట్ర నుండి సింపల్ తై రాథోడ్, జోగినీ నిర్మూలన పోరాట నాయకు రాలు హజమ్మా, ఓఎంఐఎఫ్ ఆర్గనేజేసన్ ఎంజిలా డెవిస్, ఓబీసీ భాగ్యలక్ష్మి, తెలంగాణ విద్యా వంతుల వేదిక సభ్యురాలు రాజేశ్వరి, ఓబీసీ మైనార్టీ మహిళా విభాగం సభ్యులు నజియా సికిందర్, దక్షిణాది రాష్ట్రాల మహిళా కన్వీనర్ రోజా నేత తదితరులు పాల్గొన్నారు.



కనీస వేతనాలు పెంచాలని ఓయూ వీసీకి మెమోరాండం అందజేత

నవతెలంగాణ-ఓయూ

ఓయూలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కనీస వేతనాలు పెంచాలని బుధవారం ఓయూ కాం ట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ)ఆధ్వర్యంలో వీసీ ప్రొ.రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఓయూలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. వీసీ ప్రొ. రవీందర్ సానుకూలంగా స్పందించి కాంట్రాక్టర్స్ తో మాట్లాడి పరిష్కారం చేస్తమని హామీ ఇచ్చారన్నారు. ఈ సంద ర్భంగా యూనియన్ అధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ ఓయూలో కార్మికులు దాదాపుగా 30 సంవత్సరాలుగా పని చేస్తున్న కనీస వేతనాలు అమలు చేయకపోవడం బాధాకరమని, వెంటనే కనీస వేతనాలు అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీసం జీతాలు పెంచాలని పలుమార్లు కోరిన పెంచటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్ సోర్సిగ్ కార్మికులు దాదాపు 3 సంవత్స రాలనుండి జీతాలు పెంచకపోవటం బాధాకరమన్నారు. ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు, లేని పక్షంలో కార్మికులందరిని సమీకరించి ఆందోళన పోరాటాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం,వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ రావు,ఉపాధ్యక్షులు నాగరాజు,పాత్య శ్రీనివాస్, లక్ష్మణ్,నరేష్ పాల్గొన్నారు.



మారేడపల్లిలో వికాషిత్ సంకల్పయాత్ర

నవతెలంగాణ-కంటోన్మెంట్

మారేడ్పల్లి మునిసిపల్ గ్రౌండ్‌లోని బుధవారం మధ్యాహ్నం వికాషిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ క్యాంపులో వివిధ శాఖల నుండి అధికారులు పాల్గొన్నారు. వారు కేంద్ర పథ కాలను ప్రజలకు వివరించి వాటికి సంబంధించిన దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హిందుస్తానీ పెట్రోలియం గ్యాస్ ఏజెన్సీ వారు ఉజ్వల యోజన పథకాన్ని గురించి, ఆరోగ్య శాఖ వారు టీబీని నిర్మూలించడానికి పరీక్షలు, ఉచితహెల్త్ మేళా కూడా ఏర్పాటు, ఎస్బిఐ బ్యాంకర్స్ కేంద్ర పథకాలను ముద్ర లోను, స్టాండప్ లోన్, సనిధి యోజన, ఆవాస్ యోజన లాంటి పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఆయుష్మాన్ భారత్ కార్డు ఎలా ఉపయో గించుకోవాలో తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని మోండా డివిజన్ కార్పొరేటర్ దీపిక నరేష్ పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దాం



ఓయులో


కంటోన్మెంట్‌లో


జూబ్లీహిల్స్‌లో

నవతెలంగాణ-ఓయు

కోఠి మహిళా యూనివర్సిటీ పేరు సావిత్రిబాయి పూలే పేరు నామకరణం చేయా లని ఓయు ఎస్ఎఫ్ఐ నేతలు ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఓయూ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రవి నాయక్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల ఘనంగా నివాళులర్పిం చారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త బ్రిటిష్ సామ్రాజ్యా దానికి, బ్రాహ్మణిజానికి, మనస్మృతికి, వ్యతిరేకంగా పోరాడి బడుగు, బలహీన,దళిత వర్గాల మహిళల కోసం పాఠశాల ఏర్పాటు చేసి విద్యను అందించిన మొట్టమొదటి భారతీయ మహిళ యోధురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. కుల,మత, ప్రాంతం, వర్ణం, బేధం వివక్షకు, పితృ సామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల హక్కుల కోసం పోరాటం చేయటం గొప్ప పరిణామమన్నారు. నూతన సమాజం కోసం ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు శ్రీను ప్రశాంత్ శిరీష సహాయక కార్యదర్శి కృష్ణ. సందీప్ నాయకులు శ్రీనాథ్,యశ్వంత్, మాళవిక, మేఘన, భాను, విష్ణు, నరేష్ తనుష్ పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు
హాజరైన వెన్నెల గద్దర్

నవతెలంగాణ-కంటోన్మెంట్

బీసీ జాతీయ చైతన్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో బోయినపల్లిలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమాన్ని జాతీయ అధ్యక్షుడు యనమల శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో నిర్వహించగా కంటోన్మెంట్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వెన్నెల గద్దర్ హాజరై కేకనికట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం సావిత్రి బాయి పూలే సేవలను కొనియాడారు. మహిళలు సావిత్రి బాయి పూలేని ఆదర్శంగా తీసుకోవాలని ఆమె సూచించారు. ఆశోక్ కుమార్ ప్రేమ్ కుమార్ ఓం ప్రకాష్ యాదవ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు. బీసీసెల్ అధ్యక్షుడు ప్రతినిధి అశోక్ కుమార్‌ను బీసీల పలు సమస్యలను వెన్నెలకు వివరించారు.

భారతదేశంలో మహిళా, బాలికల అభివృద్ధి కోసం
పాటుపడదాం : సీనియర్ జర్నలిస్ట్ సీ.వనజ పిలుపు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సావిత్రిబాయి పూలే 193వ జయంతి గురువారం బోంబండ గర్ల్స్ రెసిడెన్షియల్ హై స్కూ ల్‌లో జన విజ్ఞాన వేదిక జూబ్లీ హిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సతీసహగమనం, బాల్య వివాహాలు, అంటరానితనం వ్యతిరేకంగా పోరాడి, ఎన్నో అవమానాలు భరించి ప్రజల కోసం పాటుపడ్డ సావిత్రిబాయి పూలే ఆశయాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మహిళా అక్షరాస్యత 57శాతంగానే ఉందని మిగతా 43శాతం కూడా సాధించడానికి ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. మహిళలు అక్షరాస్యత సాధిస్తేనే ఈ సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రాజా మాట్లాడుతూ, జన విజ్ఞాన వేదిక ప్రజలం దరికీ విజ్ఞానాన్ని, సైన్స్‌ను సులువుగా అర్థం చేసే విధంగా, అనేక కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత కుమారి, ఈ కార్యక్రమం నిర్వహణ పర్యవేక్షించిన ఉపాధ్యాయురాలు రమా, జెవివి జూబ్లీహిల్స్ జోన్ సభ్యులు సాయి, రవీంద్రబాబు, టీచర్స్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మార్పుకు బాటలు వేసిన పూలే
సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి టి.మహేందర్

నవతెలంగాణ-బేగంపేట్

సావిత్రి బాయ్ పులే జయంతిని అడ్డగుట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సీఐటీయూ సికింద్రాబాద్ కమిటీ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి టి.మహేందర్ మాట్లాడుతూ మూడు వేల ఏండ్ల మనుస్మృతి మాన సిక విషమ చట్టాల మాటున దేశంలో మెజార్టీ ప్రజలకు సకల హక్కులు నిషేధం. ద్వితీయ శ్రేణి పౌరురాలుగా అణిచివేతకు గురైన ఓ మహిళ, నాగరికపు సమాజాన్ని నిర్మించడానికి నానా కష్టాలు అవమానాలు భరించింది. మనుషులు అందరూ సమానులే నని చాటడానికి తన జీవితాంతం కృషి చేసింది. శూద్రులు మహిళలకు అస్పృశ్యులకు విద్య అనే ఆయుధాన్ని సావిత్రిబాయ్ పులే అం దించింది. ఆమె నాటి చీకటి సమాజానికి వెలుగు దివిటి అందించిందని వారు తెలిపారు. నాడు సావిత్రిబాయి అందరికీ చదువు కోసం అహర్నిశలు తపిస్తే, నేటి పాలకులు కొనుక్కోగలిగిన కొందరికే చదువు అందించే బాధ్యత నిర్వహిస్తున్నారు. విద్యార్థుల భవి ష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని చెప్పిన కొఠారి కమిషన్ సిఫారసులను పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. అంబేద్కర్ ఆలోచనలు, సావిత్రిబాయి పూలే ఆచరణ పద్ధతిని నేటి పాలకులు తుంగలో తొక్కుతున్నారన్నారు. ఉన్నత విద్యను ఉన్నత వర్గాలకే కట్టబెట్టే ప్రయ త్నంలో భాగంగా యూని వర్సిటీలను ప్రయివేటు కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారన్నారు. సావిత్రిబాయి కాలంలో శూద్రులు అస్పృశ్యులు మహి ళలకు చదువును నిరాకరిస్తే, నేటి పాలకులు ప్రయివేటు యూనివ ర్సిటీలు, విద్యాసంస్థలు నెలకొల్పి పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నారు. సావిత్రి బాయి పూలే లక్ష్యాలు ఆశయాల్ని ఆచరించాలనుకునే ప్రతి ఒక్కరూ ఆమె జీవితాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లక్ష్మి,సంధ్య,రేణుక,మంజుల,అర్చన, భాగ్య, మహేశ్వరి. తదితరులు పాల్గొన్నారు.



సీడబ్ల్యూఈ కార్యాలయంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ సీడబ్ల్యూఈ కార్యాలయ ఆవరణలో ఎస్సీ ఎస్టీ సెల్ ఎంవీఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు,క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి సిడబ్ల్యూఈ రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న ప్రదేశం అందంగా తీర్చిదిద్దుకొని మనం ఒక యూనిట్ లాగా పని చేయాలన్నారు. నేషనల్ ప్రెసిడెంట్ నర్సింగ్ రావు, ఎస్సీ ఎస్టీ యూనియన్ అధ్యక్షులు యాదగిరి, జనరల్ సెక్రెటరీ ఉమా మహేష్, కోశాధికారి విజయ్ కుమార్, చలమయ్య, తిరుమల రావు, హరికృష్ణ ,లక్ష్మణ పాల్గొన్నారు.

'నవతెలంగాణ' క్యాలెండర్ ఆవిష్కరించిన ఐఎస్ఓ డైరెక్టర్ డా.వినోద వెంకట స్వామి



నవతెలంగాణ-ఓయూ

దినపత్రికలు సామాజిక బాధ్యతగా ఉన్నత విద్యా, ఉపాధి రంగాల అభివృద్ధి కోసం,నూతన ఆవిష్కరణల పురోగతి కోసం తోడ్పాటు ఇవ్వాలని ఐఎస్ఓ విద్యా సంస్థల డైరెక్టర్ డా.వినోద వెం కట్ స్వామి కోరారు. ఆమె బుధవారం తన కార్యాలయంలో నవతెలంగాణ నూతన సంవత్సర క్యా లెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఐఎస్ఓ అధ్యాపకులకు, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశా రు. ఉన్నత విద్యా, ఉపాధికి తమ విద్యా సంస్థలు పెట్టింది పేరు అని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

'నవతెలంగాణ' క్యాలెండర్ విడుదల చేసిన జోనల్ కమిషన్



నూతన సంవత్సర నవ తెలంగాణ క్యాలెండర్‌ను బుధవారం సికింద్రాబాద్ జోన్ కమిషనర్, జీహెచ్ఎంసీ ఎన్.రవికిరణ్ క్యాలెండర్‌ను బుధవారం సీనియర్ జర్నలిస్టు తలారి శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగిం చాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని రాంగోపాల్‌పేట డివిజన్‌లోని చుట్టాల బస్తీ, నల్లగుట్ట, వార్డ్‌ఆఫీస్, జే.లైన్, ఎఫ్ లైన్, సీలైన్ తదితర ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో స్థానిక ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. జే లైన్‌లో కలుషిత నీరు సరఫరా అవు తుందని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా, సమస్య పరిష్కారం కోసం నూతన సీవరేజ్, వాటర్‌పైప్‌లైన్ పనులను మంజూరు చేసినట్లు చెప్పారు. 2,3 రోజు లలో పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రోడ్లలో సీవరేజ్ నుండి ఓవర్ ఫ్లో అయి మురుగునీరంతా రోడ్లపై ప్రవహిస్తుందని, దీంతో తాము ఇబ్బందులు పడుతు న్నా మని స్థానికులు తెలుపగా, స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సమ స్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. సీలైన్‌లో నూత నంగా సీవరేజ్ లైన్ ఏర్పాటు చేశారని, మ్యాన్ హెూల్స్ నిర్మాణాన్ని అసంపూ ర్తిగా చేశారని ఎమ్మెల్యేకి విన్నవించగా, వెంటనే నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు పలు అభివృద్ధి పను లను చేపట్టడం జరి గిందని, వాటిని త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డీసీ శంకరయ్యను ఆయన ఆదేశించారు. అదేవిధంగా నూతనంగా మంజూ రైన పనులను కూడా వెంటనే చేపట్టే విధంగా అవసరమైన చర్యలను తీసుకో వాలని చెప్పారు.

లబ్దిదారుల ఎంపిక పై అయోమయం : తలసాని

ప్రజాపాలన కార్యక్రమం క్రింద 6 పథకాల కోసం దరఖాస్తు చేసుకొనే వారిలో అర్హులను ఎప్పటిలోగా ఎంపిక చేస్తారనే విషయంలో సరైన స్పష్టత లేకపోవడం వలన ప్రజలు అయోమ యానికి గురికావాల్సి వస్తుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన రాంగోపాల్ డివిజన్ పర్యటనలో భాగంగా చుట్టాల బస్తీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. దరఖాస్తు లకు సంబంధించి కేంద్రంలోని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఈ నెల 6 వ తేదీ లోగా అర్హులైన ప్రజలను దరఖాస్తు చేసుకోమని చెప్పిందే తప్ప, ఎప్పటిలోగా అర్హులను ఎంపిక చేస్తామనే విషయాన్ని ప్రకటించలేదన్నారు. కేంద్రంలోని అధికారులను కూడా ఇదే విషయాన్ని ఎమ్మెల్యే ప్రశ్నించగా, తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా లబ్దిదారులను ఎప్పటి లోగా ఎంపిక చేస్తారనే విషయంపై స్పష్టమైన ప్రకటన చేసి ప్రజలలో ఉన్న అయోమయాన్ని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ శంకరయ్య, మాజీ కార్పొరేటర్‌లు అత్తిలి అరుణ గౌడ్, కిరణ్మయి, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, వాటర్ వర్క్స్ డీజీఎం శశాంక్, సురేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, అంజనేయులు, అరుణ్ భట్, సతీష్, గణేష్, నిర్మల, సత్యనారాయణ, సత్యనారాయణ, రాజేష్ ఉన్నారు.

మంత్రులకు అదం సంతోష్ శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర నూతనంగా మంత్రి పదవులు స్వీకరించిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదం సంతోష్ కుమార్ బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజాపాలన తో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల్లో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి



నవతెలంగాణ-ఓయూ

సావిత్రిబాయ్ పూలె జయంతి సందర్భంగా శ్రీనివాస్ నగర్‌ఎక్స్ రోడ్డులో బుధవారం సావిత్రి భాయ్ పూలె జయంతి వేడుకలు మేకల కీర్తి హర్ష కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేకల సారంగపాణి సావిత్రిబాయ్ చిత్రపటానికి పూల మాల వేసి సావిత్రి బాయ్ సేవ లను కొనియాడారు. ఈ కార్యక్రమానికి కనకట్ల హరి, అంబాల రాజు, భూషన్న సాయి యాదవ్, సతీష్, లత, సరిత, శ్రీకాంత్, రమేష్, అంజి, సందీప్,గిరి, శేఖర్, మరియు కార్య కర్తలు, మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకి నివాళి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ సంఘ సంస్కర్త ఆధునిక భారతావనిలో తొలి పాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కీసర మండల వనరుల కేంద్రంలో తెలం గాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ సంఘ సంస్కర్తల్లో సావిత్రీబాయి పూలే ఒకరు అని, ఆమె దేశంలో తొలి ఆదర్శ ఉపాధ్యాయిని అన్నారు. బ్రిటీష్ పాలన నాటి ప్రజల స్థితిగతులు, విద్య, సాంఘిక దురాచారాలు, సతీ సహగ మనం, బాల్య వివాహాలు సావిత్రీబాయిని కదిలించాయని తెలిపారు. బాలికా విద్య కోసం పాఠశాల స్థాపించి సావిత్రిబాయి పూలే ఆధునిక భారత దేశపు మొట్టమొదటి మహిళా అధ్యాపకురాలు అయినట్టు గుర్తు చేశారు. అవినీతి కుల వ్యవస్థ కోసం వ్యతిరేకంగా పోరాడిన మహనీయురాలు అని, అంతటి మహనీయురాలి జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషాన్నించిదన్నారు.



నూతన సంవత్సరం సందర్భంగా హైదరాబాద్ జిల్లా కోఆర్డినేటర్ రజిత, బహదూర్‌పురా డిప్యూటీ ఐవోఎస్ హరి నారాయణకు బుధవారం దారుషిఫా ప్రధానోపాధ్యాయులు మందడి వెంకట్ రెడ్డి, పృథ్వి, రవికాంత్ అపర్ణ కలిసి డైరీలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

టీజీఎల్‌ఏ రాష్ట్ర కమిటీలోకి జిల్లా సభ్యులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ సంఘం 711 (టీజీఎల్‌ఏ) రాష్ట్ర మహిళా కార్యదర్శిగా టి.మాలతీ, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కదారి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్‌గా డి.సత్యనారాయణ హైదరాబాద్ జిల్లా నుంచి రాష్ట్ర కార్య వర్గానికి ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం నారా యణగూడ పీఆర్టీయూ భవన్‌లో టీజీఎల్‌ఏ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్. కనక చంద్రం అధ్యక్షతన రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లా నుంచి వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన అధ్యాపకులు మాలతీ, కదారి శ్రీని వాస్, సత్యనారా యణను రాష్ట్రస్థాయికి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు మంగళవారం వారిని ఘనంగా సన్మానించారు.

- **హైదరాబాద్ జిల్లా కమిటీ ఎన్నిక**

టీజీఎల్‌ఏ హైదరాబాద్ జిల్లా నూతన కమిటీ ఎన్నికయ్యింది. జిల్లా అధ్యక్షులుగా టి.మాలతీ, కార్య దర్శిగా వీరా నారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.మానస, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా కాశీనాథ్, ప్రసాద్ తదితరులతో పాటు జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

‘ఏఎస్‌డీ’పై ఆర్వోలతో కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు-2023లో ఏఎస్‌డీ(ఆబ్సెంట్, షిఫ్టింగ్,డెత్) జాబితాలోని ఓటర్లకు నోటీసులు జారీ చేయడం, షిఫ్టింగ్, హాజరుకాని ఓటర్లను కనుగోనడం, 1350కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్ల పరిశీలన, మరణించిన వారి రికార్డుల పరిశీలనతో పాటు వాటిని తొలగించేందుకు తీసుకున్న చర్యలు, పోలింగ్ బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటర్ గుర్తింపు కార్డులు పంపిణీ, పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటి నెంబర్ల జాబితాను తయారు చేయడంపై బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అన్ని నియోజకవర్గాలకు చెందిన ఈఆర్వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అనుమానం వద్దు పథకాలను వంద శాతం అమలు చేస్తాం

- **జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా 10 లక్షల దరఖాస్తులు అందాయి**
- **ఆరున్నర కోట్ల మంది ఉచిత ఆర్టీసీ ప్రయాణాన్ని వినియోగించుకున్నారు**
- **మంత్రి పొన్నం ప్రభాకర్**



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజా పాలనలో హామీనిచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను వంద శాతం అమలు చేస్తామని, అందులో అనుమానం వద్దని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం ముషీరాబాద్ సర్కిల్ బోలక్‌పూర్ వార్డులోని అంజుమన్ స్కూల్‌లో నిర్వహించిన దరఖాస్తు స్వీకరణ కౌంటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా 10 లక్షల దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. ఇందులో ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పెన్షన్, మహాలక్ష్మి, సబ్సిడీ గ్యాస్‌లకు సంబంధించిన దరఖాస్తులు అందాయని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన 45 గంటల్లో మహాలక్ష్మి పథకాన్ని అమల్లోకి తెచ్చి ఇప్పటి వరకు ఆరున్నర కోట్ల మంది ఉచిత ఆర్టీసీ ప్రయాణాన్ని వినియోగించుకున్నారని గుర్తు చేశారు. ప్రతి ఇంటి నుండి ఒక దరఖాస్తును స్వీకరిస్తున్నామని తెలిపారు. ఆరు గ్యారెంటీ పథకాలతో రేషన్ కార్డు, బస్తీ సమస్యలపై కూడా దరఖాస్తులు సమర్పించవచ్చు అని తెలిపారు. జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా 150 వార్డులలో 600 కేంద్రాల్లో దరఖాస్తు స్వీకరణ కౌంటర్లు ఏర్పాటు చేశామని, అవసరం మేరకు మరిన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా పాలనలో ఎటువంటి సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని అన్నారు. ముషీరాబాద్ సర్కిల్ లోని బోలక్ పూర్, రాం నగర్, అడిక్ మెట్, కవాడిగూడ, గాంధీ నగర్, ముషీరాబాద్‌లో దరఖాస్తుల స్వీకరణ సజావుగా సాగుతుందని మంత్రి తెలిపారు.

సేవా పతకం అందుకున్న ఇన్‌స్పెక్టర్ కన్నెం మధు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే పోలీసు సేవా పథకాన్ని రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కన్నం మధు అందుకున్నారు. 2023లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన పోలీసు ఉద్యోగుల పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కన్నం మధు ఉత్తమ సేవా పథకం అందుకున్నారు. హైదరాబాద్ జాయింట్ కమిషనర్ సత్యనారాయణ చేతులమీదుగా కన్నం మధుకు సేవా పథకం బహుకరించి, అభినందించారు.



ఆరు గ్యారెంటీ పథకంలో ఓసిలకు అవకాశం కల్పించాలి

టీడీపీ నాయకుడు కేడి దినేష్..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ప్రజా పాలనలో ఆరు గ్యారెంటీ పథకాన్ని నిరుపేద ఓసీల కూడా వర్తింపజేయాలని టీడీపీ నాయకులు కేడి దినేష్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం గోషామహల్ నియోజకవర్గంలో ఆయన మాట్లాడుతూ . ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన పథకంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ,బీసీలతో పాటు ఓసి నిరుపేదలకు అవకాశం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డినీ కోరారు. గోషా మహల్ నియోజకవర్గంలో అత్యధికంగా ఓసి లు నిరుపేదలు ఉన్నారన్నారు వీరందరికీ దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోసోమశేఖర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'రసాయనిక మందులు వినియోగించకుండా పండించడంపై పరిశోధనలు'


ఉన్నత చదువులకై అమెరికా వెళుతున్న షేక్ ఉమర్ ఫరూక్ వెల్లడి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా పోషక విలువలు కలిగిన ఆరోగ్యకరమైన పంటలు పండించడంపై పరిశోధనకై అమెరికా వెళుతున్నట్లు నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ తనయుడు షేక్ ఉమర్ ఫరూక్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో ఉమర్ ఫరూక్‌కు వీడ్కోలు చెప్పేందుకు అతని తల్లిదండ్రులు, బంధువులు వెళ్లారు. ఒక్క నీటి చుక్క వృధా కాకుండా వ్యవసాయం చేసేందుకు బిందు సేద్యం, నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను పండించడంపై విద్యను అభ్యసించడానికి, అధ్యయనం చేయడం కోసం వెళుతున్నానని తెలిపారు. వ్యవసాయ విజ్ఞానాన్ని రాష్ట్రంలో రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

'మహిళా యూనివర్సిటీకి సావిత్రిబాయి పూలే పేరు పెట్టాలి'



ప్రొఫెసర్ కంచ ఐలయ్య

నిజాం కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి

నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ మహిళా యూనివర్సిటీకి సావిత్రిబాయి పూలే మహిళా యూనివర్సిటీగా పేరు పెట్టాలని ప్రముఖ సామాజిక వేత్త, ప్రొఫెసర్ కంచ ఐలయ్య కోరారు. బీసీ సెల్ ఆధ్వర్యంలో బుధవారం నిజాం కళాశాలలో 'సావిత్రి బాయి పూలే 193వ జయంతి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.బీమా అధ్యక్షత వహించగా సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కంచ ఐలయ్య మాట్లాడుతూ మహిళా యూనివర్సిటీకి సావిత్రిబాయి పూలే పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ విద్యార్థినీ, విద్యార్థులు సోషల్ మీడియాను ఉపయోగించుకొని ప్రచార కార్యక్రమం చేపట్టాలని సూచించారు. అజ్ఞాన అంధకారాలను, అణచివేతను ఎదుర్కొని అట్టడుగు వర్గాల ప్రజలకు విద్యను అందించడమే కాకుండా ఎంతో సేవ చేసిన గొప్ప వ్యక్తి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో విద్యార్థులు సమాజం కోసం ముందుకు సాగాలని కోరారు. అకాడమిక్ పుస్తకాలతో పాటు మహనీయుల జీవిత చరిత్ర, 'గులాంగిరి' వంటి సామాజిక అంశాలతో కూడిన పుస్తకాలను చదవాలని విద్యార్థులకు సూచించారు. అప్పుడే జీవితంలో ఉన్నతం గా రాణిస్తారని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో ఆంగ్లమే మాతృ భాషగా మారాల్సిన అవసరం ఉందన్నారు. నిజాం కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ బి.బీమా మాట్లాడు తూ సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు శ్రమించాలని కోరారు. సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞానాన్ని సంపాదించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్- ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఉపేం దర్ రెడ్డి, బీసీ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ మోహన్ రెడ్డి, పిఆర్ఓ డాక్టర్ సిహెచ్. పరందాములు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. మంజుల తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత మోటార్ సైకిళ్లు వెంటనే ఇవ్వాలి



సీఐటీయూ డిమాండ్..

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత మోటార్ సైకిళ్లు ఇవ్వాలని, అడ్డాల వద్ద. మూత్రశాలలు ఏర్పాటు చేయాలని , అడ్డా కార్మికులకు పనులు కల్పించాలని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి మీసాల శ్రావణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తాడ్ బన్ లేబర్ అడ్డా వద్ద కార్మికుల సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఏ అపద వచ్చిన కార్మికులకు అండగా ఉండేది సీఐటీయూ యూనియన్‌నే అన్నారు. ప్రతి సంవత్సరం కార్మికులు తమ బాధ్యతగా సభ్యత్వం తీసుకోని సంఘం లో సభ్యులుగా చేరాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం అనేక పోరాటాలు చేసి సాధించామని చెప్పారు. సంక్షేమ బోర్డులో ప్రస్తుతం కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాల బెన్ పిట్స్ పెంచాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం పట్టణాల్లో కూడా అమలులోకి తీసుకొచ్చి కార్మికులందరికీ పనులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులు సంఘం చేరి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సీఐటీయూ నిర్వహించే ఉద్యమాలలో పాల్గొని కార్మిక హక్కులు సాధించుకోవాలని ఆయన పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షురాలు మీనా, జిల్లా ఉపాధ్యక్షులు కె. జంగయ్య , సీఐటీయూ జిల్లా నాయకులు అబ్దుల్ సత్తార్ , పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు సన్మానం



నవతెలంగాణ-ముషీరాబాద్

సావిత్రిబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకోని తెలంగాణ గౌడ కల్లు సంఘాల సమన్వాయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. సీతక్క మొదటిసారిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సమన్వయ కమిటీ చైర్మెన్ బాలగొనీ బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్ కుమార్ గౌడ్ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్లమెంటులో అట్టహాసంగా ప్రవేశపెట్టిన మహిళాల బిల్లులో ఓబీసీ మహిళలకు మొండి చేయి చూపించిందని దానిని తక్షణమే అమలు జరిగే విధంగా చూడాలని మంత్రిని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క గీత కార్మికుల సంక్షేమం పట్ల తమ ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గీత కార్మికుల సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తుందని మంత్రి చెప్పినట్లు వారు తెలిపారు.

'హిందీ ప్రచార సభ చేసిన ఆరోపణలు అవాస్తవం'

హిందీ ప్రచార సభ హైదరాబాద్ ఉద్యోగుల సంఘం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

పూర్వ ఉద్యోగుల పేరిట హిందీ ప్రచార సభ హైదరాబాద్ సంస్థ సభ్యులపై చేసిన ఆరోపణలు అవాస్తమని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ఉద్యోగుల సంఘం స్పష్టం చేసింది. హిందీ ప్రచార సభ సంస్థ భవిష్యత్‌ను అంధకారంలోకి తీసుకెళ్లే విధంగా దురుద్దేశ్యంతో ఆరోపణలు చేయడం తగదని, సంస్థకు పూర్తిగా నష్టం చేసే చర్యలు విడనాడాలని తెలియచేసింది. ఈ మేరకు బుధవారం బషీర్ బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హిందీ ప్రచార సభ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నామ్ దేవ్ వాగ్మొడే, కార్యదర్శి శివలింగం గౌడ్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని మాట్లాడారు. సంస్థ విస్తరణలో భాగంగా రాజేంద్రప్రసాద్ కపూర్‌ను మూడేళ్ల క్రితం బదిలీ చేస్తే అక్కడ విధుల్లో చేరలేదని గుర్తు చేశారు. మహేష్ సింగ్, నమ్రతలు ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ ఉద్యోగులని, రాష్ట్ర విభజన తర్వాత అనంతపురంకు సంస్థ కార్యాలయం అక్కడకు వెళ్లిందని, సంస్థ తరలివెళ్లిన వీళ్ళు మాత్రం అక్కడకు వెళ్లలేదని చెప్పారు. హిందీ ప్రచార సభ హైదరాబాద్ కార్యకలాపాలు, సంస్థ సభ్యులపై తప్పుడు ప్రచారం చేసి అగౌరవపరిచిన రాజేంద్రప్రసాద్ కపూర్, నరేందర్, మహేష్ సింగ్, నమ్రతలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్‌లో ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసు కుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సంఘం నేతలు భానుదాస్ పూజారి, మాయా పాండే, జీఆర్ నర్సింగ్, ప్రతిభ, వినోద్ కుమార్ రెడ్డి, సునీత, అరుణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర వెలుగులు పంచిన అమ్మకు విజ్ఞానజ్యోతులు వెలిగిద్దాం

- సైన్సు కమ్యూనికేటర్, ట్రైనర్ వెలిగొండ వెంకటేశ్వర్లు,
- తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-ముషీరాబాద్

అక్షర వెలుగులు పంచిన అమ్మకు విజ్ఞానజ్యోతులు వెలిగిద్దాం.. సమ సమాజం కోసం కృషి చేద్దాం అప్పుడే సావిత్రిబాయి పూలేకు నిజమైన నివాళి అని సైన్సు కమ్యూనికేటర్, ట్రైనర్ వెలిగొండ వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు కె.మమత అధ్యక్షతన బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్‌లో సైన్స్ వర్క్ షాప్ జరిగింది. ఈ వర్క్ షాప్ లో మహిళా టీచర్స్ ప్రతి ఒక్కరూ విజ్ఞాన జ్యోతులు వెలిగించి సావిత్రిబాయి పూలేకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెలిగొండ వెంకటేశ్వర్లు, భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతిని టీచర్స్ డేగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యదీపాలు వెలిగిద్దాం విజ్ఞాన వెలుగులు పంచుదాం "ఇంటింటా దీపాలు వెలిగించాలని ప్రతి కార్యాలయంలో దీపాలు వెలిగించాలని సమాజానికి వెలుగులు పంచిన సావిత్రిబాయి పూలే నిజమైన నివాళులన్నారు. జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే ఇద్దరు జీవితాలు ఒకటిగా.. పెనవేసుకున్న ఆదర్శజీవిత చరిత్ర అని అన్నారు. అసమానతల సమాజం పై మనం ధిక్కారస్వరం వినిపించడమే అమెకు నిజమైన నివాళులని ఈరోజు అట్టడుగు వర్గాల జీవితాల్లో విజ్ఞాన వెలుగులు పంచిన మహా తల్లి అని ,సర్వస్వం త్యాగం చేసిన ఒక గొప్ప ధీర వనిత అని కొనియాడారు. విజ్ఞానదర్శిని అధ్యక్షుడు తాటి రమేష్ మాట్లాడుతూ అవమానాలు అసభ్య పదజాలాలు ఎన్ని ఎదురైనా నా విధిని నేను నిర్వహిస్తున్నాను అని సగర్వంగా తలెత్తి నిలబడ్డ సావిత్రిబాయి పూలే అని అన్నారు. 52 పాఠశాలలు నెలకొల్పింది .అంతేకాదు మహిళా సేవా మండలి నెలకొల్పి మహిళ హక్కులన్ని మానవ హక్కులుగా ప్రకటించారని పితృస్వామ్య వ్యవస్థ పై పోరాడారని సత్యశోధకు సమాజం ఏర్పాటు చేసి బాల్యవివాహాలు మూఢనమ్మకాలు సతీ సహగమనాన్ని వితంతువుల పునర్వివాహాల్ని ప్రోత్సహించారన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన దర్శిని శోభారాణి, తెలంగాణ బాలోత్సవం కోశాధికారి జి.బుచ్చిరెడ్డి, 56 పాఠశాలల సైన్సు ఉపాధ్యాయురాలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం తెలంగాణ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల ప్రస్తుత పరిస్థితి అనే అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాంలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించి సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం క్యాలెండర్‌ను ప్రొఫెసర్ హరిగోపాల్, ప్రొఫెసర్ కోదండరాం, విసి ప్రొఫెసర్ విజ్జుల్లతల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ ప్రసంగిస్తూ తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందని వాపోయారు. రావాల్సిన నిధులు రాకపోవడంతో ప్రభుత్వ విద్య రోజుకు నీరుగారి పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల్లో శాశ్వత ప్రాతిపదికన నియమించబడిన అధ్యాపకులు లేకపోవడంతో అనేక సంవత్సరాలుగా కాంట్రాక్ట్ అధ్యాపకులపై ఆధారపడి విశ్వవిద్యాలయాలు నడుస్తుండటం విచారకరమని ఆయన తెలిపారు. కావున కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసి విశ్వవిద్యాలయాలను పటిష్ట పరచాలని తెలిపారు. సావిత్రిబాయి పూలే స్త్రీల అభ్యున్నతి కోసం తన జీవితాంతం పోరాడిందని తెలిపారు. సావిత్రిబాయిపూలేని స్మరించుకోవటం అంటే విద్యకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాలని, తద్వారా సమానత్వం సాధించాలని చెప్పారు. మహిళా విశ్వవిద్యాలయంకు ఇప్పటివరకు నిధులు మంజూరు చేయకపోవడం అత్యంత శోచనీయమని తెలిపారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. అనేక ఒడిదుడుకలను తట్టుకొని ఆనాడు మహిళా విద్య కోసం సావిత్రిబాయి పూలే పాటుపడిందని గుర్తు చేశారు. మహిళల కోసం ప్రత్యేక పాఠశాలలు నిర్మించి మహిళా అభ్యున్నతికై పాటుబడిన విషయాన్ని గుర్తు చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అందరూ ఉన్నత జీవన విధానం కొనసాగించే వైపుగా ప్రభుత్వం విధానాలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజాభిస్తానికి అనుగుణంగా పరిపాలన కొనసాగాలని అలా కొనసాగిస్తుందని ఆశాభావంతో ఉన్నామని తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను నిరంతరం అభద్రతా భావంలో ఉంచడం సరికాదన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులరైజ్ చేయాలన్నారు. విసి ప్రొఫెసర్ విజ్జులత ప్రసంగిస్తూ.. సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో నడుస్తూ అధ్యాపకులు, విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఎస్ ఓప్రొఫెసర్ సరస్వతమ్మ, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వారజ రాణి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శైలజ, డాక్టర్ జయసూర్య, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ఈ ఉపేందర్, డాక్టర్ సనత్, డాక్టర్ ధర్మ తేజ, డాక్టర్ కృష్ణజి రావు, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శేఖర్ రెడ్డి, డాక్టర్ యాదయ్య పి ఆర్ ఓ కృష్ణ జీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట:

అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం గోల్నాక డివిజన్ పరిధిలోని శాంతి నగర్‌లో 12 లక్షలతో నిర్మించ నున్న డ్రైనేజీ పనులను గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలని అందుకు బాధ్యత అధికారుల పైన కాంట్రాక్టర్ పైన ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ గౌడ్, నర్సింగ్ యాదవ్, గోపాల్ రెడ్డి, ఖాదర్ షరీఫ్, గాజుల గోపాల్, తదితర నాయకులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా డ్రైవర్‌లపై ఆర్థిక దోపిడీలను అరికట్టాలి

- భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ డిమాండ్
- ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో సహిత రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ బిల్లును తగలబెట్టిన డ్రైవర్‌లు



నవతెలంగాణ-ముషీరాబాద్

దేశ వ్యాప్తంగా డ్రైవర్‌లపై ఆర్టిఏ అధికారుల జులుం ఆర్థిక దోపిడీలను అరికట్టాలని బిఎంఎస్ అనుబంధ భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ నాయకుల డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో సహిత రోడ్ ట్రాన్స్‌ఫోర్టు బిల్లును డ్రైవర్లు తగలబెట్టారు. ఈ సందర్భంగా భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌ఫోర్టు మజ్దూర్ మహాసంగ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చేయాలని అలాగే న్యాయ సంహిత బిల్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా డ్రైవర్లపై ఆర్‌టిఏ అధికారుల ఆర్థిక దోపిడీలను అరికట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో 25న దేశవ్యాప్తంగా రవాణా సమ్మె చేపడతామని హెచ్చరించారు. న్యాయ సంహితలో పేర్కొన్న విధంగా ఏదైనా డ్రైవర్ యాక్సిడెంట్ చేసిన తరువాత తప్పించు కుంటే అట్టి డ్రైవర్‌కు 10 సంవత్సరాలు జైలు, ఏడు లక్షల జరిమానా విధానాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. ఈ ధర్నాలో తెలంగాణ స్టేట్ ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ ఉపాధ్యక్షులు హబీబ్, శంకర్, మినిగూడ్స్ వెహికిల్ యూనియన్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, జహంగీర్, మనోజ్ ఆటో యూనియన్ నాయకులు పెంటయ్య, నంద కిషోర్, కిషన్, రాములు, మహేష్ రంగ తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర సందర్భంగా ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా ఆమె నివాసములో కలిసి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నూనెముంతల రవీంద్ర గౌడ్, శేఖర్ చారి, రూరల్ మండలాల యువజన నాయకుడు నీరజ్ గౌడ్యు వజన నాయకులు అర్జున్, అజయ్ కుమార్, సత్య నారా యణ గౌడ్, వెంకటేష్ తదితరులు

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఉప ముఖ్యమంత్రి విక్రమార్కకు శుభాకాంక్షలు..

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



రాష్ట్ర ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన జేఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ అదనపు కమిషనర్ కూరాకుల జ్యోతి, నాచారం గుట్ట దేవాలయ ఈ.వో. అసిస్టెంట్ కమిషనర్ అన్న పూర్ణ, జేఏసీ అధ్యక్షుడు కాండూరి కృష్ణ మాచారి, అర్చక అధ్యక్షులు చింతపట్ల బద్రీనాథ్, పరాశరం రవీంద్ర చారి, చంద్రశేఖర్ శర్మ, గ్రేటర్ అధ్యక్షులు బండారి జగపతి, సురే ష్, గణేష్ చింతపట్ల రంగాచార్యులు శ్రీకాంత్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి దృష్టికి గత ప్రభుత్వంలో పెండింగ్ ఉన్న సమస్యలను దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించాలని కోరారు.

'మాగ్నెట్స్ ఇన్‌ఫ్రా అండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో పేదలకు అల్పాహారం వితరణ'

నవతెలంగాణ-హిమాయత్ నగర్



మాగ్నెట్స్ ఇన్‌ఫ్రా అండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో పేదలకు ప్రతి రోజు బ్రేక్ ఫాస్ట్ వితరణ సేవ నేటితో 2,250 రోజులు పూర్తి చేసుకుంది. గత ఆరు సంవత్సరాల నుంచి నిరవధికంగా ప్రతి రోజు ఉదయం 7:30 నుండి 8:30 గంటల మధ్యలో నిలోఫర్ ఆసుపత్రి వద్ద పేదలకు బ్రేక్ ఫాస్ట్ ఉచిత వితరణ ఉంటుందని ఆ సంస్థ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ సుభాన్, జనరల్ మేనేజర్ ఎస్.శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చలికాలం దృష్టిలో ఉంచు కొని పేదలకు దుప్పట్లు సైతం ఉచితంగా పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. తాము 6 ఏళ్లుగా ఒక్కరోజు కూడా తప్ప కుండా నిరంతరం ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.కరోనా కష్ట కాలంలో సైతం తాము నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించామని వారు పేర్కొన్నారు.

'లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు లోక్ దళ్ పార్టీ మద్దతు'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు భారత లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వర రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా కాకుండా రాష్ట్రంలోని 17 లోక్ సభ స్థానాల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, ప్రజలు ఏలాంటి ఇబ్బందులకు గురి కాకుండా చూడాలని కోరారు. బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను దృష్టిలో పెట్టుకుని లోక్ సభ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రాము, శివ, అయోధ్య, శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్

జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే సామాజిక విప్లవాన్ని నాడు సృష్టించారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ జన జాగృతి అధ్యక్షులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కేంద్ర పర్యటక సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణంకృష్ణమోహన్ రావు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి. హనుమంతరావు, బీసీ నాయకులు బేక్యం వెంకట్ ఎం ఎస్ నరహరి, బీసీ మహిళా నాయకురాలు నాగ పరిమిళ పాతకోటి ఉమ, పల్లవి, కత్తుల సుదర్శన్ హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాటాడుతూ సాంఘిక దురాచారాలకు వ్యతి రేకంగా జ్యోతిరావు పూలేతో పాటు సావిత్రిబాయి పూలే విశేషంగా కృషి చేశారని ఆయన కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు వి. హనుమంతరావు మాట్లాడుతూ చదువుల తల్లిగా పేరుగాంచిన సావిత్రిబాయి పూలే పేరున యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఐలయ్య, అంచిన రమేష్, పాత కట్ల మహేష్, నరహరి, నాయకులు పాల్గొన్నారు



నవతెలంగాణ-అంబర్‌పేట:

భారతదేశ చరిత్రలో సావిత్రిబాయి పూలేకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర పర్యాటక సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ నగర కార్యాలయంలో సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గౌతమ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహిం చిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బ్రిటీష్ వారి కాలంలో దేశంలో అనేక మార్పులు తెచ్చేందుకు సావిత్రి బాయి పూలే చేసిన సేవలు మారువలేనివని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎస్. గౌతమ్ రావు మాట్లాడుతూ దేశంలోని మహిళలు విద్యారంగంలో రాణించేందుకు సావిత్రిబాయి పూలే విశేషమైన కృషి చేశారని గౌతమ్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ కార్పొరేటర్ ఆడప చంద్రమౌళి సీనియర్ నాయకులు గంధ మాల ఆనంద్ గౌడ్, నంద కిశోర్, కృష్ణగౌడ్, అనంత లక్ష్మి, శ్యామ్ రాజ్, అచ్చిని రమేష్, గోవర్ధన్ రెడ్డి, రామ చందర్ గుప్తా, మనోజ్ యాదవ్, సురేష్ నాయకులు పాల్గొన్నారు.

ఊదలతో నోరూరేలా...

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే ఆలోచన రోజురోజుకూ అందరిలో పెరిగిపోతోంది. అందుకే తీసుకునే ఆహారంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో మాదిరిగా ఏది పడితే అది తినకుండా సాధ్యమైనంత వరకు మంచి ఆహారంపై దృష్టి పెడుతున్నారు. అందులో తృణధాన్యాలకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే వీటిని తినడానికి అందరూ అంతగా ఇష్టపడరు. అందుకే కాస్త వెరైటీగా చేసుకుంటే చూసేందుకు, తినేందుకు కూడా బాగుంటుంది. ఊదలతో చేసే అలాంటి కొన్ని వెరైటీ రుచులను తెలుసుకుందాం...



ఉప్మా

కావాల్సిన పదార్థాలు : ఊదలు - కప్పు, తరిగిన పచ్చి మిర్చి - ఐదు, నెయ్యి - చెంచా, కరివేపాకు పొడి - చెంచా, ఉప్పు - తగినంత, కూరగాయ ముక్కలు - ఒక కప్పు (క్యారట్, బీన్స్, క్యాలీఫ్లవర్, పచ్చి బఠాణీ అన్నీ కలిపి), జీలకర్ర - చెంచా, నీళ్లు - అర కప్పు, ఇంగువ - పావు చెంచా, కొత్తిమీర - తగినంత.



తయారు చేసే విధానం : ఊదలను శుభ్రంగా కడిగి తగినన్ని నీళ్లు పోసి సుమారు గంట సేపు నానబెట్టాలి. స్టౌ మీద కుక్కర్‌లో నెయ్యి వేసి పూర్తిగా కరిగిన తర్వాత జీలకర్ర, ఇంగువ వేసి వేయించాలి. కూరగాయ ముక్కలు, తరిగిన పచ్చిమిర్చి జత చేసి మరోమారు కలియబెట్టాలి. కరివేపాకు పొడి వేసి బాగా కలపాలి. ఊదలలో నీటిని ఒంపేసి, మరుగుతున్న నీళ్లలో ఊదలు, ఉప్పు వేసి బాగా కలిపి మూత ఉంచాలి. రెండు విజిల్స్ వచ్చాక దింపేయాలి. మూత తీశాక కొద్దిగా నెయ్యి, కొత్తిమీర వేసి వేడివేడిగా తినాలి.

ఊదల కట్‌లెట్

కావాల్సిన పదార్థాలు : ఊదల పిండి - కప్పు, బఠాణీ - పావు కప్పు, ధనియాల పొడి - చెంచా, కంద ముక్కలు - పావు కప్పు, అల్లం వెల్లుల్లి ముద్ద - రెండు చెంచాలు, జీలకర్ర పొడి - చెంచా, కారం - అర చెంచా, మిరియాల పొడి - అర చెంచా, జీడి పప్పు పలుకులు - పది, కొత్తిమీర తరుగు - రెండు చెంచాలు, వాము - చెంచా, ఉప్పు - తగినంత, నువ్వుల పొడి - రెండు చెంచాలు, నెయ్యి - తగినంత, నిమ్మ రసం - చెంచా.

తయారు చేసే విధానం : కంద ముక్కలు, బఠాణీలను విడివిడిగా ఉడికించి, చేతితో మెత్తగా చిదిమి పక్కన ఉంచాలి. స్టౌ మీద కడాయిలో నెయ్యి కాగాక ఊదల పిండి వేసి దోరగా వేయించి చల్లారనివ్వాలి. ఒక గిన్నెలో ఊదల పిండి, మెత్తగా మెదిపిన కంద, బఠాణీ ముద్ద వేసి చపాతీ పిండిలా కలుపుకోవాలి. కలుపుతున్నప్పుడే అల్లం వెల్లుల్లి ముద్ద, కారం, మిరియాల పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి, వాము, కొత్తిమీర తరుగు, ఉప్పు, నిమ్మ రసం ఒకదాని తరవాత ఒకటి వేసి కలుపుకోవాలి. ఈ పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని, కట్‌లెట్‌లాగ ఒత్తి, నువ్వుల పొడిలో ముంచి పక్కన ఉంచాలి. స్టౌ మీద పెనం ఉంచి వేడయ్యాక, నూనె వేసి కాగాక తయారుచేసి ఉంచుకున్న కట్‌లెట్‌లను పెనం మీద వేసి రెండు వైపులా దోరగా కాల్చుకోవాలి. జీడి పప్పులతో అలంకరించి



ఊదల పిజ్జా

కావాల్సిన పదార్థాలు : ఊదలు - అర కప్పు, నెయ్యి/ నూనె - రెండు చెంచాలు, గోధుమ పిండి - అర కప్పు, ఉల్లి తరుగు, క్యాప్సికమ్ తరుగు, టమాటా ముక్కలు, మష్రూమ్ తరుగు - అర కప్పు, బేకింగ్ పౌడర్ - అర చెంచా, టమాటా సాస్ - పావు కప్పు, మొజెల్లా చీజ్ - తగినంత, స్వీట్ కార్న్ గింజలు - చెంచా, ఉప్పు - తగినంత.



తయారు చేసే విధానం : ఊదలను శుభ్రంగా కడిగి, తగినన్ని నీళ్లు జత చేసి సుమారు రెండు గంటలసేపు నానబెట్టాక, నీళ్లు ఒంపేయాలి. వీటిని గ్రైండర్‌లో వేసి మెత్తటి పిండిలా రుబ్బి, ఒక గిన్నెలోకి తీసుకోవాలి. గోధుమ పిండి, ఉప్పు, బేకింగ్ సోడా జత చేసి బాగా కలిపి సుమారు ఆరు గంటల పాటు పులియ బెట్టాలి. స్టౌ మీద పాన్ పెట్టి వేడి చేయాలి. కొద్దిగా నూనె వేసి కాగాక, పులియబెట్టిన పిండిని ఒక గరిటెడు తీసుకుని పెనం మీద వేసి రెండు వైపులా కాలిస్తే, పిజ్జా బేస్ సిద్ధమైనట్లే. 180 డిగ్రీల ఉష్ణోగ్రత దగ్గర ఓవెన్‌ను ఐదు నిమిషాల పాటు వేడి చేయాలి. బేకింగ్ ట్రేలో అల్యూమినియం ఫాయిల్ పేపర్ వేసి, తయారు చేసి ఉంచుకున్న పిజ్జా బేస్‌ను ట్రేలో ఉంచాలి. టమాటా సాస్, మొజెల్లా చీజ్, టమాటో తరుగు, ఉల్లి తరుగు, క్యాప్సికమ్ తరుగు, మష్రూమ్ తరుగు, స్వీట్ కార్న్ గింజలు ఒక దాని మీద ఒకటి వేయాలి. సుమారు పది నిమిషాలు దీనిని బేక్ చేసి బయటకు తీయాలి. వేడివేడిగా తింటే రుచిగా ఉంటుంది..




ఊదల పుదీనా అన్నం

కావాల్సిన పదార్థాలు : ఊదలు - ఒక కప్పు, నెయ్యి లేదా నూనె - రెండు టీ స్పూన్లు, ఉల్లి తరుగు - పావు కప్పు, టమాటా ముక్కలు - అర కప్పు, నీళ్లు - రెండు కప్పులు, బిర్యానీ ఆకు - ఒకటి, కరివేపాకు - రెండు రెబ్బలు, ఉప్పు - తగినంత, తరిగిన పచ్చి మిర్చి - రెండు, క్యారట్ తరుగు - ఒక కప్పు, కొత్తిమీర - పావు కప్పు, పుదీనా - ఒక కప్పు, లవంగాలు - రెండు, అల్లం, వెల్లుల్లి తరుగు - అర చెంచా.

తయారు చేసే విధానం : ఊదలను శుభ్రంగా కడిగి తగినన్ని నీళ్లు జత చేసి సుమారు రెండు గంటల సేపు నానబెట్టి, నీళ్లు ఒంపేయాలి. స్టౌ మీద కుక్కర్‌లో ఊదలు, నీళ్లు, ఉప్పు, బిర్యానీ ఆకు వేసి కుక్కర్ మూత పెట్టాలి. మంటను కొద్దిగా తగ్గించి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. పుదీనా ఆకును శుభ్రంగా కడిగి, కొద్దిగా నీళ్లు జత చేసి మిక్సీలో వేసి మెత్తగా చేయాలి. స్టౌ మీద కడాయి పెట్టి అందులో నెయ్యి వేసి కరిగాక లవంగాలు, పచ్చిమిర్చి తరుగు, అల్లం తరుగు, వెల్లుల్లి తరుగు ఒకదాని తర్వాత ఒకటి వేసి దోరగా వేయించాలి. ఉల్లి తరుగు జత చేసి మరోమారు వేయించాలి. టమాటా ముక్కలు, క్యారట్ తరుగు, కరివేపాకు వేసి పచ్చి వాసన పోయేవరకు వేయించాలి. పుదీనా ముద్ద వేసి బాగా కలిపి, కొద్దిసేపు ఉడికించాలి. చివరగా ఉప్పు వేసి కలియబెట్టి దింపేయాలి. ఒక పెద్ద పాత్రలో ఉడికించిన ఊదలు, వేయించి ఉంచుకున్న పుదీనా మిశ్రమం వేసి బాగా కలియబెట్టాలి. కొత్తిమీరతో అలంకరించాలి. రైతాతో వడ్డిస్తే చాలా రుచిగా ఉంటుంది.

చర్మం, జుట్టు సమస్యలకు చెక్

మన దేశంలో సీతాఫలం విరివిగా దొరికే అద్భుతమైన, రుచికరమైన పండు... అందులోనూ ప్రస్తుత చలికాలంలో ఇది సీజనల్ ఫ్రూట్ కూడానూ.. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ సి, ప్రొటీన్లు, పొటాషియం, ఫైబర్‌తో పాటు ఇతర పోషకాలు ఉంటాయి. ఈ పండు శరీరంలో రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. సీతాఫలం జీర్ణక్రియ, కంటి, గుండె ఆరోగ్యానికి అవసరం. అంతే కాకుండా సీతాఫలం ఆకుల్లో అనేక పోషకాలు కూడా ఉన్నాయి. ఇందులోని పోషకాలు చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉండేందుకు సహకరిస్తాయి. ఈ ఆకులలో విటమిన్ ఎ, సి వంటి యాంటీఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు అకాల వృద్ధాప్యాన్ని నివారిస్తాయి. ఇది ఫేషియల్ లైన్స్ తగ్గించడంలో, స్కాల్ప్ ఆరోగ్యంగా ఉంచడంలో కూడా సహాయపడుతుంది. అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం...





ఆకుల ప్రయోజనాలు :

- యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి
- సీతాఫలం ఆకుల్లో సహజసిద్ధమైన క్లెన్సింగ్ గుణాలు ఉన్నాయి.

ఆకులతో తయారు చేసుకునే ప్యాక్ చర్మం నుండి మురికి, అదనపు నూనెను తొలగించడంలో సహాయపడుతుంది.

- ఆకుల పేస్ట్ లేదా లిక్విడ్ వాటర్ కూడా చర్మాన్ని రిఫ్రెష్ చేయడానికి సహాయపడుతుంది.
- చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది.
- ఈ కాలంలో చర్మం పొడిబారిపోయి ఉంటుంది. దీన్ని హైడ్రేట్ చేయడానికి సీతాఫలం ఆకులను ఉపయోగించవచ్చు. అంతేకాదు చర్మాన్ని మెరిసేలా చేస్తుంది.
- జుట్టు పెరుగుదలకు సీతాఫలం ఆకుల హెయిర్ ప్యాక్ వేసుకుంటే, జుట్టుకు లోతైన పోషణను అందిస్తుంది.
- ఈ ఆకులు హెయిర్ ఫోలికల్స్‌ను బలోపేతం చేయడంతోపాటు స్కాల్ప్‌ను హెల్తీగా మార్చేందుకు ఉపయోగపడతాయి.
- ఇది జుట్టు పెరుగుదలను మెరుగుపరుస్తుంది. చుండ్రు నివారిస్తుంది.
- సీతాఫలం ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు స్కాల్ప్ ఇన్ఫెక్షన్‌ను తొలగించడంలో సహాయపడుతుంది. తద్వారా జుట్టు మూలాలు బలంగా తయారవుతాయి.
- జుట్టుకు సహజ నూనెలు అందుతాయి. దీన్ని రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల చుండ్రు తగ్గడం ప్రారంభమవుతుంది.

చర్మానికి సీతాఫలం ప్యాక్

సీతాఫలం ఆకులను రుబ్బుకోవాలి. ఈ పేస్ట్‌ను ఒక గిన్నెలోకి తీసుకుని చెంచా రోజ్ వాటర్ కలపండి. అందులోనే అలోవెరా జెల్‌ని మిక్స్ చేసి చర్మంపై 15 నుంచి 20 నిమిషాల పాటు అప్లై చేయాలి. ప్యాక్ ఆరిపోయాక గోరువెచ్చని నీటితో కడగాలి.

హెయిర్ మాస్క్

సీతాఫలం ఆకులను రుబ్బుకోవాలి. దానికి ఒక చెంచా పెరుగు కలపాలి. ఒక నిమ్మకాయ రసం ఈ పేస్టుకు యాడ్ చేసుకోవాలి. ఈ పేస్ట్‌ని బాగా మిక్స్ చేసి జుట్టుకు పట్టించాలి. దీనిని జుట్టుపై సుమారు 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తర్వాత జుట్టును నీటితో కడిగేయాలి.

ఆరోగ్య చిట్కా

మలబద్ధకాన్ని నివారించడంలో బెండకాయ ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఒక కప్పు బెండకాయల్లో 82 మి.గ్రా. కాల్షియం అందుతుంది. అలాగే ఇందులో బి6, ఫొలేట్ వంటివి లభిస్తాయి.



లోటుపాట్లను సరిదిద్దుకోవాల్సింది..



(మొదటిపేజీ తరువాయి)

సన్నాహక సమావేశాలు బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ప్రారంభమయ్యాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎంపీ స్థానం నుంచి ఈ సమీక్షలను ప్రారంభించారు. ఉదయం 11 గంటలకు మొదలైన ఈ సమావేశం... సాయంత్రం 5 గంటల వరకూ కొనసాగింది.

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు జోగు రామన్న, వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులతో కేటీఆర్ మాట్లాడారు. ఆదిలాబాద్ నియోజకవర్గ సమావేశంలో మొత్తం 26 మంది మాట్లాడారనీ, వారందరూ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా తమ అభిప్రాయాలను వెల్లడించారని అన్నారు. మరో 176 మంది తమ అభిప్రాయాలను రాసిచ్చారని తెలిపారు. వాటన్నింటినీ అధినేత కేసీఆర్‌కు అందజేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ఇంటికో ఉద్యోగమిస్తామని చెప్పి ఇవ్వలేదనే కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తాము అదే స్థాయిలో తాము తిప్పికొట్టలేకపోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశం మొత్తం మీద అత్యధిక ఉద్యోగాలు, అత్యధిక శాతం జీతాలు ఇచ్చింది తమ ప్రభుత్వమేనన్న విషయాన్నీ చెప్పుకోలేక పోయామని వాపోయారు. ఇలాంటి చిన్న చిన్న లోపాలను సవరించుకుంటే బాగుండేదనే అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైందన్నారు. స్థానికంగా ఎమ్మెల్యేల మీదున్న వ్యతిరేకత పార్టీని దెబ్బకొట్టిందని తెలిపారు. వారి మీద కోపంతోనే బీఆర్ఎస్ వ్యతిరేకంగా ఓటేశాం తప్ప, కేసీఆర్ మీద అభిమానం లేక కాదంటూ క్షేత్రస్థాయిలో ప్రజలు అనుకుంటున్నారనే విషయం తమ సమీక్షలో తేలిందని వివరించారు.

కాంగ్రెస్‌వి '420' అబద్ధాలు...

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మొత్తం 420 హామీలనిచ్చిందని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అవన్నీ అబద్ధాలంటూ కొట్టిపారేశారు. వాటిని పుస్తక రూపంలో తీసుకొచ్చామనీ, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలందరికీ పంచుతామని వివరించారు. తాను ఇచ్చిన వాగ్దానాలను వంద రోజుల్లో అమలు చేస్తానంటూ కాంగ్రెస్ హామీనిచ్చిందని గుర్తు చేశారు. అలా చేయకపోతే ప్రజలే ఆ పార్టీని బొందపెడతారని హెచ్చరించారు. రైతు బంధు డబ్బులు, వరికి బోనస్ ఏమయ్యాయంటూ ఇప్పటికే ప్రజలు నిలేస్తున్నారని హెచ్చరించారు. అధికారం కోసం కాంగ్రెస్ అలవిగాని విధంగా అడ్డగోలు హామీలను ఇచ్చిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన స్థాయిని మరిచి, బీఆర్ఎస్ పైనా, గత ప్రభుత్వంపైనా ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ నాయకుల ఆగడాలు కూడా మరీ ఎక్కువైపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు రాష్ట్ర విభజన హామీలు అమలు చేయని బీజేపీ కూడా తెలంగాణ పట్ల వివక్ష చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటులో ఏనాడైనా తెలంగాణ సమస్యలపై మాట్లాడారా..? అని ప్రశ్నించారు. ఆయా పార్టీలకు చెందిన తెలంగాణ ఎంపీలు హైకమాండ్ కూర్చోమంటే కూర్చోవాలి, నిలబడమంటే నిలబడాలంటూ ఎద్దేవా చేశారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాల్లో గెలవాలనీ, లేదంటే పార్లమెంటు నుంచి తెలంగాణ పదమే మాయమైపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటు స్థానాల వారీగా సన్నాహక సమావేశాలు పూర్తయ్యాక (ఈనెల 22 తర్వాత) తమ తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. పార్లమెంటు స్థానాలతోపాటు జిల్లాలు, మండలాలు, గ్రామ స్థాయిలో ఇలాంటి సమావేశాలను నిర్వహించటం ద్వారా క్యాడర్‌ను కార్యోన్ముఖులను చేస్తామని తెలిపారు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో సైతం ఇదే రకమైన విధానాన్ని అనుసరిస్తామని కేటీఆర్ తెలిపారు.

ప్రజా పోరాటాలకు మరో విజయం

(మొదటిపేజీ తరువాయి)

నిరసనలు, ఆందోళనలు చెలరేగిన విషయం తెలిసిందే. అస్సాంలో మొదలైన నిరసనలు క్రమేపీ ఉధృతమై ఢిల్లీ, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, త్రిపురను తాకాయి. ఆ తర్వాత దాదాపు అన్ని రాష్ట్రాలకు విస్తరించాయి. వేలాది మంది ఆందోళనకారులు అరెస్టయ్యారు. పోలీసు చర్యలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. నిరసనలపై నిషేధం కూడా విధించారు.

ఆ ఆందోళన చారిత్రాత్మకం

రెండు సంవత్సరాల క్రితం మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలను నిరసిస్తూ జరిగిన ఆందోళన చారిత్రాత్మకమైనది. ఈ చీకటి చట్టాలు రైతులను నిట్టనిలువునా చీల్చాయి. వ్యవసాయ సంస్కరణలకు మద్దతు తెలిపే వారు కూడా ఈ ఉద్యమానికి బాసటగా నిలిచారు. దేశంలోనే కాదు...ప్రపంచంలోనూ సుదీర్ఘకాలం శాంతియుతంగా నడిచిన ఉద్యమాలలో ఇది ఒకటిగా నిలిచింది. మొక్కవోని అన్నదాతల దీక్ష, పట్టుదలకు ప్రభుత్వం తలవంచింది. వివాదాస్పద చట్టాలను ఉపసంహరించుకుంది. రైతుల ఆందోళన రాజకీయ పార్టీలకు ఓ పాఠం నేర్పిందని చెప్పాలి.

ఆ సమయంలో పంజాబ్‌లోని పలు గ్రామాల ప్రజలు వాణిజ్యీకరణ, ప్రైవేటీకరణ వెనుక ఉన్న సంస్థల వస్తువులను బహిష్కరించడం మొదలుపెట్టారు. ముకేష్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు చెందిన పెట్రోల్, మొబైల్ నెట్‌వర్క్ సేవలను వద్దు పొమ్మన్నారు. అన్నదాతల ఆందోళనలో చోటుచేసుకున్న మరో ముఖ్యమైన పరిణామం ఏమిటంటే యువత, మహిళలు సహా పలు సమూహాలకు చెందిన ప్రజలు అందులో భాగస్వాములు కావడం. ముఖ్యంగా రైతు ఉద్యమాన్ని పర్యవేక్షించడంలో యువత కీలక పాత్ర పోషించింది. గుర్తింపు కార్డులు ఉన్న వారినే ఆందోళన జరిగే ప్రాంతంలోకి అనుమతించడం, మహిళా శిబిరాల వెలుపల రక్షకులుగా నిలబడడం వంటి విధులు నిర్వర్తించారు. సామాజిక మాధ్యమాలను సమన్వయ పరచడంలో కూడా యువత పాత్ర ప్రశంసనీయం.

వేదికలపై వక్తలు చేసే ప్రసంగాలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల ద్వారా దేశ ప్రజలందరూ వినేలా ఏర్పాట్లు చేశారు. మహిళలు ట్రాక్టర్లు నడుపుతూ, వంటశాలల్లో గరిటె తిప్పుతూ, వేదికలపై ఉపన్యాసాలు ఇస్తూ బహుముఖ పాత్ర పోషించారు. ఇంటి యజమాని ఎక్కడో దూరంగా నిరసనలో పాలుపంచుకుంటుంటే మహిళలు, చివరికి చిన్నారుల కూడా కుటుంబ బాధ్యతలు నిర్వర్తించారు.

సత్యాగ్రహాన్ని గుర్తుకు తెస్తూ...

వీధుల్లో ప్రారంభమైన చిన్న చిన్న పోరాటాలు సామాజిక, రాజకీయ ఉద్యమాలుగా రూపు తీసుకోవడం విశేషం. ఇవన్నీ స్వాతంత్రోద్యమ కాలం నాటి సత్యాగ్రహ స్ఫూర్తిని మరోసారి గుర్తుకు తెస్తున్నాయి. ఆ నాడు సహాయ నిరాకరణ ఉద్యమం సందర్భంగా దేశ నాయకులు ప్రజలను సత్యాగ్రహ పద్ధతిలోనే సమీకరించారు. విదేశీ వస్తు బహిష్కరణ, దుకాణాల ముందు పికెటింగుల ద్వారా బ్రిటీష్ పాలకులపై రాజకీయ, ఆర్థిక ఒత్తిడి తెచ్చారు.

సామాజిక ఉద్యమాలే స్ఫూర్తిగా...

వీధి పోరాటాల నుండి నేటి రాజకీయ నాయకులు నేర్చుకోవాల్సిన పాఠాలు చాలానే ఉన్నాయి. ప్రజల భాగస్వామ్యంతో నడిచే సామూహిక సామాజిక ఉద్యమాలు నిరంకుశ పాలకులను ఎలా ప్రతిఘటించగలవో ఆ పార్టీలు గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రతిపక్ష పార్టీలు బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించడం ద్వారా మాత్రమే నిరంకుశ పాలక పక్షాలను ఎదుర్కోగలవనే వాస్తవాన్ని ఈ ప్రజా ఉద్యమాలన్నీ రాజకీయ పార్టీలకు గుర్తు చేస్తున్నాయి.

మళ్లీ తెరపైకి తెలంగాణ అస్తిత్వం..

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్-ఇప్పుడు బీఆర్ఎస్) ఆవిర్భవించింది. అయితే ఏడాది క్రితం దాని పేరును అధినేత కేసీఆర్... భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చారు. తమది జాతీయ పార్టీ అంటూ ఆయన ఆ సందర్భంలో ప్రకటించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్‌ను తీర్చిదిద్దుతామని వెల్లడించారు. అందుకనుగుణంగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు రాష్ట్రాల్లో విభాగాలను కూడా ఏర్పాటు చేశారు. జాతీయ స్థాయి రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తామంటూ కేరళ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో పర్యటించారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులను, ప్రతిపక్ష నేతలను కలిసొచ్చారు. దేశవ్యాప్తంగా రైతులందరూ బాగుపడాలని కోరుతూ 'అన్నదాతల సమస్యలే తమ ప్రధాన అజెండా...' అని చెబుతూ వచ్చారు. ఈ క్రమంలో మహారాష్ట్రలో పలుమార్లు పర్యటించిన ఆయన అక్కడ రెండు మూడు బహిరంగ సభలను కూడా నిర్వహించిన సంగతి తెలిసిందే. అంతకుముందు 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 'ఫెడరల్ ఫ్రంట్' అనే అంశాన్ని కేసీఆర్ తెరమీదికి తెచ్చిన సంగతీ విదితమే. అయితే అది ఎంత స్పీడుగా తెరమీదికి వచ్చిందో, అంతే స్పీడుగా తెరమరుగు కావటం గమనార్హం.

ఈ రకంగా ఫెడరల్ ఫ్రంట్, బీఆర్ఎస్ అనే పేర్లతో జాతీయ స్థాయి రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తామంటూ చెబుతూ వచ్చిన గులాబీ పార్టీ.. ఇప్పుడు మళ్లీ అస్తిత్వ వాదాన్ని ముందుకు తేవటంపై చర్చోపచర్చలు కొనసాగుతున్నాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన నేపథ్యంలో ఇప్పటికిప్పుడు చెప్పుకోవటానికి ఏమీ ఉండదు కాబట్టే... ఆ వాదాన్ని మళ్లీ తెరపైకి తెస్తున్నారనే వాదనలు వినబడుతున్నాయి. మరోవైపు రాష్ట్రంలో బీజేపీపై విమర్శలకు వెనుకాడని కారు పార్టీ...మోడీ ప్రభుత్వం తీసుకున్న పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, ఆర్టికల్ 370 రద్దు తదితరాంశాల్లో మద్దతు తెలిపింది. ఈ నేపథ్యంలో విధానపరంగా ఆ పార్టీ అనేక సమయాల్లో తీసుకున్న వైఖరులపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు కూడా మరోసారి అస్తిత్వ వాదాన్ని పైకి తీసుకురావటంపై పలువురు అదేరకంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

కార్మికుల వీరోచిత పోరాటానికి అభినందనలు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా రోడ్డు రవాణా కార్మికుల పోరాటానికి ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) అభినందనలు తెలిపింది. ఐపీసీ స్థానంలో మోడీ సర్కారు తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023లోని దారుణమైన నిబంధనకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన రోడ్డు రవాణా కార్మికులను అభినందించింది. రోడ్డు రవాణా కార్మికులు ఒకే స్వరంతో జాతీయ స్థాయిలో ఒత్తిడి పెంచినందున, ప్రభుత్వం దిగిరావాల్సి వచ్చిందని పేర్కొన్నది. ఈ మేరకు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య ఒక ప్రకటనను విడుదల చేశారు. కఠిన నిబంధనలను అమలు చేసే ముందు ప్రభుత్వం అసోసియేషన్‌తో చర్చిస్తుందని హామీ ఇచ్చినట్టు మీడియాలో వార్తలు వచ్చాయనీ, ఇది రవాణా కార్మికుల ఐక్యత, పోరాట బలాన్ని ప్రదర్శించిందని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ స్పష్టం చేసింది. అయితే పార్లమెంట్‌లో కఠిన నిబంధనను ఉపసంహరించుకుని ప్రభుత్వం బీఎన్ఎస్ చట్టాన్ని సవరించే వరకు తలపై కత్తి వేలాడుతూనే ఉంటుందని ఫెడరేషన్ హెచ్చరించింది. రోడ్డు రవాణా కార్మికులు అప్రమత్తంగా ఉండాలనీ, గతంలో రైతులకు ద్రోహం చేసినందున ప్రభుత్వం తన వాగ్దానాల నుంచి వెనక్కి వెళ్తే ఏ సమయంలోనైనా పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి చేసింది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ రంగ వ్యతిరేక విధానాలతో రోడ్డు రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. క్రూడాయిల్ ధరలు 2014 కంటే తక్కువగా ఉన్నప్పుడు కూడా పెట్రోలు, డీజిల్ అసాధారణంగా పెరగడం, ఇన్సూరెన్స్ ప్రీమియం భారీ పెంపుదల, టోల్ ట్యాక్స్, ఎం.వీ యాక్ట్ సవరణ, వెహికిల్ స్క్రాపింగ్ విధానం వంటి భారీ భారం పరిశ్రమతో పాటు కార్మికులను ఇప్పటికే నాశనం చేశాయని వివరించింది. ఇది చిరు యజమానులకు పెద్ద దెబ్బ అనీ, ఈ విధానాలను తిరిగి మార్చే వరకు, రోడ్డు రవాణా రంగం మనుగడ సాగించదని ఫెడరేషన్ పేర్కొన్నది. రోడ్డు రవాణా కార్మికులు, ముఖ్యంగా అసంఘటిత రోడ్డు రవాణాలో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా ఉన్నదనీ, వారు అనారోగ్యంతో ఆస్పత్రులపాలవుతున్నారని వివరించింది. వారు ఎలాంటి కార్మిక చట్టం కింద కానీ, ఉద్యోగ, సామాజిక భద్రత కిందకు కానీ రారని ఫెడరేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. జాతీయ బ్యాంకులు, ప్రభుత్వం కొత్త వాహనాల కొనుగోలుకు, ఎలక్ట్రిక్ వాహనాలకు మారటానికి ఆర్థిక సహాయాన్ని (రుణాలు) అందించడం లేదని పేర్కొన్నది.

పైన పేర్కొన్న అన్ని సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలని ఫెడరేషన్ అందరికీ విజ్ఞప్తి చేసింది. రోడ్డు రవాణా రంగంలో పనిచేస్తున్న అన్ని ట్రేడ్ యూనియన్లు, ఆపరేటర్స్ అసోసియేషన్లు పరిశ్రమను, కార్మికుల సంక్షేమాన్ని రక్షించడానికి ఒక ఉమ్మడి వేదికపైకి రావాలని ప్రతిపాదించింది.

ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంపై ఎగసిపడిన జనాగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

నిప్పంటించారు. ఈ క్రమంలో పోలీసులు అక్కడి చేరుకొని ఆందోళనకారులపై లాఠీచార్జి చేశారు.

దిలావర్‌పూర్ బంద్‌కు పిలుపు

లాఠీచార్జిని నిరసిస్తూ రైతులు గురువారం దిలావర్‌పూర్ బంద్‌కు పిలుపునిచ్చారు. ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని, పోరాటం మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు ప్రకటించారు. ప్రభుత్వం దిగొచ్చి ఫ్యాక్టరీ పనులు నిలిపే వరకు ప్రతిరోజూ నిరసన కార్యక్రమాలు చేపడతామని ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు తెలిపారు. గ్రామ వీధుల్లో ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. గురువారం బంద్‌లో దుకాణ సముదాయాలు, వ్యాపార కార్యకలాపాలు స్వచ్ఛంధంగా నిలిపివేసేందుకు కార్యాచరణ చేశారు. బస్టాండ్ సమీపంలోని చర్చి పక్కన వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామ ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు కోరారు.

మోడీ సెల్ఫీ ఖర్చు చెప్పాడని బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

పంపింది. ఆర్‌టీఐ కింద కోరే సమాచారానికి సమాధానం ఇచ్చే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలంటూ అందులో సుద్దులు చెప్పింది.

ఆయా డివిజన్లలో ఏర్పాటు చేసిన 3డీ బూత్‌ల సంఖ్యపై తనకు విడివిడిగా సమాధానాలు వచ్చాయని, అయితే తాత్కాలిక, శాశ్వత బూత్‌ల ఏర్పాటుకు ఎంత ఖర్చు చేశారో మాత్రం ఎవరూ వివరించలేదని సామాజిక కార్యకర్త బోస్ తెలిపారు. కేవలం సెంట్రల్ రైల్వే నుండి మాత్రమే తనకు సవివరమైన సమాధానం అందిందని చెప్పారు. నాగపూర్, ముంబయి, పూనే, భుసావల్, షోలాపూర్... ఈ ఐదు డివిజన్లలోని 30 స్టేషన్లలో తాత్కాలిక, 20 స్టేషన్లలో శాశ్వత సెల్ఫీ బూత్‌లు ఏర్పాటు చేశారని తనకు సమాధానం ఇచ్చారని వివరించారు. కేటగిరీ 'ఏ' స్టేషన్లలో ఒక్కో తాత్కాలిక బూత్ ఏర్పాటుకు రూ.1.25 లక్షలు, కేటగిరీ 'సీ' స్టేషన్లలో ఒక్కో శాశ్వత బూత్ ఏర్పాటుకు రూ.6.25 లక్షలు (పన్నులు మినహా) ఖర్చు చేసేందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అనుమతి లభించింది. తనకు డిప్యూటీ జనరల్ మేనేజర్ అభయ్ మిశ్రా సమాధానం పంపారని, అయితే సీపీఆర్‌ఓపై వేటు వేశారని బోస్ చెప్పారు. శివరాజ్ గతంలో భుసావల్‌లో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా పనిచేశారు. రైల్వే ఆదాయాన్ని పెంచినందుకు, టిక్కెట్ లేకుండా ప్రయాణించే వారి విషయంలో కఠినంగా వ్యవహరించినందుకు, దొంగతనాలను అరికట్టినందుకు ఆయనకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అవార్డు కూడా అందజేశారు. రైల్వేలు మెరుగైన పద్ధతులు అవలంబించిందుకు ఆయనకు పురస్కారాన్ని కూడా అందించారు.

శివరాజ్ బదిలీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఘాటుగా స్పందించారు. మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులను విడుదల చేయడం లేదని, దానికి బదులుగా ప్రధానికి ప్రాచుర్యం కల్పించేందుకు పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఖర్చు చేస్తోందని విమర్శించారు. 'గతంలో సాయుధ దళాల త్యాగాలను సైతం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారు. మోడీ కటౌట్లతో 822 సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని సైనిక దళాలను ఆదేశించారు. కరువు, వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న రాష్ట్రాలకు కేంద్రం సొమ్ము విదల్చడం లేదు. ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలకు ఉపాధి హామీ నిధులు విడుదల చేయడం లేదు.

ఇరాన్‌లో జంట పేలుళ్ళు

(మొదటిపేజీ తరువాయి)

గాయపడ్డారని ఇరాన్ ప్రభుత్వ టివి తెలిపింది. సైనిక ఉన్నతాధికారి సోలెమని నాలుగవ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వేలాదిమంది అభిమానులు పాల్గొన్నట్టు టీవీ విజువల్స్‌లో తెలుస్తోంది. పేలుళ్ళు జరిగిన వెంటనే అక్కడంతా గందరగోళం నెలకొంది. ఇది తీవ్రవాద దాడులా లేక మరేదైనా కారణమా అనేది ఇంకా స్పష్టం కాలేదని స్థానిక అధికారి ఒకరు తెలిపారు. సౌత్ సెంట్రల్ నగరమైన కెర్మన్‌లో 15నిముషాల వ్యవధిలో ఈ పేలుళ్ల సంభవించాయి. 2020 జనవరి 3న బాగ్దాద్ విమానాశ్రయానికి వెలుపల అమెరికా జరిపిన డ్రోన్ దాడిలో ఖాసిం సోలెమని మరణించారు. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ విదేశీ కార్యకలాపాల విభాగమైన ఖుద్స్ ఫోర్స్‌కు ఆయన నాయకత్వం వహించారు.

తొలిరోజే 23 వికెట్లు

● కేప్‌టౌన్‌లో పేసర్ల ప్రతాపం ● తొలి ఇన్నింగ్స్‌లో సఫారీ 55/10
● రెండో ఇన్నింగ్స్‌లో.. 62/3 ● భారత్ తొలి ఇన్నింగ్స్ 153/10



23 వికెట్లు. భారత్, దక్షిణాఫ్రికా కేప్‌టౌన్ టెస్టులో తొలి రోజు కుప్పకూలిన వికెట్లు. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ (6/15) పంజా విసరగా.. ఆతిథ్య దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగులకే కుప్పకూలింది. ముకేశ్ కుమార్ (2/25) మెరువగా రెండో ఇన్నింగ్స్‌లో సఫారీ 62/3తో పోరాడుతోంది. కోహ్లి (46), రోహిత్ (39), గిల్ (36) రాణించటంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 153 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 98 పరుగుల విలువైన ఆధిక్యం దక్కించుకుంది. ప్రస్తుతం సఫారీ మరో 36 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది

నవతెలంగాణ-కేప్‌టౌన్ :

న్యూలాండ్స్‌లో భారత పేసర్లు పంజా విసిరారు. ఆతిథ్య సఫారీ బ్యాటర్లపై పేస్ నిప్పులు చెరిగారు. మహ్మద్ సిరాజ్ (6/15) మరోసారి అద్వితీయ వికెట్ల వేట సాగించాడు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగుల అత్యల్ప స్కోరుకు కుప్పకూలింది. 23.2 ఓవర్లలోనే సఫారీలు చేతులెత్తేశారు. భారత్‌పై ఓ జట్టుకు టెస్టుల్లో ఇదే అత్యల్ప స్కోరు. విరాట్ కోహ్లి (46, 59 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్ శర్మ (39, 50 బంతుల్లో 7 ఫోర్లు), శుభ్‌మన్ గిల్ (36, 55 బంతుల్లో 5 ఫోర్లు) రాణించటంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 153 పరుగులు చేసింది. ఓ దశలో 153/4తో భారీ స్కోరు దిశగా సాగిన టీమ్ ఇండియా.. చివరి ఆరు వికెట్లను 11 బంతుల వ్యవధిలో సున్నా పరుగులకే చేజార్చుకుంది. అయినా, తొలి ఇన్నింగ్స్‌లో 98 పరుగుల విలువైన భాగస్వామ్యం సొంతం చేసుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 62/3తో ఎదురీదుతోంది. మార్క్‌రామ్ (36 బ్యాటింగ్), డెవిడ్ (7 బ్యాటింగ్) అజేయంగా ఆడుతున్నారు. తొలి రోజు ఆటలోనే మూడు ఇన్నింగ్స్‌ల్లో 23 వికెట్లు పతనం కావటంతో.. నేడు మూడు సెషన్లలోపే కేప్‌టౌన్ టెస్టు ముగియవచ్చు!.

ప్రచండ సిరాజ్ : కీలక టాస్ ఓడిన భారత్ తొలుత బంతి అందుకుంది. కొత్త బంతితో విధ్వంసక ప్రదర్శన చేయటం అలవాటుగా మార్చుకున్న మహ్మద్ సిరాజ్.. న్యూలాండ్స్‌లో అది రిపీట్ చేశాడు. 9 ఓవర్ల స్పెల్‌లో 15 పరుగులకే 6 వికెట్లు నేలకూల్చాడు. బుమ్రా (2/25), ముకేశ్ (0/2) సైతం మెరవటంతో 23.2 ఓవర్లలో 55 పరుగులకే ఆలౌట్ అయ్యింది. డెవిడ్ (12), వెరెనె (15) మినహా సఫారీ తరఫున ఎవరూ రెండెంకల స్కోరు చేయలేదు. మార్క్‌రామ్ (2), ఎల్గర్ (4), టోనీ (2), స్టబ్స్ (3), జాన్సెన్ (0), మహరాజ్ (3), రబాడ (5), బర్గర్ (4) పేకమేడలా కూలారు. లంచ్‌లోపే సఫారీ తొలి ఇన్నింగ్స్‌కు తెరపడింది. టెస్టు క్రికెట్ చరిత్రలో దక్షిణాఫ్రికాకు ఇది రెండో అత్యల్ప స్కోరు.

ముగ్గురు మెరిసినా.. : తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం సాధించే అవకాశం భారత్ చేజార్చుకుంది. ఓపెనర్ యశస్వి (0) నిరాశపరిచినా.. రోహిత్ శర్మ (39), శుభ్‌మన్ గిల్ (36), విరాట్ కోహ్లి (46) రాణించారు. టాప్ ఆర్డర్‌లో ముగ్గురూ మెరవటంతో భారత్ భారీ స్కోరు దిశగా సాగింది. 153/4తో నిలిచిన భారత్.. మరో వంద పరుగులు సులువగా చేసేలా కనిపించింది. కానీ ఎంగిడి, రబాడ వరుస ఓవర్లలో ఆరు వికెట్లు కూల్చి సఫారీలను రేసులో నిలిపారు. రాహుల్ (8), జడేజా (0), బుమ్రా (0)లను ఎంగిడి అవుట్ చేయగా.. కోహ్లి, సిరాజ్ (0), ప్రసిద్ (0)లు రబాడ ఓవర్లో నిష్క్రమించారు. 11 బంతుల వ్యవధిలో ఒక్క పరుగూ జోడించకుండానే భారత్ చివరి ఆరు వికెట్లు కోల్పోయింది. భారత ఇన్నింగ్స్‌లో ఆరుగురు బ్యాటర్లు సున్నా పరుగులకే నిష్క్రమించారు. యశస్వి, అయ్యర్, జడేజా, బుమ్రా, సిరాజ్, ప్రసిద్‌లు డకౌట్‌గా అవుటయ్యారు.

ముకేశ్ జోరు : చివరి సెషన్లో ముకేశ్ కుమార్ (2/25) సత్తా చాటాడు. సఫారీ కెప్టెన్, వీడ్కోలు హీరో డీన్ ఎల్గర్ (12), టోనీ (1)లను వెనక్కి పంపించాడు. బుమ్రా ఓవర్లో స్టబ్స్ (1) నిష్క్రమించగా.. డెవిడ్ (7 నాటౌట్) జీవనదానం పొందాడు. ఓపెనర్ మార్క్‌రామ్ (36 నాటౌట్, 51 బంతుల్లో 6 ఫోర్లు) అజేయంగా ఆడుతున్నాడు. 17 ఓవర్లలో 62 పరుగులు చేసిన దక్షిణాఫ్రికా.. తొలి ఇన్నింగ్స్‌లో మరో 36 పరుగుల వెనుకంజలో నిలిచింది.



స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : మార్క్‌రామ్ (సి) యశస్వి (బి) సిరాజ్ 2, ఎల్గర్ (బి) సిరాజ్ 4, టోనీ (సి) రాహుల్ (బి) సిరాజ్ 2, స్టబ్స్ (సి) రోహిత్ (బి) బుమ్రా 3, డెవిడ్ (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 12, వెరెనె (సి) గిల్ (బి) సిరాజ్ 15, జాన్సెన్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 0, మహరాజ్ (సి) బుమ్రా (బి) ముకేశ్ 3, రబాడ (సి) శ్రేయస్ (బి) ముకేశ్ 5, బర్గర్ (సి) యశస్వి (బి) బుమ్రా 4, ఎంగిడి నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు :5, మొత్తం : (23.2 ఓవర్లలో ఆలౌట్) 55.

వికెట్ల పతనం : 1-5, 2-8, 3-11, 4-15, 5-34, 6-34, 7-45, 8-46, 9-55, 10-55.

బౌలింగ్ : బుమ్రా 8-1-25-2, సిరాజ్ 9-3-15-6, ప్రసిద్ 4-1-10-0, ముకేశ్ 2.2-2-0-2.

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి (బి) రబాడ 0, రోహిత్ (సి) జాన్సెన్ (బి) బర్గర్ 39, గిల్ (సి) జాన్సెన్ (బి) బర్గర్ 36, కోహ్లి (సి) మార్క్‌రామ్ (బి) రబాడ 46, శ్రేయస్ (సి) వెరెనె (బి) బర్గర్ 0, రాహుల్ (సి) వెరెనె (బి) ఎంగిడి 8, జడేజా (సి) జాన్సెన్ (బి) ఎంగిడి 0, సిరాజ్ రనౌట్ 0, ప్రసిద్ (సి) మార్క్‌రామ్ (బి) రబాడ 0, ముకేశ్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 24, మొత్తం : (34.5 ఓవర్లలో ఆలౌట్) 153.

వికెట్ల పతనం : 1-17, 2-72, 3-105, 4-110, 5-153, 6-153, 7-153, 8-153, 9-153, 10-153.

బౌలింగ్ : రబాడ 11.5-2-38-3, ఎంగిడి 6-1-30-3, బర్గర్ 8-2-42-3, జాన్సెన్ 9-2-29-0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ : మార్క్‌రామ్ బ్యాటింగ్ 36, ఎల్గర్ (సి) కోహ్లి (బి)ముకేశ్ 12, టోనీ (సి) రాహుల్ (బి) ముకేశ్ 1, స్టబ్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 1, డెవిడ్ నాటౌట్ 7, ఎక్స్‌ట్రాలు : 5, మొత్తం : (17 ఓవర్లలో 3 వికెట్లకు) 62.

వికెట్ల పతనం : 1-37, 2-41, 3-45.

బౌలింగ్ : బుమ్రా 6-0-25-1, సిరాజ్ 5-2-11-0, ముకేశ్ 6-2-25-2.



మన కంటిని మన వేలుతోనే!

● సాక్షి, వినేశ్, బజరంగ్‌పై జూనియర్లను ఎగదోసిన బ్రిజ్‌భూషణ్
● రెజ్లర్లకు వ్యతిరేకంగా, డబ్ల్యూఎఫ్‌ఐకి మద్దతుగా ఆందోళన



క్రీడా రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్.. ఊహించినట్టుగానే కుటిల రాజనీతి అమలు చేస్తున్నాడు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో విచారణ ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్.. అసలు కథను పక్కదారి పట్టించి కొత్త నాటకానికి తెరతీశాడు. న్యాయ పోరాటం చేసిన రెజ్లర్లకు వ్యతిరేకంగా, ఇటీవల సస్పెన్షన్‌కు గురైన డబ్ల్యూఎఫ్‌ఐ కార్యవర్గానికి అనుకూలంగా జూనియర్ రెజ్లర్ల ఆందోళ వెనుక బ్రిజ్‌భూషణే ఉన్నారని తెలుస్తోంది!.

నవతెలంగాణ-న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ వివాదం సరికొత్త మలుపు తీసుకుంది. లైంగిక ఆరోపణలు, నెలల తరబడి ఆందోళనలు, ఎన్నికల వాయిదా, యుడబ్ల్యూడబ్ల్యూ నుంచి నిషేధం, క్రీడాశాఖ నుంచి కార్యవర్గం సస్పెన్షన్ వరకు సాగిన కుస్తీ ఫైట్.. ఇప్పుడు రెజ్లింగ్ కుటుంబంలో అంతర్గత తగాదాకు దారితీసింది. బిజెపి ఎంపీ, డబ్ల్యూఎఫ్‌ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ లైంగిక ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడిన సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్, బజరంగ్ పూనియాలపై నయా కుతంత్రం మొదలుపెట్టారు. లైంగిక వేధింపులకు పాల్పడిన ఆఫీస్ బేరర్, అతడి సన్నిహితులను రెజ్లింగ్ ఫెడరేషన్‌కు దూరం చేయాలనే సంకల్పంతో వినేశ్, సాక్షి, బజరంగ్ న్యాయ పోరాటం చేయగా.. జూనియర్ రెజ్లర్లకు నష్టం జరిగిందనే సాకుతో ఆందోళనకు ఉసిగొల్పటం మల్లయోధుల వర్గాలను విస్మయానికి గురి చేసింది.

ఏడాదిగా నిలిచె.. : భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) రెగ్యులర్ కార్యకలాపాలు ఏడాదిగా నిలిచాయి. 2023 జనవరిలో బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక వేధింపుల కేసులో చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు ఆందోళనకు దిగారు. డబ్ల్యూఎఫ్‌ఐ కార్యవర్గాన్ని రద్దు చేసిన క్రీడాశాఖ.. అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు చేసింది. సాధారణ ఎన్నికల జాప్యంతో యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యూడబ్ల్యూ) భారత్‌పై వేటు వేసింది. న్యాయస్థానం జోక్యంతో డిసెంబర్ 21న ఎన్నికలు జరిగినా.. బ్రిజ్‌భూషణ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ పరిణామంతో సాక్షి మాలిక్ ఆటకు వీడ్కోలు పలుకగా.. వినేశ్ ఫోగట్, బజరంగ్ పూనియా, విజేందర్ యాదవ్‌లు తమ అవార్డులను వెనక్కి ఇచ్చారు. నిబంధనలు పాటించకుండా నేషనల్ చాంపియన్‌షిప్స్ షెడ్యూల్ ప్రకటించారని కొత్త కార్యవర్గంపై క్రీడాశాఖ మళ్లీ వేటు వేసింది. అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసింది. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) కనుసన్నల్లో నడుస్తున్న అడ్‌హాక్ కమిటీ.. ఈ సమయంలో జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్స్‌ను ఎందుకు నిర్వహించలేదని రెజ్లింగ్ క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు.

అదును చూసి.. : సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్, బజరంగ్ పూనియాలపై వ్యతిరేక ప్రచారం జోరుగా సాగింది. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) సాయంతో రెజ్లర్లు బాధపడుతున్న ఫోటోలను సైతం నవ్వుతున్నట్టు చూపిస్తూ సోషల్ మీడియాలో వదిలారు. వ్యక్తిగత స్వార్థం కోసం ఆందోళనకు దిగారనే వ్యతిరేక వార్తలు ప్రచారం చేశారు. అయినా, మల్లయోధులు ఎక్కడా తగ్గలేదు. తాజాగా అవార్డులు వెనక్కి ఇస్తూ నిరసన వ్యక్తం చేయటంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ఇన్ని రోజులు లైంగిక వేధింపుల అంశంలో దిగ్గజ రెజ్లర్లను ఎన్ని విధాలుగా ఇబ్బంది పెట్టినా పైచేయి సాధించలేని బ్రిజ్‌భూషణ్‌కు.. ఇప్పుడు సరైన ఆయుధం చిక్కినట్టైంది. జూనియర్ రెజ్లింగ్ పోటీల పేరుతో అదును చూసి వినేశ్, సాక్షి, బజరంగ్‌లపై యువ క్రీడాకారులను ఉసిగొల్పాడు. ఉత్తరప్రదేశ్ నుంచి బస్సుల్లో జూనియర్ రెజ్లర్లు జంతర్ మంతర్ వద్దకు చేరుకుని మూడు గంటల పాటు నిరసన వ్యక్తం చేశారు. బ్రిజ్‌భూషణ్ సింగ్ సన్నిహితులు ఆఫీస్‌బేరర్లుగా కొనసాగుతున్న రాజధాని చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి సైతం జూనియర్ రెజ్లర్లను బస్సుల్లో తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. రెజ్లింగ్ కుటుంబంలో సీనియర్, జూనియర్ చిచ్చు పెట్టి బ్రిజ్‌భూషణ్ చలి కాచుకుంటున్నాడు.

విచిత్ర వాదన : జంతర్ మంతర్ వద్ద జూనియర్ రెజ్లర్ల డిమాండ్ విచిత్రం. జాతీయ పోటీల జాప్యంతో జూనియర్ రెజ్లర్లు ఓ ఏడాది నష్టపోతే.. ఆ లోటు భర్తీ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని సహజంగా కోరుతారు. రానున్న టోర్నీలకు సైతం అనుమతి ఇచ్చేలా డిమాండ్ చేయటం న్యాయం. అందుకు విరుద్ధంగా కొత్త కార్యవర్గంపై విధించిన సస్పెన్షన్‌ను పది రోజుల్లోగా ఎత్తివేయాలని కోరటంతోనే ఇది బ్రిజ్‌భూషణ్ ప్రేరేపిత ఆందోళన అని స్పష్టమైంది.

సస్పెన్షన్ తొలగించాలి

జూనియర్ రెజ్లర్ల ఆందోళన


న్యూఢిల్లీ : భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) కొత్త కార్యవర్గానికి అనుకూలంగా బుధవారం న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కొంతమంది యువ రెజ్లర్లు ఆందోళనకు దిగారు. రూల్స్ పాటించకుండా జూనియర్ నేషనల్స్ షెడ్యూల్ ప్రకటన చేయటంపై ఫిర్యాదు అందటంతో కొత్త కార్యవర్గంపై క్రీడాశాఖ వేటు వేసింది. కార్యవర్గంపై సస్పెన్షన్‌తో జాతీయ జూనియర్ పోటీలు మరింత ఆలస్యం కావటం, ఏజ్ గ్రూప్ పోటీలకు సన్నద్ధం అవుతున్న క్రీడాకారులు ఓ ఏడాది నష్టపోతారని జూనియర్ రెజ్లర్లు వాపోయారు. 'పది రోజుల్లో డబ్ల్యూఎఫ్‌ఐ కార్యవర్గంపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలి. ఏం తప్పు జరిగిందని క్రీడాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. సస్పెన్షన్ తొలగించకుంటే.. మళ్లీ ఇక్కడే ధర్నాకు దిగుతామని' సుమారు 300 మంది జూనియర్ రెజ్లర్లు అన్నారు.

'సంజయ్ సింగ్ లేని కార్యవర్గంపై మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. లైంగిక వేధింపులకు గురి చేసిన వ్యక్తులు రెజ్లింగ్ ఫెడరేషన్‌ను నడపకూడదని మా డిమాండ్. బ్రిజ్‌భూషణ్ అనుచరులు మళ్లీ బెదిరిస్తున్నారు. మా కుటుంబ సభ్యులపై కేసు పెడతామని భయపెడుతున్నారు. రెజ్లింగ్ కార్యవర్గంలో చేరాలనే ఆలోచన లేదు. కానీ కార్యవర్గంలో మహిళలకు ప్రాధాన్యత ఉండాలి. జూనియర్ రెజ్లర్లకు న్యాయం చేయాలని, మళ్లీ లైంగిక వేధింపుల ఘటనలు జరుగకూడదనే పోరాటం చేశాం. రెజ్లింగ్ కోసం 20 ఏండ్ల చెమటోడ్చాను. గత కొన్ని నెలలుగా ఎంతటి క్షోభ అనుభవించానో నాకు మాత్రమే తెలుసు' - సాక్షి మాలిక్



నవచిత్రం


విజువల్ ట్రీట్‌గా హను-మాన్



డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, తేజ సజ్జ కాంబోలో రూపొందిన చిత్రం 'హను-మాన్'. ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన రావడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.మేకర్స్ ఇప్పటివరకు మూడు పాటలను విడుదల చేసారు. అవన్నీ చార్ట్‌బస్టర్‌గా నిలిచాయి. జోనర్, కంపోజిషన్ పరంగా దేనికవే ప్రత్యేకమైన పాటలుగా అలరించాయి. తాజాగా మంగళవారం మేకర్స్ 4వ సింగిల్‌గా 'శ్రీరామధూత స్తోత్రం..' విడుదల చేశారు.

శ్రీ ఆంజనేయ స్తోత్రం థండర్స్‌తో కూడిన బీట్స్‌కి అనుగుణంగా గౌరహరి అద్భుతంగా కంపోజ్ చేశారు. సాయి చరణ్ భాస్కరుణి, లోకేశ్వర్ ఎదర, హర్షవర్ధన్ చావలి ఎనర్జిటిక్ వాయిస్ పాట థీమ్‌తో ఇంటెన్స్‌ని జోడిస్తుంది. ఈ లిరికల్ వీడియో 3డీ ప్రజంటేషన్ చాలా అమేజింగ్‌గా ఉంది. విజువల్స్‌తో చూసినప్పుడు ఇది గూస్‌బంప్‌లను కలిగించనుంది. మొదటి మూడు పాటల్లాగే శ్రీరామదూత స్తోత్రం కూడా అందరి మనసులను గెలుచుకోబోతోంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె నిరంజన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, శ్రీమతి చైతన్య సమర్పిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా అస్రిన్ రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్‌గా వెంకట్ కుమార్ జెట్టి, అసోసియేట్ ప్రొడ్యూసర్‌గా కుశాల్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. తేజ సజ్జ సరసన అమృత అయ్యర్ కథానాయికగా నటించగా, వరలక్ష్మి శరత్‌కుమార్, వినయ్ రాయ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

అంజనాద్రి అనే ఇమాజనరీ ప్లేస్‌లో సెట్ చేసిన ఈ సినిమా కాన్సెప్ట్ యూనివర్సల్‌గా ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా మంచి విజయం సాధించే అవకాశం ఉందనే దీమాని నిర్మాతలు వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఈనెల 12న తెలుగు, హిందీ, మరాఠీ, తమిళం, కన్నడ, మలయాళం, ఇంగ్లీష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్‌తో సహా పలు భారతీయ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రానికి డీవోపీ: దాశరధి శివేంద్ర, ఎడిటర్: సాయిబాబు తలారి.


గోపీచంద్

5న భీమా టీజర్..

గోపీచంద్ హీరోగా తెరకెక్కుతున్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా'. కన్నడ దర్శకుడు ఎ హర్ష దర్శకత్వం వహిస్తుండగా, శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. మంగళవారం మేకర్స్ టీజర్ అప్డేట్ ఇచ్చారు. టీజర్‌ని 5న విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. టీజర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో గోపీచంద్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తున్నారు. హై స్టాండర్డ్ టెక్నికల్, ప్రొడక్షన్ వాల్యూస్‌తో భారీ ఎత్తున తెరకెక్కుతున్న ఈ సినిమాలో గోపీచంద్ సరసన ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

'సైంధవ్'.. నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ : వెంకటేష్



వెంకటేష్ నటిస్తున్న తన 75 వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈనెల 13న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో మేకర్స్ మంగళవారం థియేట్రికల్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో వెంకటేష్ మాట్లాడుతూ,'ట్రైలర్ అద్భుతంగా వచ్చింది. సినిమా కూడా తప్పకుండా మీ అందరికీ బాగా నచ్చుతుంది. 75వ చిత్రంగా 'సైంధవ్' లాంటి సినిమా చేయడం అదృష్టం. దర్శకుడు, డీవోపీ, మ్యూజిక్ డైరెక్టర్ మా టీం అంతా అద్భుతంగా వర్క్ చేశారు. మా నిర్మాతలు సినిమాకి కావాల్సిన ప్రతీదీ సమకూర్చారు. మంచి ఎమోషన్‌తో న్యూ ఏజ్ యాక్షన్‌తో ఫాస్ట్ పేస్డ్ ఫిలిం ఇది. 15వ నిమిషం నుంచే ప్రేక్షకులు సినిమాలో ఇన్వాల్ అవుతారు. ఇది నా కెరీర్‌లో ఒక బెస్ట్ ఫిల్మ్. సంక్రాంతికి రియల్ ట్రీట్' అని అన్నారు.

వెంకటేష్ అంటే నాకు చాలా ఇష్టం, గౌరవం. ఇలాంటి పెద్ద స్టార్‌తో సినిమా చేసే అవకాశం రావడం నా అదృష్టం. ఆయన ఇచ్చిన సపోర్ట్ మర్చిపోలేనిది. ఆయన నాకు స్ఫూర్తి. ఆయనతో సినిమా చేయడం కల నేరవేరినట్లయ్యింది. అందరూ ఈనెల 13న సినిమా చూడండి. సినిమా విందు భోజనంలా ఉంటుంది.
- నిర్మాత వెంకట్ బోయనపల్లి

'వెంకటేష్ 75వ చిత్రం చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ట్రైలర్‌లో కథ చెప్పేశాను. ఇంత ధైర్యంగా కథ చెప్పానంటే సినిమా లోపల ఎంత ఉందో మీ ఇమాజినేషన్‌కే వదిలేస్తున్నాను. ఇది నా బెస్ట్ ఫిల్మ్. వెంకీ మామ సినిమా అంటేనే పండగ. ఈ పండక్కి అందరినీ ఎంటర్‌టైన్ చేస్తుంది. సినిమా చూసి ఎంజాయ్ చేయండి' అని డైరెక్టర్ శైలేష్ కొలను చెప్పారు. ఈ వేడుకలో గెటప్ శ్రీను, చైతన్యతో పాటు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహాని శర్మ, ఆండ్రియా జెరెమియా, సారా, జయప్రకాష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు, డీవోపీ: యస్.మణికందన్, సంగీతం: సంతోష్ నారాయణన్, ఎడిటర్: గ్యారీ బిహెచ్.



మిస్ పర్ఫెక్ట్

డిస్నీ ప్లస్ హాట్ స్టార్ కొత్త ఏడాదిలో 'మిస్ పర్ఫెక్ట్' అనే మరో సరికొత్త సిరీస్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. మిస్ పర్ఫెక్ట్ ఎంత పర్ఫెక్ట్‌గా వర్క్ చేసింది?, చేయించింది అనేది ఈ వెబ్ సిరీస్‌లో హిలేరియస్‌గా చూపించబోతున్నారు దర్శకుడు విశ్వక్ ఖండేరావ్.

లావణ్య త్రిపాఠీ, అభిజీత్ దుద్దాల, అభిజ్ఞ ఉతలూరు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ వెబ్ సిరీస్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. ఈ సిరీస్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంగళవారం రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా లావణ్య త్రిపాఠీ స్పందిస్తూ, 'న్యూ ఇయర్‌ను పర్ఫెక్ట్‌గా మొదలు పెట్టబోతున్నాం...' అంటూ ట్వీట్ చేసింది. 'ఇదొక యూనిక్ స్టోరీ. మన జీవితాల్లో అనుకోకుండా ఏర్పర్చుకునే కొన్ని కనెక్షన్స్ ఎలాంటి మలుపులు తీసుకుంటాయి అనే కథతో ఎంటర్‌టైనింగ్ లవ్‌స్టోరీగా దీన్ని రూపొందించాం. అన్ని వర్గాల ఆడియెన్స్ ఈ సిరీస్‌తో కనెక్ట్ అవుతారు. త్వరలోనే డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ప్రసారం అవుతుంది' అని నిర్మాత సుప్రియ చెప్పారు.


మేగోటి సంజీవ్, రాశి, శివ కంఠమనేని

అందర్నీ మెప్పించే రాఘవ రెడ్డి

శివ కంఠమనేని హీరోగా, రాశి, నందితా శ్వేత ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'రాఘవ రెడ్డి'. స్పేస్ విజన్ నరసింహా రెడ్డి సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యూజిక్ బ్యానర్‌పై సంజీవ్ మేగోటి దర్శకత్వంలో కె ఎస్.శంకర్ రావ్, జి.రాంబాబు యాదవ్, ఆర్.వెంకటేశ్వర్‌రావు నిర్మించారు. ఈ మూవీ ఈనెల 5న విడుదలవుతోంది.

ఈ సందర్భంగా మంగళవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. నిర్మాత సి.కళ్యాణ్, తుమ్మల ప్రసన్నకుమార్ సినిమా సక్సెస్‌ఫుల్‌గా ఆడాలని ఆశించారు. నిర్మాత ఆర్.వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ, 'మా బ్యానర్‌లో వస్తోన్న మూడో సినిమా ఇది. దీన్ని పెద్ద సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.'రాఘవ రెడ్డి చిత్రంతో శివ కంఠమనేని మంచి విజయాన్ని సొంతం చేసుకోవాలి' అని కో ప్రొడ్యూసర్ శ్రీధర్ రెడ్డి చెప్పారు. దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, "రాఘవరెడ్డి' సినిమా రూపంలో ఈ ఏడాది నాకొక మంచి దిశ, దశ ఉంటుందని భావిస్తున్నాను. సినిమాలో అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్నాయి' అని తెలిపారు. 'ఇది మేం చేసిన మూడో సినిమా. తప్పకుండా ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని శివ కంఠమనేని అన్నారు.



ప్రణం దేవరాజ్, రవి శివ తేజ, ఆకాష్ పూరి

గ్రామీణ నేపథ్య కుటుంబ కథా చిత్రం

ప్రణం దేవరాజ్ ప్రధాన పాత్రధారిగా, శంకర్ దర్శకత్వంలో పి.హరికృష్ణ గౌడ్ నిర్మాణంలో ఓ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రూపొందుతోంది. హరి క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.1గా తెలుగు, కన్నడ భాషలలో ఏకకాలంలో తెరకెక్కనున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో మంగళవారం ఘనంగా ప్రారంభమైంది.

ముహూర్తపు సన్నివేశానికి ఆకాష్ పూరి క్లాప్ కొట్టగా, దేవరాజ్ కెమెరా స్విచాన్ చేశారు. తనికెళ్ల భరణి మేకర్స్‌కి స్క్రిప్ట్ అందించి, తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు శంకర్ మాట్లాడుతూ,'ఇది నా మొదటి సినిమా. ఈ అవకాశం ఇచ్చిన నిర్మాత హరి గౌడ్‌కి ధన్యవాదాలు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. మొదటి షెడ్యూల్ జనవరి మూడో వారం నుంచి హైదరాబాద్, తర్వాత వైజాగ్ పరిసర ప్రాంతాల్లో నిర్విరామంగా జరుగుతుంది' అని అన్నారు

'ఇది తెలుగులో నాకు మూడో చిత్రం. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ ఉన్న కథ. మంచి లవ్ స్టోరీ, యాక్షన్ ఉంది' అని హీరో ప్రణం దేవరాజ్ చెప్పారు. 'దర్శకుడు శంకర్ చాలా అద్భుతమైన కథని రాసుకున్నారు. హరి గౌడ్ మంచి అభిరుచి ఉన్న నిర్మాత. సినిమా తప్పకుండా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని రవి శివతేజ అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ, 'ఇది మా మొదటి ప్రొడక్షన్. మంచి కంటెంట్ ఉన్న కథతో సినిమా చేస్తున్నాం' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2014/59462.

బిజినెస్

హెచ్ఆర్‌హెచ్ నెక్ట్స్ సర్వీసెస్ లిస్టింగ్



హైదరాబాద్ : బీపీఓ సేవలందించే హెచ్ఆర్‌హెచ్ నెక్ట్స్ సర్వీసెస్ బుధవారం నేషనల్ స్టాక్ ఎక్స్చేంజీ (ఎన్ఎస్ఈ) ఎస్ఎంఈ వేదికలో లిస్టింగ్ అయ్యింది. ఉదయం 13.86 శాతం ప్రీమియంతో రూ.41 వద్ద ప్రారంభమైంది. దీని ఇష్యూ ధర రూ.36గా ఉంది. డిసెంబర్ 27తో ఆ సంస్థ ఐపీఓ ముగిసింది. ఈ సంస్థకు బ్యాంకింగ్, ప్రభుత్వ విద్యా, వైద్యం, ఫుడ్‌టెక్, ఈ-కామర్స్ తదితర రంగాల్లో క్లయింట్లను కలిగి ఉంది. ముంబయిలో ఎన్ఎస్ఈ నుంచి లిస్టింగ్ సర్టిఫికెట్‌ను హెచ్ఆర్‌హెచ్ నెక్ట్స్ సర్వీసెస్ ఎండీ అంకిత్ షా అందుకున్నారు.

ఎఎస్‌బీఏ స్పాన్సర్‌గా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

ముంబయి : సెకండరీ మార్కెట్‌లో ఎఎస్‌బిఎకు సదుపాయాన్ని కల్పించేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్పాన్సర్, డెస్టినేషన్ బ్యాంక్‌గా వ్యవహరించనున్నట్లు ఆ విత్త సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. నగదు, ఈక్విటీ డెరివేటివ్స్ విభాగాలలో ఎన్ఎస్ఈ, బీఎస్ఈలకు ప్రముఖ క్లియరింగ్ , సెటిల్‌మెంట్ బ్యాంక్‌గా ఉన్న తాము జనవరి 01 నుంచి ఇండియన్ స్టాక్ ఎక్స్చేంజీలలో సెకెండరీ మార్కెట్లలో బ్లాక్ చేయబడిన మొత్తానికి మద్దతు ఇచ్చే ట్రేడింగ్‌కు స్పాన్సర్, డెస్టినేషన్ బ్యాంక్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపింది.

మార్కెట్లకు రెండో రోజూ నష్టాలు..



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాలు చవి చూశాయి. సూచీలు గరిష్టానికి చేరుకోగా మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపుతున్నారు. దీంతో బుధవారం సెషన్‌లోనూ బీఎస్ఈ సెన్సెక్స్ 536 పాయింట్ల పతనంతో 71,357కు తగ్గింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 148 పాయింట్ల నష్టంతో 21,517 వద్ద ముగిసింది. దాదాపు 1,917 షేర్లు రాణించగా.. 1,390 షేర్లు నష్టాలు చవి చూడగా.. మరో 79 స్టాక్స్ యథాతథంగా నమోదయ్యాయి.

ఎఎస్‌టీసీకి 100 టాటా విద్యుత్ బస్సులు

గౌహతి : అసోం స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎఎస్‌టీసీ)కు 100 విద్యుత్ బస్సులను సరఫరా చేసినట్లు దేశంలోనే అతిపెద్ద వాణిజ్య వాహనాల తయారీదారు టాటా మోటార్స్ ప్రకటించింది. 9-మీటర్ల, ఎయిర్ కండిషన్డ్ టాటా అల్ట్రా ఇవి బస్సులు గౌహతి రోడ్లపై తిరుగనున్నాయని పేర్కొంది. ఈ జీరో ఎమిషన్ బస్సులను దేశీయంగా తయారు చేసినట్లు తెలిపింది. ఇప్పటి వరకు భారత్‌లో 1,500 పైగా ఇవి బస్సులను సరఫరా చేసినట్లు పేర్కొంది.

వేతనాల్లో కోతలను నిరసిస్తూ వ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల 144 గంటల సమ్మె

న్యూఢిల్లీ : వేతనాల్లో కోతలను నిరసిస్తూ బ్రిటన్ వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు సమ్మెకు దిగారు. 144గంటల కార్యాచరణలో భాగంగా బుధవారం ఉదయం 7గంటల నుండి ఈ సమ్మె ఆరంభమైంది. ఎన్‌హెచ్ఎస్ చరిత్రలోనే సుదీర్ఘమైన ఈ సమ్మె జనవరి 9వ తేదీ మంగళవారం ఉదయం 7గంటలతో ముగుస్తుంది. శీతాకాలం ప్రారంభం కావడంతో వైరస్‌ల వ్యాప్తితో ఆరోగ్య సేవలపై ఒత్తిడి పెరగనున్న తరుణంలో సమ్మె ప్రారంభమైంది. ఇదిలావుండగా, తక్షణమే సమ్మెను విరమించి, చర్చలకు రావాల్సిందిగా ఆరోగ్య, సామాజిక సంక్షేమ విభాగం మంగళవారం బ్రిటీష్ మెడికల్ అసోసియేషన్ (బిఎంఎ)ను కోరింది.

కిడ్నాప్ కేసులోఐదుగురు మణిపూర్ విద్యార్థులపై సీబీఐ చార్జిషీట్

ఇంఫాల్ : మణిపూర్ జాతి హింసకు సంబంధమున్న ఇద్దరు విద్యార్థుల కిడ్నాప్, అనుమానిత హత్య కేసులో సీబీఐ రెండు వేర్వేరు చార్జిషీట్‌లను నమోదు చేసింది. ఇందులో ఐదుగురు విద్యార్థుల పేర్లను చేర్చింది. గువహతిలోని కామ్రూప్ (మెట్రో) జ్యుడీషియల్ మేజిస్ట్రేటు ముందు ఈ చార్జిషీట్లను నమోదు చేసింది. దర్యాప్తును ప్రారంభించిన నాలుగు నెలల్లో సీబీఐ ఈ చార్జిషీట్లను నమోదు చేయటం గమనార్హం. కిడ్నాప్, హత్యకు గురైన ఇద్దరు విద్యార్థులు ఫిజమ్ హేమన్‌జిత్ సింగ్ అనే 20 ఏండ్ల యువకుడు, లిన్‌తోయ్‌గంబీ హిజమ్ అనే 17 ఏండ్ల బాలిక మృతదేహాలను ఇంకా స్వాధీనపర్చుకోవాల్సి ఉన్నది. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన ఈ ఘటన మణిపూర్ రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారి ఆందోళనలకు దారి తీసిన విషయం విదితమే.

తమిళనాడులో 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'

- ప్రధానిని ఆహ్వానించనున్న ఉదయనిధి స్టాలిన్

చెన్నై : తమిళనాడులో ఈ నెలలో జరగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను పురస్కరించుకొని ప్రధాని మోడీని ఆ రాష్ట్ర క్రీడా మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆహ్వానించనున్నారు. ఈ మేరకు ఆయన నేడు ఢిల్లీకి వెళ్లి మోడీని కలవనున్నారు. ఈ విషయాన్ని ఉదయనిధి స్టాలిన్ వెల్లడించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ తొలిసారిగా తమిళనాడులో జరుగుతున్నాయి. ఈ నెల 19 నుంచి 31వరకు ఈ గేమ్స్ జరగనున్నట్టు ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. తాను వెళ్లి ప్రధానిని ఆహ్వానిస్తానని, రావటం.. రాకపోవటమనేది ఆయన ఇష్టమని చెప్పారు. తూత్తుకుడితో పాటు దక్షిణాది ప్రాంతాల్లో వర్షాలు, వరదల నష్టాన్ని అంచనా వేయటానికి తమిళనాడులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన అనంతరం ఆమె నిధులు విడుదల చేస్తారనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

విధులు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లోనే కొనసాగవచ్చు

- ఐఏఎస్, ఐపీఎస్‌లకు హైకోర్టులో ఊరట

హైదరాబాద్ : క్యాట్ ఉత్తర్వులతో తెలంగాణలో కొనసాగుతున్న ఐఏఎస్, ఐపీఎస్‌లకు హైకోర్టులో ఊరట లభించింది. కేటాయింపులపై అభ్యంతరాలున్న అఖిలభారత సర్వీసు అధికారుల విజ్ఞప్తులను మరోసారి పరిగణనలోకి తీసుకొని తిరిగి కేటాయింపులు జరపాలని హైకోర్టు ధర్మాసనం బుధవారం కేంద్రాన్ని ఆదేశించింది. అప్పటి వరకు ఆయా ఐఏఎస్, ఐపీఎస్‌లు ప్రస్తుతం విధులు నిర్వహిస్తోన్న రాష్ట్రాల్లోనే కొనసాగొచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. విభజన సమయంలో ఏపీకి కేటాయించినా.. కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ ఉత్తర్వులతో 13 మంది ఐఏఎస్ అధికారులు తెలంగాణలోనే కొనసాగుతున్నారు.

ఇంటర్‌బోర్డును లూటీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం

- రూ.252 కోట్లు దారిమళ్లింపు
- సమగ్ర విచారణ జరపాలి : ఇంటర్ విద్యాజేఏసీ చైర్మెన్ మధుసూదన్‌రెడ్డి డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటర్ బోర్డును లూటీ చేసిందని ఇంటర్ విద్యాజేఏసీ చైర్మెన్ పి మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. ఇంటర్ బోర్డుకు చెందిన సుమారు రూ.252 కోట్ల నిధులను దారిమళ్లించిందని ఆరోపించారు. గత ప్రభుత్వ నిర్ణయాలు, ఇంటర్ బోర్డు నిధులకు సంబంధించిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డులో ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా ఉన్న రూ.150 కోట్లను గత ప్రభుత్వ ఖజానాకు దారిమళ్లించిందని చెప్పారు.

తెలుగు అకాడమికి ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.52 కోట్లను ఇంటర్ బోర్డు చెల్లించేలా ఆదేశాలిచ్చిందని అన్నారు. పలు జూనియర్ కాలేజీల్లో అదనపు తరగతి గదులు, మౌలిక వసతుల కల్పన, డీఐఈవో కార్యాలయాలకు కంప్యూటర్లు, ప్రింటర్ల సరఫరా, ఇంటర్ విద్యా కమిషనర్ కార్యాలయంలో సోలార్ రూఫ్ ప్యానెల్ ఏర్పాటు, ఇతర పనుల మరమ్మతులకు సుమారు రూ.50 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. ఇంటర్ బోర్డు నిధులను పరీక్షల నిర్వహణ, అధ్యాపకులకు శిక్షణ, అకడమిక్ అంశాలు, పాఠ్యాంశాల రూపకల్పన, డిజిటల్ తరగతి గదుల కోసం వినియోగించాలని చెప్పారు. ఇంటర్ బోర్డు ఏర్పడినప్పటి నుంచి నిధులను ఇతర అవసరాలకు వినియోగించిన పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ తరహాలో ఇంటర్ బోర్డు నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం వినియోగించొద్దని కోరారు. ఇంకోవైపు గతేడాది ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణ, స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న సుమారు 25 వేల మంది సిబ్బంది, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో పాల్గొన్న 15 వేల మంది కలిపి 40 వేల మందికి పూర్తిస్థాయిలో రెమ్యూనరేషన్ చెల్లించలేదని చెప్పారు. కొందరికి 80 శాతం ఇస్తే, ఇంకొందరికి 50 శాతం, మరికొందరికి ఏమీ ఇవ్వలేదని అన్నారు. బోర్డు నిధులు దారిమళ్లించడం వల్ల అధ్యాపకులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వతంత్ర ప్రతిపత్తి గలిగిన సంస్థల నిధులను దారిమళ్లించి వాటిని బలహీనం చేయడం సరైంది కాదన్నారు. విద్యారంగాన్ని గత ప్రభుత్వం గాలికొదిలేసిందని చెప్పారు.

ఇంటర్ బోర్డు నుంచి రూ.252 కోట్లు ప్రభుత్వం తీసుకుంటే పదో షెడ్యూల్‌లోని ఇతర సంస్థలు, శాఖల నుంచి ఎన్ని కోట్ల రూపాయలు తీసుకున్నదోనని ఆరోపించారు. ఇంటర్ విద్యార్థులకు ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలను అందిస్తున్నట్టు గత ప్రభుత్వం చెప్పిందన్నారు. తెలుగు అకాడమికి రూ.52 కోట్లు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. అధ్యాపకులను రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో లబ్ది పొందేందుకే అయోధ్య అంశం

- బీజేపీ కుయుక్తులను తిప్పికొట్టండి : పార్టీ శ్రేణులకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే లోక్ సభ ఎన్నికల్లో సెంటిమెంట్‌ను రగిల్చి లబ్ది పొందేందుకు అయోధ్య రామాలయ అంశాన్ని బీజేపీ ప్రచారాస్త్రంగా ఎత్తుకుందనీ, దాని కుయుక్తులను తిప్పికొట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ముఖ్దూంభవన్‌లో బుధవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే పార్టీ రాష్ట్ర సమితి సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోడీ సెంటిమెంట్ వాతావరణాన్ని సష్టించి, రామాలయ ప్రారంభోత్సవాన్ని ఓట్లు దండుకునే కార్యక్రమంగా మారుస్తున్నారని దుయ్యబట్టారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా పలు మార్పులు చోటుచేసుకోబోతున్నాయని తెలిపారు. సీపీఐ శ్రేణులు ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రమాదకారిగా మారిందనీ, సంస్థాగత వ్యవస్థలను నియంత్రిస్తోందని విమర్శించారు. అందరికీ సన్ స్ట్రోక్ వస్తే, మాజీ సీఎం కేసీఆర్‌కు డాటర్ స్ట్రోక్ వచ్చిందనీ, కుమార్తె కోసం ఆయన బీజేపీతో రాజీపడ్డారని విమర్శించారు. సీపీఐ జాతీయ సమితి సమావేశాలు హైదరాబాద్‌లో ఫిబ్రవరి 2,3వ తేదీలలో జరగనున్నట్టు నారాయణ తెలిపారు. ఈ సమావేశాలకు పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాబీర్ పాషా తదితరులు హాజరయ్యారు.

ఎంవీ యాక్టు సవరణ బిల్లును తగులబెట్టిన బీఎంఎస్



- కేంద్రం వెనక్కి తీసుకోకపోతే ఈనెల 25 తర్వాత దేశవ్యాప్త సమ్మె
- డ్రైవర్లకు పదేండ్ల జైలు, రూ.7 లక్షల జరిమానా సరిగాదు
- బీపీటీఎమ్ఎమ్(బీఎంఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంవీ యాక్టు సవరణ బిల్లును ఆ పార్టీ అనుబంధ సంఘమే తగులబెట్టింది. డ్రైవర్లకు పదేండ్ల జైలు శిక్ష, రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల జరిమానా సరిగాదని సూచించింది. దాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో భారతీయ ప్రయివేటు ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్(బీఎంఎస్ అనుబంధం) ఆధ్వర్యంలో ఎంవీ యాక్టు సవరణ బిల్లును డ్రైవర్లు తగులబెట్టిరు. ఈ సందర్భంగా బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్ మాట్లాడుతూ.. న్యాయ సంహిత బిల్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ నెల 25 తరువాత దేశ వ్యాప్తంగా రవాణా సమ్మె చేస్తామని హెచ్చరించారు. న్యాయ సంహితలో పేర్కొన్న విధంగా ఏదైనా డ్రైవర్ యాక్సిడెంట్ చేసిన తరువాత తప్పించుకుంటే డ్రైవర్‌కు పదేండ్ల జైలు, ఏడు లక్షల రూపాయల జరిమానా విధించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఐఆర్‌డీఏ పెంచిన ప్రయివేటు రవాణా వాహనాల ఇన్సూరెన్స్‌ను వెంటనే 50 శాతం తగ్గించాలని డిమాండ్ చేశారు. రవాణా వాహనాలకు వివిధ రకాలుగా ఉన్న టాక్స్‌ను ఒకే దేశం-ఒకే పన్ను విధానాన్ని తేవాలని కోరారు. డ్రైవర్లకు రూ.10 లక్షల ఆరోగ్య బీమా, ప్రమాద, సహజ మరణ బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారులపై డ్రైవర్ల కోసం విశ్రాంతి గృహాలు, సబ్సిడీ క్యాంటీన్లు, ప్రాథమిక వైద్యశాలలు నిర్మాణం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ప్రయివేటు ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ ఉపాధ్యక్షులు హబీబ్, శంకర్, మినీగూడ్స్ వెహికిల్ యూనియన్ నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, జహంగీర్, మనోజ్ ఆటో యూనియన్ నాయకులు పెంటయ్య, నంద కిషోర్, కిషన్, రాములు ,మహేష్ రంగ తదితరులు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌కు జగన్ కేసీఆర్‌ను పరామర్శించనున్న ఏపీ సీఎం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేడు హైదరాబాద్‌కు రానున్నారు. ఇటీవల తుంటి మార్పిడి శస్త్ర చికిత్స చేసుకున్న తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను ఆయన పరామర్శించనున్నారు. ఉదయ తాడేపల్లి గూడెం నుంచి బయలు దేరి గన్నవరం చేరుకుని అక్కడి నుంచి విమానంలో హైదరాబాద్ చేరుకుంటారు.

తొలి మహిళా ఉపాధ్యాయులు, ఆదర్శనీయులు సావిత్రిబాయి పూలే

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సమాజానికి గొప్ప ఆదర్శనీయులు సావిత్రిబాయి పూలే అని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ కొనియాడారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఆయనతో పాటు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆలె భాస్కర్, తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ..సమాజంలో వితంతువుల పట్ల వివక్షకు వ్యతిరేకంగా, అక్రమ సంతానం పేరిట శిశువుల హత్యలకు వ్యతిరేకంగా ఆమె అనేక పోరాటాలు నడిపారని గుర్తుచేశారు. వితంతువులను దగ్గరకు తీసి ఆశ్రయం కల్పించి అందరితో సమానం బతికాలని తపించిన సామాజిక విప్లవ మాతృమూర్తి అని కొనియాడారు. విద్యా వైద్య, రాజకీయ రంగాల్లో మహిళలు రాణించేలా ప్రధాని మోడీ తోడ్పాటునందిస్తున్నారని చెప్పారు. 11 మంది మహిళలకు మంత్రివర్గంలో చోటు కల్పించారన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ, ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. ముస్లిం మహిళలకు స్వేచ్ఛ కల్పించేలా ట్రిబుల్ తలాక్ ను రద్దు చేశారని కొనియాడారు.

అసోంలో దారుణం

- ట్రక్కు, బస్సు ఢీ.. 12 మంది మృతి
- మరో 30 మందికి గాయాలు
- గోలాఘాట్‌లో ఘటన



గువహతి : ఈశాన్య రాష్ట్రం అసోంలో దారుణం చోటు చేసుకున్నది. బొగ్గుతో కూడిన ట్రక్కు, ప్రయాణీకుల వెళ్తున్న బస్సు ఢీకొని 12 మంది మృతి చెందారు. 30 మంది వరకు గాయపడ్డారు. బుధవారం ఉదయం గోలాఘాట్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకున్నది. బాధితులు, పోలీసు అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. వీరు వెల్లడించిన సమాచారం ప్రకారం.. బస్సులో దాదాపు 45 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎక్కువగా బరలుఖువా గ్రామానికి చెందినవారున్నారు. అసోంలోని తిన్సుకియా పట్టణంలోని తిలింగ మందిర్‌కు బస్సు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రెండు వాహనాల డ్రైవర్లు వెంటనే మరణించారు. గాయపడిన వారిలో కొందరు డెర్గావ్‌లోని సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, తీవ్ర గాయాలపాలైన వ్యక్తులు జోర్హాట్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. మరణించిన వారి బంధువులకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందజేస్తామని ప్రధాని మోడీ ప్రకటించారు. గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.50,000 అందజేయనున్నారు.

క్షతగాత్రులకు అవసరమైన సహాయాన్ని స్థానిక యంత్రాంగం అందిస్తున్నదని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు. "జాతీయ రహదారి ఒక భాగానికి మరమతులు జరుగుతున్నాయి. దీంతో రెండు వైపులా ప్రయాణించే వాహనాలు డివైడర్‌కు ఒక వైపు మాత్రమే రహదారిని ఉపయోగిస్తాయి. అతి వేగంతో వస్తున్న ట్రక్కు.. బస్సును ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు" అని గోలాఘాట్ డిప్యూటీ కమిషనర్ పి. ఉదయ్ తెలిపారు. ప్రమాదానికి సంబంధించి ర్యాష్, నిర్లక్ష్యం డ్రైవింగ్ కారణంగా మరణం కేసు నమోదు చేసినట్టు గోలాఘాట్ పోలీసు సూపరింటెండెంట్ రాజేన్ సింగ్ తెలిపారు.

ఏపీలో అంగన్‌వాడీలపై కర్కశం

పలు జిల్లాల్లో అరెస్టులు, ఉద్రిక్తత

అక్కడికక్కడ అడ్డగింతలు

నిర్బంధాన్ని అధిగమించి కలెక్టరేట్ల వద్ద అంగన్‌వాడీల బైటాయింపు



విజయవాడ :అంగన్‌వాడీలపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించారు. కలెక్టరేట్ల బైటాయింపు కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి నిర్బంధాన్ని ప్రయోగించారు. పలు జిల్లాల్లో అరెస్టులకు పాల్పడ్డారు. బస్సుల్లో వెళ్తున్న అంగన్‌వాడీలను బలవంతంగా దించేశారు. ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. నిర్బంధాన్ని అధిగమించి కలెక్టరేట్ల వద్దకు చేరుకొని వేలాది మంది అంగన్‌వాడీలు బుధవారం బైఠాయించారు. నిర్బంధాలకు, బెదిరింపులకు భయపడేది లేదని, తమ న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. వారి నినాదాలతో కలెక్టరేట్లు హోరెత్తాయి.

విజయవాడలో వి.శ్రీనివాసరావు సహా పలువురు అరెస్టు

విజయవాడలో పోలీసులు సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సహా పలువురిని అరెస్టు చేశారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని అన్ని మండలాల నుంచి విజయవాడ కలెక్టరేట్‌కు వస్తున్న అంగన్‌వాడీలపై పోలీసులు విరుకుపడి బీభత్సం సృష్టించారు. నాలుగు ప్రాంతాల్లో సుమారు వెయ్యి మందిని బలవంతంగా అరెస్టు చేసి ఎంజి రోడ్డులోని ఎఆర్ గ్రౌండ్స్, మాచవరం పోలీస్ స్టేషన్, హనుమాన్‌పేటలోని శ్రీరాజరాజేశ్వరి కళావేదిక కల్యాణ ప్రాంతాలకు తరలించారు. అరెస్టుల సందర్భంగా పోలీసులు కర్కశంగా వ్యవహరించడంతో ఎల్.రమాదేవి సహా పలువురు అంగన్‌వాడీలకు తీవ్ర గాయాలయ్యాయి. అంగన్‌వాడీలతో కలిసి ర్యాలీలో వస్తున్న సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావును బలవంతంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన చేతికి తీవ్ర గాయమైంది. అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మను అరెస్టు చేశారు. యూనియన్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.సుప్రజను వెంటపడి మరీ పట్టుకుని పోలీసులు గొంతు నొక్కేయడంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్వరాజ్యం మైదానం వద్ద సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఏపీ నాయకులను పోలీసులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. ఆ తర్వాత వారందరినీ పోలీసులు విడుదల చేశారు.

రేపటి నుంచి విజయవాడలో 24 గంటల రిలేదీక్షలు



సుబ్బరావమ్మ

శుక్రవారం(ఐదవ తేది) నుండి విజయవాడలో 24 గంటల రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఏపీ ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద బైటాయింపు కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అంగన్‌వాడీలకు అభినందనలు తెలిపారు. గురువారం ఆందోళనలను కొనసాగించాలని అంగన్‌వాడీలకు పిలుపునిచ్చారు. ఆందోళనలను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

శుక్రవారం విజయవాడలో చేపట్టనున్న రిలే నిరాహార దీక్షలను యూనియన్ అఖిలభారత కార్యదర్శి ఎ.ఆర్ సింధు ప్రారంభిస్తారని తెలిపారు. శనివారం (ఆరవ తేది) అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద 24 గంటల రిలే నిరాహార దీక్షలు ప్రారంభించాలని, అదే సమయంలో ప్రస్తుతం ఎక్కడికక్కడ జరుగుతున్న